# క్రాంతి

### లోపలి పేజీల్లో...


కాకరాపల్లి కార్చిచ్చు.....5
'రచ్చబండ'కు ప్రతిఘటన.....9
ఈజిప్టు నియంత.....11
డాక్టర్ వినాయక్ సేన్.....15
కలెక్టర్ కిడ్నాప్.....17
చేనేత కార్మికుల ఆత్మహత్యలు.....18
అమరుల జీవిత చరిత్రలు.....23
పోరాటాలు-ప్రతిఘటన-సభలు.....27



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 35 సంచిక: 1 జనవరి - ఫిబ్రవరి 2011 వెల: పది రూపాయలు


# ప్రజాయుద్ధాన్ని, ఉత్పత్తిని జమిలిగా కొనసాగిస్తున్న దండకారణ్య విప్లవ ప్రజలకు జేజేలు!!

డి.కెలో విప్లవోద్యమం 30వ వార్షికోత్సవం సందర్భంగా "ఫిబ్రవరి 10 మహా భూంకాల్ రోజునుండి ఫిబ్రవరి 28వరకు జనతన సర్కార్లలో భూమి చదును కార్యక్రమాన్ని ఒక క్యాంపెయిన్‌గా చేపట్టాలని సి.పి.ఐ. (మావోయిస్టు) కేంద్ర రీజనల్ బ్యూరో నిర్ణయించింది. 2010 సెప్టెంబర్‌లో డి.కెఎస్.జెడ్.సి సర్క్యులర్‌ను విడుదల చేసింది. అందులో ఈ క్యాంపెయిన్ లక్ష్యాన్ని, కార్యక్రమాన్ని రూపొందించి బడ్జెట్‌ను కూడా కేటాయించింది.



"భూమి చదును కార్యక్రమంలో ముందుగా పేదరైతుల భూములకు ప్రాధాన్యత నివ్వాలి. పి.ఎల్.జి.ఎ బలగాలు వీరి భూముల్లోనే పాల్గొని తమ పూర్తి మద్దతును అందించాలి. గ్రామ సభల్లో ఈ విషయాన్ని చర్చించి ప్రజల పూర్తి ఆమోదంతో నిర్ణయించుకోవాలి." అని ఒక అంశంగా భూమి చదును ఏ విధంగా జరగాలో స్పష్టపరిచింది.

పార్టీ రూపొందించిన కార్యక్రమాన్ని, అవగాహనను అన్ని స్థాయిల్లో చర్చించింది జనతన సర్కార్. మహాసభల సందర్భంగా ప్రత్యేకించి ఒక రోజు కేటాయించుకొని కార్యక్రమ నిర్వహణకు సంబంధించి వర్క్‌షాపు కూడా జరిపారు. రాజకీయ సాంస్కృతిక సంస్థ సి.ఎన్.ఎమ్ కూడా వారం రోజులు వర్క్‌షాపు నిర్వహించి క్యాంపెయిన్ జరిపింది. డి.ఎ.కె.ఎమ్.ఎస్, కె.ఎ.ఎమ్.ఎస్ లాంటి ప్రజాసంఘాలను కూడా సిద్ధపరిచి విస్తృత స్థాయిల్లో ప్రచారం చేసి క్యాంపెయిన్ లక్ష్యాన్ని అన్ని సర్కార్లలోని వివిధ సెక్షన్ల ప్రజల్లోకి తీసుకెళ్ళి చర్చించింది. పంచాయితీ స్థాయిలోని జనతన సర్కార్ల గ్రామ సభల్లో చర్చించి నిర్దిష్టంగా కార్యక్రమాన్ని రూపొందించాయి. పేదల భూమి చదును, నీటివసతి మున్నగు విషయాలకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చాయి.

ఏరియా జనతన సర్కార్లలో చర్చించి భూమి చదును కార్యక్రమం ద్వారా సాగుయోగ్యత పెంచడంతో పాటు సాగు విస్తీర్ణం పెంచాలని నిర్ణయించారు. కొన్ని గ్రామాల్లో చెక్‌డ్యాంలు, చెరువులు, బావులు,

కుంటలు నిర్మించాలని నిర్ణయాలు తీసుకున్నారు. రిపేర్లు చేయాల్సిన పనులు పూర్తి చేయాలనుకున్నారు. కొన్ని గ్రామాలకు నీటిని తోడే ఇంజన్లు ఇవ్వాలనుకున్నారు. అన్ని సర్కార్లలో క్యాంపెయిన్ కాలంలో తిండికి ఇబ్బంది లేకుండా బియ్యం కొనక్కునేందుకు వీలుగా అవసరమైన డబ్బులు ఏరియా సర్కార్, పంచాయితీ సర్కార్ కలిసి అందించాలని, పనిముట్ల కోసం కొంతడబ్బు ఇవ్వాలని తీర్మానం చేశారు. పని స్థలాల్లో కూడా వైద్య సహాయం అందాలని అనుకున్నారు.

డి.కెలో అన్ని జిల్లా స్థాయి జనతన సర్కార్ల ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో అమరుడు ఆజాద్ స్మారక స్థూపాన్ని నిర్మించి ఫిబ్రవరి 10న స్థూపావిష్కరణ చేయాలని కూడా నిర్ణయం జరిగింది.

శతృనిర్భంధం మధ్యలో క్యాంపెయిన్ విజయవంతం చేయడానికి అవసరమైన రక్షణ ఏర్పాట్ల గురించి చర్చించి అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు ఎటువంటి దాడులు జరిగినా ప్రతిఘటించడానికి అన్ని రకాల శక్తుల్ని (మిలిషియా బలగాలతో సహా) ప్రజలను సంసిద్ధం చేశారు. పనులమధ్య సమన్వయానికి నిర్ధిష్టంగా క్యాంపెయిన్ సమయంలో ప్రత్యేక కమాండ్స్ ఏర్పాటుచేసి వాటి గైడెన్స్‌లో పని చేయాలని అనుకున్నారు.

30సంవత్సరాల కాలంలో విప్లవోద్యమం 3లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి ఇచ్చింది. ఈనాడు భూమిలేని రైతులు ఎవరూ లేరని చెప్పవచ్చు. చిన్న చిన్న భూకమాతాలతో, వెనుకబడిన ఉత్పత్తి విధానాన్ని, అంధవిశ్వాసాలను కలిగివున్న ఆదివాసీ ప్రజలకు రాజకీయ లక్ష్యాలు, ఉత్పత్తి లక్ష్యాలు విడివిడిగా లేవని అర్థమయ్యింది. రెండింటిని ఎలా సమన్వయిస్తున్నారో ఈ క్యాంపెయిన్ అనుభవాన్ని ప్రాథమిక సమాచారం ద్వారా అర్థం చేసుకుందాం.

ఒక జనతన సర్కార్ కమిటీ సమావేశంలో 28 రోజులు జరిగిన పనిని చర్చించినపుడు కొన్ని వివరాలు, మరికొంత అంచనాను అందించారు.

ఇక్కడ నిజానికి సమిష్టి పనులు ఫిబ్రవరి ఒకటి నుండి మొదలు పెట్టారు. వ్యక్తిగతంగా చేసుకునే పనులు జనవరి నెలలో పూర్తి చేసుకోవాలని ఫిబ్రవరి అంతా పొత్తం (సమిష్టి) పనులు, భూంకాల్ భూమి చదును క్యాంపెయిన్ ఉంటాయని ముందుగానే చెప్పడంతో ఈ ఏరియాలో అన్ని పంచాయితీ సర్కార్‌లు కూడా అలా సిద్ధపడి ఉన్నారు. అలా సమిష్టి పని లేదా క్యాంపెయిన్‌ను ఇక్కడ నెలరోజులుగా లెక్క కట్టవచ్చు. అయితే పి.ఎల్.జి.ఎ బలగాలు మాత్రం ఫిబ్రవరి 10 భూంకాల్ దివాస్‌నుండి ఈ క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు.

ప్రస్తుతం వివరాలు అందించిన స్థానిక జనతన సర్కార్‌లో రెండు (ఎ, బి) గ్రామాలున్నాయి. మొత్తం 213 కుటుంబాలు (ఎ153, బి60) ఉన్నాయి. మొత్తం (ఎ 600+బి 192) 792 మంది పనిలో పాల్గొన్నారు. ఎ గ్రామంలో 11టీంలుంటే, బి గ్రామంలో 5టీంలున్నాయి. ఒక్కొక్క టీంలో ఉన్న సంఖ్య పరిశీలిస్తే ఎ) 39,47,52,52,68,56,40,65,49,49,83 బి) 36,36,34,51,36 మంది చొప్పున ఉన్నారు. ఇందులో మహిళల సంఖ్య 40శాతం ఉంది. శతృ నిర్బంధం ఉండడంతో సెంట్రీలు 24గంటలు నడుస్తున్నాయి. ప్రతీ టీంకు ఇద్దరితో నాయకత్వం ఉంటుంది. ఒక మహిళా, ఒక పురుషుడు. పనులు, సెంట్రీలు, ఇతర సమస్యలు సమన్వయించి వివిధ కమిటీలకు ఇద్దరు మద్దతుగా ఉంటారు. ఈ క్యాంపెయిన్‌లో 28 రోజులు పని జరిగింది. మొత్తం 792 మంది ప్రజలతో పాటు పి.ఎల్.జి.ఎ బలగాలు 100మంది పాల్గొన్నారు. సుమారుగా (రోజుకు 40రూ॥కూలి) అంచనా వేస్తే 9లక్షల రూ॥ పని సమిష్టిగా జరిగింది. ఇది చిన్న విషయం కాదు. అనుకున్న పనులు జరగక పోయినా, అలాగే నిర్ణయించుకున్న చెరువు గండిపూడ్చి ఎత్తు పెంచడానికి మార్చి నెలలో కూడా మరికొన్ని రోజులు పని చేయాలనే ఉత్సాహం ప్రజల్లో ఉందని సర్కార్ నాయకత్వం చెప్పింది.

ఈ పనుల కోసం ఏరియా సర్కార్‌నుండి 50వేల రూపాయలు, తమ సర్కార్‌నుండి 6 క్వింటాళ్ళ ధాన్యం, 2 వేల రూపాయలు, అలాగే పనిముట్ల కోసం 4వేల రూపాయలు ఖర్చు చేసినట్లు (ఏరియా సర్కార్) చెప్పారు. ప్రజల స్వచ్ఛంద సహకారం 8లక్షల రూ॥ ఉంటుంది. జరిగిన పని గురించి లెక్కలు చెబుతూ ఎ) గ్రామంలో ఒకటి బి) గ్రామంలో మూడు కొత్తగా భూములను కేటాయించి, చదును చేసి ఇచ్చారు. ఎ) గ్రామంలో 13భూములు, బి) గ్రామంలో 11భూములు ధాన్యం పంటకు అనుగుణంగా అభివృద్ధి చేసారు. ఇంకా 100 కుటుంబాల భూమి చదును చేసారు. ఈ మొత్తం పనిలో భాగంగా 40 ఎకరాల భూమి కొత్తగా సాగులోకి వచ్చినట్లు తెలియజేసారు. పేద, దిగువ, ఎగువ, మధ్య తరగతి రైతాంగం భూములన్నీ ఒక వరుస క్రమంలో చదును చేస్తున్నారు. ధనిక రైతాంగం అక్కడలేరు. ఒక వడ్డే (ఆదివాసి వైద్యుడు) భూమిలో మరో రోజు కూడా పని చేయాలి అని అడిగినట్లు చెప్పారు. ఆ సమస్య మినహా ఎటువంటి సమస్యలు రాలేదన్నారు. ప్రజల్లో ఈ కార్యక్రమం పట్ల అనుకూల స్పందన కనబడడమే కాకుండా ఈ కార్యక్రమం (క్యాంపెయిన్) ఇంకా ముందు నుండి చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో సంపూర్ణ సహకారమే

కాకుండా బలమైన ఐక్యత వ్యక్తమయ్యింది.

మరికొన్ని ప్రశ్నలకు సమాధానంగా హైబ్రిడ్ విత్తనాలు రెండోసారి పంటకు పనికిరావడం లేదని, ట్రాక్టర్లతో భూమి దున్నాలన్న చర్చలు అంతగా లేవని, వర్షాధార భూములు కాబట్టి ఈదు (ఇప్ప) చెట్లు వెంటనే తొలగించడానికి సిద్ధంగా లేరని చెప్పారు. అయితే సహకార సంఘాలు చేస్తున్న పని, పొత్తం పనులు రైతాంగాన్ని సమిష్టి వ్యవసాయం వైపుకు తీసుకు వెళుతుందని, అది మంచిదేనని ప్రజల్లో అనుకూలమైన చర్చలు జరుగుతున్నట్లు చెప్పారు.

ఈ సం॥ పంటలు బాగా పండాయి. ఆంధ్రాకు కూలికి వెళ్ళలేదు. ఈ పనుల వలన స్వంత పనులు ఆగిపోయినాయన్న సమస్య గా లేదు. "అందరికీ వర్గ ప్రాతిపదికన సమాన సహకారం అందింది" అనే భావం కలిగిందన్నారు. పి.ఎల్.జి.ఎ బలగాలు మరిన్ని రోజులుండాలని కోరుకున్నారా? అని అడిగితే తమకు సంతృప్తి కలిగిందని, మిగిలిన గ్రామాలకు కూడా వెళ్ళాలి కదా అని అన్నారు.



ఈ ఏరియా జనతన సర్కార్ క్రింద 19 పంచాయితీ స్థాయి జనతన సర్కార్‌లు ఉన్నాయి. 2010 నవంబర్ 15–20 తేదీల మధ్య 6రోజులు జరిగిన సి.ఎన్.ఎమ్ కల్చరల్ వర్క్‌షాపులో 9మంది మహిళలతో పాటు 24మంది పాల్గొని 18 పాటలు, 7నాటికలు, కవితలు, కథలు రాయడంతో పాటు 2 కేసెట్లు కూడా రికార్డు చేశారు. 3 నెలలుగా అవే విషయాలను ఏరియా అంతా ప్రచార కార్యక్రమంగా తీసుకున్నారు. విప్లవ సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్పత్తి కార్యకలాపాలతో మేళవించి కొత్త సాహిత్యాన్ని సృష్టించారు.

ఫిబ్రవరి 10న భూంకాల్ సభ, అమరుడు ఆజాద్ స్థూపావిష్కరణ కూడా ఇదే ఏరియాలో జరిగింది. 2వేల 5వందల మందికి (కొన్ని గ్రామాలు) మాత్రమే పరిమితం చేసిన (శత్రునిర్బంధం కారణంగా) ఈ సభ, సాంస్కృతిక ప్రదర్శన, శత్రు దాడుల మధ్యనే విజయవంతమయ్యింది. అన్ని స్థానిక సర్కార్‌లలోను విడివిడిగా భూంకాల్ సభలు జరిగాయి. వందల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

ఫిబ్రవరి 8న అక్కడ ఒక గ్రామంపై పోలీసులు దాడిచేసి తుపాకీ కాల్పుల్లో ఒక రైతును హత్యచేసి, ఒకరిని గాయపరిచారు. కార్పెట్ సెక్యూరిటీతో రెగ్యులర్‌గా పెట్రోలింగ్స్ చేస్తున్నాడు. భూమి చదును, ఉత్పత్తి కార్యక్రమం క్యాంపెయిన్‌గా జరుగుతున్నదని పోలీసులకు సమాచారం ఉంది. పోలీస్ నిర్బంధం ఇక్కడి ప్రజలకు సాదారణ మయిపోయింది.

ముఖ్యమంత్రి రామన్‌సింగ్, జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులు దగ్గరలోకి వచ్చి 'సంస్కరణల' గురించి మాట్లాడి వెళ్ళారు గాని జనతన సర్కార్లున్న చోట వారి ప్రయత్నాలు ఏమిలేవు.

ప్రజలు అనుసరించే స్వావలంభన విధానాలు విజయవంతగా కొనసాగుతున్నాయి. బయటి ప్రాంతాల మీద ఆధారపడకుండా, ప్రత్యామ్నాయ మార్గాలను స్థానికంగా కనుగొంటున్నారు. ఇక్కడ జనతన సర్కార్ల స్థానిక మిలీషియా. పి.ఎల్.జి.ఎ రక్షణలో కార్యక్రమాలు విజయవంతమయినాయి.

ఈ రిపోర్టులో ఒక పంచాయితీ స్థాయి జనతన సర్కార్‌కు సంబంధించిన నిర్దిష్ట వివరాలను మాత్రమే పొందుపరిచాం. ఇటువంటి స్థానిక సర్కార్‌లు, ఈ ఏరియా సర్కార్‌లో 20వరకు వున్నాయి. ఏరియా సర్కార్‌లన్నీ జిల్లా సర్కార్ గైడెన్స్‌లో పని చేస్తాయి. అన్ని స్థాయిల్లో సర్కార్ కమిటీలు ప్రజాసంఘాలు, మిలీషియాల సహకారంతో జోన్ వ్యాప్తంగా ఈ క్యాంపెయిన్‌ను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రజలను మరింత ఐక్య పరచడంతో పాటు, రాజకీయంగా చైతన్యవంతం చేసింది.

ఇదే క్యాంపెయిన్‌లో మరో డివిజన్‌లో ఫిబ్రవరి 10నుండి మొదలయ్యింది. ఇక్కడ ప్రజలతో పి.ఎల్.జి.ఎ బలగాలు కలిసి

చురుకుగా పనులు చేశారు. ప్రజల్లో ఉత్సాహం, జనతన సర్కార్ల సమన్వయం, పి.ఎల్.జి.ఎ బలగాల సహకారంతో ఇక్కడ అన్ని ఏరియాల్లోను క్యాంపెయిన్ విజయవంతమైంది. సమకూర్చుకున్న తిండి పదార్థాలు చాలక కొన్ని గ్రామాల్లో క్యాంపెయిన్ అనుకున్నన్ని రోజులు జరగలేదు. మెజారిటీ గ్రామాల్లో క్యాంపెయిన్ పూర్తి స్థాయిలో జరిగింది. అనుకున్న పనులన్నీ పూర్తి చేసారు. ప్రతీ గ్రామంలోను అన్ని వయసుల వాళ్ళు ఈ కార్యక్రమాల్లో భాగం పంచుకున్నారు.

ఈ జిల్లాలో రెండు ఏరియాల్లోని 7 పంచాయితీ సర్కార్లలో జరిగిన పని వివరాలు పరిశీలిస్తే (అందుబాటులో వున్న మేరకు) ఆ సర్కార్ల కృషి అర్థమవుతుంది.

ధాన్యం పండే భూమిలేని వారికి అటువంటి అనుకూలత గల భూమిని కేటాయించి బాగు చేసారు. ఈ సందర్భంగా పశువులగురించి చర్చ చేసారు. సర్కార్ ఆధ్వర్యంలో ఉన్నవాటిని ప్రస్తుతానికి సర్దుబాటు చేయాలని, ఇంకా లేని వారుంటే సర్కార్‌లో చర్చించి పరిష్కారం చేయాలని నిర్ణయించారు.

ఈ జిల్లాలో కూడ సాంస్కృతిక కార్యక్రమాలు, వీడియోలో మన కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజకీయ శిక్షణ, వైద్య సహకారం అందించారు. గురూజీలను, విద్యార్థులను భాగం చేసారు.

లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌లున్న దోపిడివర్గాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే సంస్కరణలు అన్నీ బూటకమే. ప్రజల్లో

| **ఎ ఏరియాలో 4 స్థానిక జనతన సర్కార్లలో (ఎబిసిడిలలో ) వివరాలు :** | | | | |
|---|---|---|---|---|
| ఎ సర్కార్‌లో | 4గ్రామాలున్నాయి. | 640 మంది పని చేసారు. | 9 రోజులు | 13 పొలాలు బాగు చేసారు. |
| బి ” | 3 ” | 460 ” | 18 ” | 37 ” |
| సి ” | 4 ” | 380 ” | 10 ” | 7 ” |
| డి ” | 3 ” | 300 ”<br>+ పి.ఎల్.జి.ఎ 115 మంది | 18 ” | 17 ” |
| **బి ఏరియాలో 3స్థానిక జనతన సర్కార్లలో (ఎబిసిలలో ) వివరాలు :** | | | | |
| ఎ సర్కార్‌లో | 4 గ్రామాలున్నాయి | 300మంది + 121పి.ఎల్.జి.ఎ | 20 రోజులు | 20 పొలాలు బాగుచేసారు. |
| బి ” | 3 ” | 440 + 50పి.ఎల్.జి.ఎ | 20 ” | 12 ” |
| సి ” | 5 ” | 550 మంది | 8 ” | 32 ” |

ఒక సర్కార్‌లోని ప్రజలు అంతా కలిసి ఒకే నిర్మాణంగా పని చేసారు. పొలాలను బట్టి పని విభజన జరిగింది.

అన్ని పంచాయితీ సర్కార్లకు ఏరియా సర్కార్ నుండి 40వేల నుండి 60వేల రూ॥వరకు నిధులు ఇచ్చింది. స్థానికంగా 10నుండి 20వేల రూ॥ నిధులు, ధాన్యం జమచేసి పనులు చేసారు. అవసరమైన పనిముట్లు కొత్తగా కొన్నారు.

ప్రతీ సర్కార్‌లోను 3లక్షల రూ॥లకు తక్కువ కాకుండా 5లక్షల వరకు పని జరిగినట్లు ప్రాథమిక అంచనాలను బట్టి తెలిసింది. జనతన సర్కార్ల నిధులు సమకూర్చిన దానికన్నా 10రెట్లు స్వచ్ఛంద శ్రమ ఇక్కడ కనబడింది.

1వ ఏరియాలో ఆజాద్ స్థూపనిర్మాణం, పెద్ద సభ జరిగితే, మిగిలిన ప్రాంతాలలో విడివిడిగానే భూంకాల్ సభలు జరిగాయి. శత్రు కదలికలు ఉన్నా లోపలికి రాలేదు. సెంట్రీలు, పెట్రోలింగ్‌లు చేసుకుంటూనే ప్రజలు పి.ఎల్.జి.ఎ ఈ భూమి చదును కార్యక్రమం చేసారు.

ఒక సెక్షన్‌ను చీల్చి మిగిలినవారికి పోటీగా నిలబెట్టడానికే. ప్రభుత్వ బడ్జెట్‌లన్నీ ప్రచారానికి, ఆర్భాటానికే. అవినీతి పాలకులు, అధికారులు, దళారులు కుంభకోణాలు చేయడంతోనే లక్షల కోట్ల రూపాయలు ఖర్చు అవుతున్నాయి.

ఈనాడు నిజమైన అభివృద్ధి, సంక్షేమం జనతన సర్కార్లలో అమలు జరుగుతుంది. అందుకు ప్రజలు బాధ్యత పడుతున్నారు. డి.కె.ఎస్.జెడ్.సి చెప్పినట్లు గ్రామ సభల్లో చర్చించి ఆమోదించిన కార్యక్రమాలే జరుగుతున్నాయి.

ఇది ప్రజల ప్రభుత్వం. ప్రజాయుద్ధం ద్వారా దండకారాణ్యాన్ని విముక్తి చేయడంలో జనతన సర్కార్లు రాజకీయంగా ప్రజల పక్షాన పనిచేస్తున్నాయి. వర్గపోరాటాన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాయుద్ధ రాజకీయలతో జనతన సర్కార్లు నడుపుతున్నాయి. క్యాంపెయిన్‌ను విజయవంతం చేసిన విప్లవ ప్రజలకు జేజేలు.

# కాకరాపల్లి కార్చిచ్చు

నేడు శ్రీకాకుళం జిల్లా సంత బొమ్మాలి మండలం కాకరాపల్లి గ్రామం ఒక అగ్నిగుండం. అదే ప్రాంతంలో 7నెలల క్రితం సోంపేట కూడా ఇదే విధంగా అగ్నిగుండంగా తయారయ్యింది. సోంపేటలో పోలీసుకాల్పుల్లో ఇద్దరు రైతులు, ఇప్పుడు కాకరాపల్లిలో ఇద్దరు రైతులు తమ భూమి కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రాణాలిచ్చారు. పాలక వర్గాల 'అభివృద్ధి' కోసం, ప్రపంచీకరణలో భాగంగా, నూతన ఆర్థిక విధానాల కోసం పచ్చని చేలల్లో ప్రాణాలిచ్చారు.

2011 ఫిబ్రవరి 28న సోంపేట మరల మరల పునరావృతమైంది. కాకరాపల్లి థర్మల్ విద్యుత్కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా సోమవారం జరిగిన ఆందోళన ఉద్రిక్త భరితమయ్యింది. థర్మల్ వ్యతిరేక పోరాటకమిటీ నాయకుడు సుగ్గురామిరెడ్డిని పోలీసులు అరెస్టు చేయకుండా ప్రజలు ప్రతిఘటించడంతో పోలీసులు బాష్పవాయువు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. ప్రజల్ని పోలీసులు విచక్షణా రహితంగా లాఠీలతో కొట్టి వెంటబడి తరిమారు. ప్రజల ఆందోళనను, భయాలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, పోలీసులు ఒక పథకం ప్రకారమే కాల్పులు జరిపి రైతుల్ని హత్యచేశారు. అక్కడనే ఇద్దరు రైతులు ఆకాశ లక్కవరంకు చెందిన జీరు నాగేశ్వరావు (45), సీరపువాని పేటకు చెందిన సీరపు యర్రయ్య (28) రక్త మోడుతూ ప్రాణాలు విడిచారు. 34మంది తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా కూడా మారింది. 34గుడిసెలు తగులబెట్టి, 14ఎకరాల వరి కుప్పలను కాల్చి బూడిద చేశారు పోలీసులు.

"రాష్ట్రంలో పెట్టుబడులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని రాష్ట్ర హోంశాఖమంత్రి అసెంబ్లీలో ప్రకటించి ప్రభుత్వం ఎవరి పక్షాన ఉండాలని నిర్ణయించుకుందో స్పష్టం చేసింది. అందుకే ప్రజలు హింస చేయడానికి వచ్చారని, రాళ్ళు వేశారు కనుకనే పోలీసులు కాల్పులు జరిపారని సమర్ధించింది. డి.ఎస్.పితో పాటు 20మంది పోలీసులు గాయపడ్డారని, రబ్బరు బుల్లెట్లు దగ్గరగా తగలడంతో రైతులు చనిపోయారని వాస్తవాలను వక్రీకరిస్తున్నది.

కాల్పుల తరువాత పరిస్థితి మరింత తీవ్ర ఉద్రిక్తతకు గురికావడంతో పాటు మార్చి 1న శ్రీకాకుళం జిల్లా బంద్ విజయవంతం అయ్యింది. ప్రతిపక్షాలు కాకరాపల్లికి వచ్చాయి. చైతన్య మహిళా సమాఖ్య లాంటి ప్రజా సంఘాలు, మానవహక్కుల వేదిక చురుగ్గా అక్కడి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర మానవహక్కుల కమీషన్ ఉచిత వైద్య సేవలు అందించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం సోంపేటలో అనుసరించిన విధంగానే చనిపోయిన వారికి 5లక్షల రూపాయాలు ఎక్స్‌గ్రేసియా ప్రకటించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేసింది. రాజ్యసభలో పెద్ద చర్చ జరిగిన తర్వాత ప్లాంటు పనులు ఆపాలని కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర అసెంబ్లీ ఈ సమస్యపై అట్టుడికింది. పత్రికలు పతాక శీర్షికల్లో విషయాన్ని రాసాయి. ఇప్పుడు సోంపేట చెంత కాకరపల్లి చేరిపోయింది. ఈ సమస్య ఆగిపోలేదు. ఇదే విధంగా థర్మల్ ప్లాంట్స్ నిర్మాణానికి ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు కుమ్మక్కై కుట్ర పన్నితే ప్రజలు సోంపేట, కాకరాపల్లి మార్గంలో కదలడానికి సంసిద్ధమవుతారు. రక్తాలు పారించయినా ప్రాజెక్టులు నిర్మించాలని పాలకుల భావిస్తే నెత్తురు చిందించైనా భూముల్ని, పర్యావరణాన్ని రక్షించుకుంటామని సిక్కోలు ప్రజలు కదన రంగాన కదులుతున్నారు.

భారతదేశం బ్రిటిష్ వలసగా ఉన్నప్పుడు వేలం పాటల్లో ఈ తంపరను పాడుకొని చేపలు పట్టుకునేవారు. స్వాతంత్ర్యం వచ్చాక ప్రజలు ఒక సొసైటీగా ఏర్పడి లీజుకు తీసుకుని చేపలు పట్టుకుంటున్నారు. నిత్యం 2,500 పల్లెకారు కుటుంబాలు చేపలు పడతారు. జనవరి నుండి మే వరకు మరో 8వేల కుటుంబాలు వేరువేరు ప్రాంతాల వారు వచ్చి అక్కడ చేపలు పడతారు. అక్కడ 4 గెడ్డలు (నదులు/వాగులు) వంశధార, రాళ్ళగడ్డ, దేశిగడ్డ, గరీబులగడ్డల నుండి నీరువచ్చి సముద్రంలో కలుస్తుంది. అందుకే అక్కడ ఒక విశాల భూభాగం (40వేల ఎకరాల భూభాగం) లో తంపర (చిత్తడి) నేలలున్నాయి. ప్రాజెక్టు కోసం నీళ్ళు మళ్ళించడం వలన, అడ్డుకట్టలు వేయడం వలన సముద్రపు నీరు వచ్చి 6,800 ఎకరాల పంట మునిగిపోయింది. ఆ తంపర్లలో ఇంజన్లుపెట్టి 5,500 ఎకరాల భూముల్లో పంటలు పండించేవారు. ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. తంపర భూముల్లోని గడ్డిని 59 గ్రామాల ప్రజలు కోసుకొని అమ్ముకునే వాళ్ళు. ఆ ఆధారం పోయింది. చుట్టుపక్కల ఉప్పుమళ్ళు కడతారు. ఇప్పుడు వాటికి తెల్లదుమ్ము ప్రమాదం, పశువులకు పారుడు రోగాల ప్రమాదం, జీడితోటలకు పూత నిలువని ప్రమాదం వస్తాయి. జీవనాధార భూమిపోయి, జీవన మార్గాలు పోయి అనారోగ్యం, ఆకలిచావులు ప్రసాదించే "అభివృద్ధి" ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. సామ్రాజ్యవాదుల నూతన ఆర్థిక విధానాలకు ప్రపంచీకరణలకు విద్యుత్ అవసరం. అయితే ఇక్కడ ప్రజల బతుకుల్లో చీకట్లు

అలుముకుంటున్నాయి. అందుకే వాళ్ళు బతుకు చీకట్లను పారదోలే పోరాట బావుటా పట్టి పోరాడుతున్నారు. ఫ్యాక్టరీ బయట చుట్టుపక్కల ఆందోళన జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా బలమైన సంఘీభావం వ్యక్తమయ్యింది. అయినా పాలకులు, ఫ్యాక్టరీ యాజమాన్యం కుమ్మక్కు కొనసాగుతూనే ఉంది. గేట్లు మూసి లోపల విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు యదేచ్ఛగా చేస్తున్నారు. పోలీసులు, గూండాలు వారికి 24 గంటలు కాపలా ఉంటున్నారు.

## సోంపేటనుండి కాకరాపల్లి వరకు...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి వ్యూహంలో భాగంగా ఉత్తరాంధ్రలో 17 విద్యుత్కేంద్రాలను నెలకొల్పాలని, అందులో శ్రీకాకుళం జిల్లాలోనే 6 నెలకొల్పాలని, ఇక్కడే మరో రెండు అణువిద్యుత్కేంద్రాలను కూడా నెలకొల్పాలని నిర్ణయం చేశారు. మొత్తంగా శ్రీకాకుళం జిల్లాలోనే 12వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రంగం సిద్ధం చేసారు. రాష్ట్రంలో జరిగే ఉత్పత్తిలో ఒక్క యూనిట్ కూడా మన రాష్ట్రానికి ఇవ్వకుండా అమ్ముకునే విధంగా కొనుగోలు ఒప్పందాలు (ఎమ్ఒయు) చేసుకున్నారు. ఇది ఎవరి అభివృద్ధి కోసమో తేటతెల్లమే. బాక్సైట్, ఇనుము తవ్వడానికి, రవాణాకు, శుద్ధిచేయడానికి వారికి ఈ విద్యుత్ చాలా అవసరం.



జీవావరణ వ్యవస్థను కాపాడాలన్న కనీస బాధ్యత ఏ కోశాన మన ప్రభుత్వానికి లేదు. శ్రీకాకుళం జిల్లా కాకరాపల్లిలో కూడా పచ్చని పంట భూముల్లో థర్మల్ ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేయవద్దని నినదించిన ప్రజలపై పాలకులు తుపాకులు ఎక్కుపెట్టడం ఇదే నిజాన్ని చెబుతుంది. నౌపడ చిత్తడినేలలు పరిరక్షించుకోవలసిన "విశిష్ట పర్యావరణ" ప్రాంతమని ముంబై హిస్టరీ సొసైటీ, రాష్ట్ర అటవీశాఖ, 'జాతీయ అప్పిలేట్ అథారిటీ' లు 2సం॥ల క్రితం ఇచ్చిన నివేదికలను కేంద్ర మంత్రిత్వశాఖ ఏకోశానా పట్టించుకోలేదు. సమీపంలోని తేలినీలాపురం పరిధిలోనే కాకరాపల్లి ఉంది. వలస పక్షుల ఆవాస కేంద్రంతోపాటు ఆప్రాంతాన్ని 'సున్నితమైన వలస పక్షుల ఆవాస కేంద్రంగా' గుర్తించాలన్న సిఫార్సులను కూడా గాలికొదిలేసారు. జాతీయ రహదారికి 8కి.మీ, తెలినీలాపురానికి 4 కి.మీ దూరంలోనే ఈ ప్రాజెక్ట్ వుంది.

ఈ ప్రాజెక్టు ప్రతిపాదన వచ్చినప్పటినుండి అన్ని స్థాయిల్లో అబద్ధాలు, తప్పుడు సమాచారం పరిభ్రమించింది. పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ (2006) ప్రకారం అటువంటి తప్పుడు సమాచారం ఇచ్చినందుకు శిక్షించవచ్చుకూడా. అలా చేయలేదు. రాజకీయ ఒత్తిడిలకు, ఆర్థిక ప్రలోభాలకు గురైన ఆ శాఖ రబ్బరు స్టాంపుగా మారిపోయింది. కీలక పరిరక్షణ యంత్రాంగాలు సిఆర్‌డి, చిత్తడి నేల పరిరక్షణ, గ్రీన్ ట్రిబ్యునల్‌ల ఏర్పాటులో ఇదే ధోరణి ఉన్నది. సోంపేట, కాకరాపల్లి, పోస్కో, వేదాంత, లావాసా, ఆదర్శ, జైతాపూర్ లాంటి బడా ప్రాజెక్టులకు, అనేక గనులకు, థర్మల్ ప్రాజెక్టుకు అనుమతిని ఇవ్వడంలో ఇదే వాస్తవంగా కనబడుతుంది.

న్యూఢిల్లీకి చెందిన ఇ.ఐ.ఎ రిసోర్స్, రెస్పాన్స్ సెంటర్ సేకరించిన గణాంకాల ప్రకారం ఆగస్టు 2009నుండి జూలై 2010వరకు కేవలం 6 ప్రతిపాదనలు తిరస్కరించి 535 ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చారు. అందులో 58 బొగ్గుగనులు, 285 పారిశ్రామిక ప్రాజెక్టులు, 93 థర్మల్ ప్రాజెక్టులున్నాయి. ఒక్కటి మినహా థర్మల్ ప్రాజెక్టుకోసం వచ్చిన ప్రతిపాదనలన్నీ సంబంధిత మంత్రిత్వశాఖవారు ఆమోదించారు.

గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం-2009 ప్రకారం పర్యావరణ నష్టాలకు పరిహారంతో పాటు, శిక్షలు ఉంటాయి. ఈ చట్టం వచ్చినా అమలులో లేదు. కాని అంతకుముందున్న జాతీయ పర్యావరణ అప్పిలేట్ అథారిటీ (ఎన్ఇఎఎ) మాత్రం రద్దయ్యింది. సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఈ మంత్రిత్వశాఖ పని తీరును తీవ్రంగా తప్పుపట్టింది. వారం రోజుల్లో గ్రీన్‌ట్రిబ్యునల్ పని ప్రారంభించాలని డిసెంబర్ 14న మెట్టి కాయలు వేసి మరి చెప్పింది. నెలలు గడిచినా, కాకరాపల్లిలు జరుగుతున్నా, స్థానికులు కాకరాపల్లి బాధితులు స్వయంగా ఆశ్రయించినా ఫలితంలేదు. సోంపేటలో రద్దుచేసి, కాకరాపాడుకు ఎలా అనుమతి ఇచ్చారో అంతుబట్టని విషయంగా ఉంది. అలా అనుమతించడం వలననే ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

తొలుత ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఈస్ట్ కోస్ట్ కంపెనీకి 3333.45 ఎకరాల భూమిని కేటాయించింది. కంపెనీ మాత్రం 1960 ఎకరాలనే నిపుణుల కమిటి ఇఎసికి నివేదించింది. ఆ మేరకే షరతులతో కూడిన అనుమతి ఉంది. జాతీయ అప్పిలేట్ అథారిటీ షరతుల ప్రకారం థర్మల్‌ప్లాంట్‌ను 1317 ఎకరాల్లోనే నిర్మాణం చేయాలి. మిగిలిన 2016 ఎకరాల భూమిని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలి. ప్రభుత్వం ఆ భూమిని తిరిగి తీసుకోలేదు. ఆ విషయాన్ని ప్రశ్నిస్తున్నందుకే కాకరాపల్లిలో పోలీసుకాల్పులు. ఆ ప్రైవేట్ సంస్థతో ప్రభుత్వానికి ఎంత కుమ్మక్కు ఉందో విధితమే.

1980 నాటి అటవీ పరిరక్షణ నియమాలతో పాటుగా అటవీ హక్కుల గుర్తింపు చట్టం(2006) నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. దీని ప్రకారం ముందుగా గ్రామసభ అనుమతి తర్వాత అటవిశాఖ అనుమతి తీసుకోవాలి. ఇదే సమస్య వచ్చి ఒరిస్సాలో పాస్కో ఒప్పందాల్ని ఆపారు. ఆంధ్రప్రదేశలో మాత్రం పోలవరం, బాక్సైట్ లాంటి సమస్యల్లో ఈ చట్టాలను గౌరవించడం లేదు. వేదాంత విషయంలోను ఇదే కథ నడుస్తుంది. నియమగిరి కొండల్లో 10సం॥లుగా డొంగ్రియా తెగ గిరిజనులు పోరాడుతున్నారు. రేపు (మరో సోంపేటగా) వేుషునపాడు (శ్రీకాకుళంజిల్లానే)లో కూడా ఇదే సమస్య రగులుకోనున్నది. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నది. చేతులు కాలాక పర్యావరణ శాఖవారు మేల్కోంటున్నట్లున్నారు. కోట్లు ఖర్చుపెట్టాం వెనక్కి తగ్గేదిలేదని ప్రైవేటు సంస్థలు అంటున్నాయి. కాకరాపాడు థర్మల్‌సంస్థ ప్రతినిధి శంకర్ 1500 కోట్ల రూ॥ ఖర్చు పెట్టాం అని ధీమాగా చెబుతున్నాడు. ఎవరి అనుమతితో చేసారని ప్రజలు అడుగుతున్నారు. అలా అడుగుతున్నందుకే పోలీసు కాల్పులు, గృహ దహనాలు, వరి కుప్పలు బూడిద చేయడాలు, దొంగకేసులు బనాయించడాలు చేస్తున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారు అంటే 12వేల కోట్ల ఖర్చుతో 2,640 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ లిమిటెడ్ ప్లాంట్‌కు ప్రభుత్వం అనుమతినిచ్చింది అంటున్నారు.



తలకు గాయమైన వృద్ధుడు రుషి



బుల్లెట్ దెబ్బకు నేలరాలిన రైతు

ఫ్యాక్టరీ ఇచ్చే ప్యాకేజికీ ఒప్పుకోవాలని కొట్టారు. బలవంత పెట్టారు. కేసులుపెట్టి జైళ్ళకు పంపారు. దాడులు, కాల్పులు, దహనాలు, బీభత్సాలు ఎన్నో చేసారు. కాల్చి చంపినపుడు ఒక ఎస్.పి, నలుగురు డి.ఎస్.పిలు, ఆరుగురు సి.ఐలు, 10మంది ఎస్.ఐలు రెండు వేలకు పైగా పోలీసులు అక్కడ ఈ దాడుల్లో పాల్గొన్నారు. అయినా ప్రజలు భయపడడం లేదు.

## ఉనికి కోసం ప్రజలు పోరాటబాటలో కదిలారు.

పంట భూములు పోతాయని, పర్యావరణం దెబ్బతింటుందని, తమ ఉనికికి, ఉపాధికి ప్రమాదం వచ్చిందని చిన్న, సన్నకారు రైతులు, మత్సకారులు ఆందోళన చెందుతున్నారు. కాకరాపల్లి స్థానిక ప్రజలు ప్రభుత్వాధికారులను తరిమికొట్టిన సంగతి కూడా మనం మరిచిపోకూడదు. ఆగస్టు 15 నుండి 7 నెలలుగా వడ్డితాండ్ర కేంద్రంగా నిరాహారదీక్షలు చేసి మత్సకారులు ఉపాధి కోల్పోతారని అలాగే 40వేల ఎకరాల భూమి ముంపుకు గురవుతుందన్న విషయాలు చెపుతున్నారు. ప్రాజెక్టు వలన కొత్తగా నీటి మార్గాలు మార్చి కాలువలు తవ్వడం వలన వరదలు వస్తాయి, మరో పక్కన పంట కాలంలో భూమికి నీరు లేకుండా పోతుంది. అక్కడ సహజసిద్దంగా ఉండే నీటి జల పోతుంది. చిత్తడి నేలలు/బీలబావులు సహజత్వం కోల్పోతాయి. వాతావరణంలో చాలా మార్పులొస్తాయి. దానికి తోడు థర్మల్ కాలుష్యం వలన జనజీవనం, జంతుజాలం, వృక్షజాతులు నాశనమవుతాయి. మన దేశంలో 82శాతం కాలుష్యాన్ని ఉత్పత్తి చేసేది ఇటువంటి థర్మల్ విద్యుత్ కేంద్రాలే.

సంవత్సర కాలం నుండి నిర్మాణ పనులు జరుగుతుంటే ఇప్పుడే ఆందోళన ఏదో మొదలయ్యిందని వాస్తవాల్ని వక్రీకరిస్తున్న మంత్రి బొత్స సత్యన్నారాయణ మొసలికన్నీరు కారుస్తూ "కాకరాపల్లి కాల్పులు దురదృష్టకరం. ప్రభుత్వం పూర్తిగా బాధ్యత పడుతుంది. వ్యక్తిగతంగా, మంత్రిగా క్షమాపణ చెబుతున్నా" అని ఇంకా "ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడం కూడా వాస్తవమే"నని మాట్లాడాడు. శ్రీకాకుళంలో రాజకీయ నాయకులు ఎర్రంనాయుడు. లచ్చుంనాయుడు. ధర్మాన ప్రసాద్‌రావులను లక్ష్యంగా పెట్టుకొని బొత్స మాట్లాడుతున్నాడా ? చిత్త శుద్ధితో మాట్లాడాడని ఎవరూ

అనుకోరు. ఈ వాటాలలో ఈ మంత్రికి కూడా భాగం వున్నదని ప్రజలకు తెలియనిదికాదు. 2008 ఆగస్టు 8న ప్రజాభిప్రాయ సేకరణ సమయంలోనే ప్రజలు, ప్రజా సంఘాలు బలంగా వ్యతిరేకించారని, గత 7 నెలలుగా (ఆగస్టు 15 నుండి) నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి తెలిసి కూడా మంత్రి ప్రజల్ని మాయ చేస్తున్నాడు.

ఖండన మండనలతో ప్రతిపక్షాలు అన్నీ ఇప్పుడు వచ్చి సమస్యను తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చేందుకు ప్రయత్నించాయి. నిన్నటివరకు కాంగ్రెస్‌లో ఉండి జగన్ పార్టీలో చేరిన కొణతాల "వైఎస్ఆర్ నే హత్య చేసిన వారికి ఈ ప్రజల్ని చంపడం ఒక లెక్కా" అన్నాడు. "గొఱ్ఱె కసాయిని నమ్మినట్లు ప్రజలు కాంగ్రెస్‌ను నమ్ముతున్నారు" అన్నారు. అక్కడి నుండి బలగాలను తొలగించాలి, అనుమతులు రద్దు చేయాలని, కేసులు ఎత్తివేయాలని ప్రధానంగా డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాలు, ఉద్యమ కార్యకర్తలు తమ నిరసనను ఉధృతం చేసారు. నష్ట పరిహారం చెల్లించాలని, అధికారులను శిక్షించాలని కూడా డిమాండ్ చేసారు. స్థానిక ప్రజలు, ఉద్యమ కార్యకర్తలతో పాటు పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా కట్టుబడి పని చేస్తున్నవారు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.



**శ్రీకాకుళం జిల్లా వడ్డితాండ్రలో పోలీసులు, ఆందోళనకారుల పరస్పర దాడి**

నష్ట పరిహారం ఇచ్చిన సందర్భంలో కూడా ప్రజలు ముఖ్యంగా మృతుల భార్యలు నాగేశ్వరావు భార్య లక్ష్మి, ఎర్రయ్య భార్య ధనలక్ష్మి ఇద్దరూ కూడ "తమకు పరిహారం ముఖ్యం కాదని థర్మల్ ప్లాంట్‌ను ఆపుతామని హామి ఇవ్వండి" అని మాట్లాడి, ఆ హామీ పొందిన తర్వాతనే ఎక్స్‌గ్రేషియా చెక్‌లు అందుకున్నారు. సోంపేటలో మాదిరిగానే కాకరాపల్లిలో కూడా మహిళలు ముందు పీటిన నిలిచి పోరాడారు.

సోంపేటలో పోలీసుకాల్పుల ఘటన తర్వాత అక్కడ థర్మల్ కేంద్ర నిర్మాణ పనులు ఆపివేశారు. ఆ తర్వాత జూలై 2010లో వచ్చిన నిపుణుల కమిటీ కేంద్రానికి ఇచ్చిన నివేదికలో పర్యావరణ రీత్యా అనుమతించకూడదని సూచించింది. అయినాగాని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక జిల్లా అధికారులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు నివేదికలు తయారుచేసి తమకు కావలసిన అనుమతులు పొందడానికి ప్రయత్నించారు. ఇది కూడా 'పెట్టుబడులకు భరోసా' ఇచ్చే బాధ్యత (!) లో భాగమే కావచ్చు. 2005 ఆగస్టులో టెక్కలి ఆర్‌డిఒ ఇచ్చిన నివేదికలో స్థానిక మత్స్యకారుల జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని చెప్పారు. 2007జూలైలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇచ్చిన నివేదిక కూడా ఇదే విషయాన్ని చెప్పింది. కేంద్రం పంపిన నిపుణులు, జిల్లా అధికారులు గతంనుండి చెప్పిన, ఇప్పటికీ స్పష్ట పరుస్తున్నదానికి భిన్నంగా ఎందుకు అనుమతులు వచ్చాయో, ఎలా వచ్చాయో ఈ అవినీతిమయ రాజ్యంలో అందరికీ స్పష్టమే.

సోంపేట ఘటన అనంతరం పరిస్థితుల అధ్యయనానికి బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న పర్యావరణశాఖ ఆధ్వర్యంలో ఒక బృందం వచ్చి జులై 2010లో 17–19 తేదీల మధ్య ఇక్కడ పర్యటించి 13 పేజీల వివరం రాసింది. అందులో 5 అంశాలను స్పష్టపరిచింది. 1. ప్రజలు, మత్స్యకారులు పూర్తిగా ప్లాంటు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. 2. ఈ ప్లాంటు వలన నీటి ముంపు వచ్చి పొలాలు మునిగి పోతాయి. మరో కాలంలో (పంట కాలంలో కూడా) నీటి నష్టాన్ని ఎదుర్కొంటారు. 3.నీటి ప్రవాహాలు మారిపోయి 30వేల ఎకరాలకు ముంపు ప్రమాదం ఉంది. 4. ఇవి చిత్తడి నేలలే. చుట్టు పక్కల 70 గ్రామాలు భూగర్భ జలాలున్నాయి. 5. 10 కి.మీ పరిధిలోనే నౌపాడు చిత్తడి నేలలు మరియు తేలనీలాపురం వలస పక్షుల కేంద్రం ఉన్నాయి. వివిధ జాతుల పక్షులు వందల రకాలు వస్తాయి. కనుక ఇది పర్యావరణ సున్నితప్రాంతం అని నిర్ధారించారు.

అలాగే చిత్తడి నేలల పరిరక్షణ "రామస్ అంతర్జాతీయ ఒప్పందం(1971)" పైన మన ప్రభుత్వం 1982లో సంతకం చేసింది. 2003 సెప్టెంబర్‌లో ఈ భూముల పరిరక్షణకు ఆదేశిస్తూ సర్క్యులర్ జారి చేసింది. ఎన్ని ఒప్పందాల మీద సంతకాలు చేసినా, చట్టాలు, సర్క్యులర్స్ హెచ్చరిస్తున్నా మన పాలకులు వాటిని కాదని

***(మిగతా 16వ పేజీలో...)***

# దోపిడి పాలకుల "రచ్చబండ"ను ప్రతిఘటించిన ప్రజలకు జేజేలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలకుల అసమర్ధ పాలన, అంతర్గత సంక్షోభాలతో సాదారణ (నియంతృత్వ పాలన ఉన్నా) పరిపాలన స్తంభించిపోయింది. మరీ ముఖ్యంగా వైఎస్ఆర్ గతించాక గత రెండు సం॥ల కాలంలో మరింత అద్వాన్నమై పోయింది. ప్రజా సంక్షేమం అటకెక్కి కూర్చుంది . ఇప్పుడు కొత్తగా మరోసారి ప్రజల్లో ఇంకా గొంతు, కండ, అండలేని వారున్నారని గుర్తించారు. వారికి సంక్షేమ పథకాలు చాలా దూరంగా జరిగిపోయాయని, సమస్యలు సుదీర్ఘకాలం కొనసాగుతున్నాయని కూడా గుర్తించారు. వీటికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశమార్గాల్లో రాకెట్ వేగంతో పెరిగిపోతున్నాయి. అసలే ఉపాధిలేదు. రైతాంగం, చేనేత కార్మికుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఆర్ధిక సమస్యలతో జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోయి జనంలో నిరాశ, నిస్పృహ నెలకొన్నాయి. మరో పక్కన ప్రత్యేక తెలంగాణా, సమైక్యాంధ్ర ఉద్యమాలు, ఉద్యోగుల సమస్యలు ఇలా అనేక కీలకమైన సమస్యలతో ఉద్యమాలు నడుస్తున్నాయి. ఇవి చాలవన్నట్లు వరదలు, కరువు పరిస్థితులు. ఎటు చూసినా దిక్కు తోచని సంకట పరిస్థితి.



నల్లగొండ మండలం పద్దివారి గూడెంలో చీపుర్లతో అధికారులకు స్వాగతం

రాజకీయంగా ఇది మరింత సంకటంగా ఉంది. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వేగంగా రాజకీయాల్లోకి వచ్చేసి పెను తుఫాన్ సృష్టిస్తున్నాడు. ప్రభుత్వ వ్యతిరేకత, కాంగ్రెస్‌లో చీలిక, ప్రత్యేక తెలంగాణా పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానానికు అన్ని సెక్షన్లలో వ్యతిరేకత పెరిగింది. ఇలా చాలా చాలానే పెరిగిపోయి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మహాగడ్డు పరిస్థితిని, లేవలేని స్థితిని ఎదుర్కొంటున్నది. కాబట్టి ప్రజల దగ్గరకు వెళ్ళి ప్రజల్ని ఆకర్షించి, ప్రతిపక్షాలను దెబ్బతీసి, పోరాటాల నుండి ప్రజల్ని పక్కకు మల్లించి ఎలాగైనా 3సం॥ల కాలం అధికారాన్ని నిలబెట్టుకోవాలనే కృతనిశ్చయంతో ఉన్న అధికార కాంగ్రెస్ కేంద్రంలోను, ఎంతో కొంత రాష్ట్రంలోను సుదీర్ఘంగా చర్చించి 'రచ్చబండ' ను ప్రజల బతుకు బండకు ప్రత్యామ్నాయంగా, కాదుకాదు అసలు (!)పరిష్కారంగా ముందుకు తెచ్చారు. ఈ విశ్లేషణ, అవగాహన ఎత్తుగడ సొంతంగా వారిదేనని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతీ సభలోను స్వయంగా చెప్పుకుంటున్నాడు. ఎన్.టి.ఆర్ 'ప్రజల వద్దకు పాలన', చంద్రబాబు 'జన్మభూమి', వైఎస్ఆర్ 'రచ్చబండ' ఈ రచ్చబండ అన్ని గుదిబండలేనని, ఇందులో ఇసుమంత కూడా ప్రగతిలేదని, రాదని ప్రత్యేకించి ఇప్పుడున్న పరిస్థితుల్లో వాటి రంగు మరింతగా బహిరంగమయ్యిందని, ప్రజలు అంటున్నారు. ఆ ప్రజా నిరసనను, ఈ కొత్త ప్రభుత్వం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితిని మీడియా వివరంగానే ప్రచారం చేస్తుంది.

జనవరి 24నుండి ఫిబ్రవరి 12వరకు 20 రోజులు జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ప్రధానంగా 7అంశాలు పరిష్కారం చేయాలని నిర్ణయించింది ప్రభుత్వం. అవి వరుసగా రేషన్‌కార్డుల పంపిణి, పించన్లు, అభయహస్తం, ఆరోగ్యశ్రీ, గృహకల్పన, ఉపాధికల్పన, పావలావడ్డీ రుణాలు. ఇంకొద్దిగా వివరాల్లోకి వెడితే 3నెలల సమీకృత సర్వే చేసి తేల్చి తెచ్చిన లెక్కల ప్రకారం 5.7లక్షల కుటుంబాలకు శాశ్వత రేషన్ కార్డులకు ప్రస్తుతం కూపన్లు ఇవ్వాలి. అనలైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు 3లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూర్ చేయాలి. అభయహస్తం పథకం కింద కొత్తగా 4.6 లక్షల మంది ఎస్‌సి,ఎస్‌టి మహిళలకు ప్రయోజనం చేకూరేలా చేయాలి. ఇంకా 4.7 లక్షల ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేయాలి. ఈ పనుల కోసం ప్రభుత్వం 2500 కోట్ల రూపాయాలు ఖర్చు చేయాలని నిర్ణయించింది. 1కోటి 25లక్షల కుటుంబాలకు, 6.5లక్షల స్వయం సహాయక సంస్థలకు ఉపయోగంగా ఇది ఉంటుందన్నారు. రచ్చబండ కార్యక్రమం మొదలు కాక ముందుగానే 1200కోట్ల రూ॥లు విడుదల చేసింది. ఈ లెక్కలన్నీ కాగితాల్లో నడిచాయి. ప్రచారంలో మారుమ్రోగాయి. కానీ ప్రజలకు చేరింది లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో మొండి చెయ్యే ఎదురయ్యింది. ఇదీ 'రచ్చబండ' ప్రహసనం.

ముఖ్యమంత్రి ప్రజల సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కారించాలని కలెక్టర్లను ఆదేశించి మంత్రులను, అన్ని పార్టీల ఎమ్ఎల్ఎలను ఇందులో పాల్గొని ప్రజల స్పందనలను పోగుచేయాలని విజ్ఞప్తి చేసాడు. ప్రభుత్వ అసమర్ధత నుండి ప్రజల దృష్టిని మల్లించడం కోసమే ఈ 'రచ్చబండ'. ప్రభుత్వ లోటుపాట్లు, వైఫల్యాలు ఎండగట్టాలి" అని చంద్రబాబునాయుడు కేడర్‌కు పిలుపునిచ్చాడు. టిడిపి మాత్రమే ప్రత్యామ్నాయం అని, సమర్ధ పాలన అందిస్తుందని ప్రజలలో ప్రచారం చేయాలన్నాడు. 'రచ్చబండను' పూర్తిగా బహిష్కరించాలని టిఆర్ఎస్ చంద్రశేఖర్ పిలుపునిచ్చాడు. ఈ

రచ్చబండను గద్దర్ చర్చబండ చేయాలన్నాడు. "ఆ చర్చల ద్వారా శ్రీ కృష్ణకమిటీ నివేదికలోని సిఫార్సుల వెనుక కుట్రను బహిర్గతం చేయాలి. పార్లమెంటులో తెలంగాణా బిల్లు పెట్టాలనే డిమాండ్ చేయాలి". బిజెపి కూడా రచ్చబండను బహిష్కరించింది. ప్రజలు, ప్రజాసంఘాలు స్వచ్ఛందంగానే రచ్చబండను బహిష్కరించారు.

ఈ రచ్చబండ సందర్భంగా సబ్సిడీలు, కనీస మద్దతు ధరలు, అవినీతి, అక్రమాలు, సామాజిక భద్రతా పింఛన్లు, సూక్ష్మరుణ సంస్థలు సృష్టించిన రుణచావులు, 9గంటల ఉచిత విద్యుత్, చేనేత రుణమాఫీ, ఆత్మహత్యలు ఇలా చాలనే ప్రజల సమస్యలు ప్రభుత్వ అధికారులను, మంత్రులను నిలేసాయి. ఇది సీమాంధ్రలో సాఫీగా, కొన్ని చోట్ల ఘర్షణగా సాగి కాంగ్రెస్ పాలన తీరును మాత్రం అన్ని సెక్షన్ల ప్రజలు వ్యతిరేకించారు. ప్రభుత్వానికి కోస్తా ఆంధ్ర, రాయలసీమ జిల్లాలలో ఎంత నిరాదరణ ఉందో స్పష్టమయ్యింది. రాజకీయ ప్రయోజనాల ఘర్షణ వేదికగా, ప్రభుత్వ వైఫల్యాల రచ్చగా ఇది జరిగింది. ఇదే సందర్భంగా 10లక్షల మంది ఉద్యోగులు వేతన సంఘం సిఫార్సుల అమలుకు ఉద్యమించడం "రచ్చబండ" కార్యక్రమం ద్వారా ప్రజలలో విస్తృతంగా చర్చకు వచ్చింది. ఉద్యోగుల ఆందోళనకు పూర్తి మద్దతు లభించింది.

కోస్తాలోని శ్రీకాకుళం జిల్లా రాజోలులోను, రాయలసీమ జిల్లా సి.ఎమ్ స్వంత నియోజకవర్గంలోను, చివరాకరున తెలంగాణలోని వరంగల్ జిల్లా రాయనిగూడెంలోను ముఖ్యమంత్రి రచ్చబండ ప్రజలను సంతృప్తి పరచలేదు. కొన్ని చోట్ల, మర్యాదగా, కొన్ని చోట్ల మిలిటెంట్‌గా ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలు చాటిచెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వం, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల మీద పట్టులేని కొత్త ప్రభుత్వానికి ఈ రచ్చబండ ద్వారా ఒక రకంగా గట్టి అవమానం లభిస్తే – ఈ సందర్భంగా ప్రజలకు, ఉద్యమశక్తులకు ప్రభుత్వపు డొల్లతనం, నిరంకుశ విధానాలు స్పష్టమయ్యాయి. పాలకులు తమకు రక్షణగా వేలాది మంది పోలీసులను రచ్చబండ కార్యక్రమానికి తెచ్చుకున్నారు. "పోలీసులతో పెట్టుకోవద్దని" ముఖ్యమంత్రి స్వయంగా ప్రజల్ని హెచ్చరించాడంటే పాలన తీరుతెన్నులు ఎలా ఉన్నాయో అర్ధమవుతుంది. వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి, ప్రచారార్భాటంతో అంతా మాయ చేయాలనుకుంటే గతంలో లాగా ప్రజలు ఊరక ఉండరని ప్రభుత్వానికి అర్ధం అయ్యింది. ఇది ఉద్యమాల కాలం – తెలంగాణా లాంటి నిరంతరం రగిలే సమస్యల్లో ఉన్న ప్రజలు తమ వ్యతిరేకతను ప్రదర్శించేందుకు రచ్చబండ ఒక మంచి అవకాశం. అందుకే అక్కడ యుద్ధ రంగమే నడిచింది. అక్కడ ప్రజలు రచ్చబండను సంపూర్ణంగా బహిష్కరించి ఈ పాలన మీద, ప్రభుత్వం మీద, కాంగ్రెస్ పార్టీ మీద తమ ఆగ్రహాన్ని వెల్లడించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరు అందరికీ తెలిసిందే. అధికార పార్టీ అవినీతి, ఆశ్రిత పక్షపాతం రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా కార్యకర్తల బాగోగుల కోసం ఈ పథకాలు వరప్రసాదాలుగా మారాయి. ప్రజల పేరు చెప్పి వేలకోట్ల రూపాయలు "రచ్చబండ" నిధులు కూడా స్వాహా చేసారు.

తెలంగాణలో "రచ్చబండ" రణరంగం 20రోజులు కొనసాగింది. ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు, కొద్దిమంది అధికారులు స్వయంగా ఆ ప్రజా నిరసనను అనుభవించారు. నిరసన ఎన్ని రూపాల్లో తెలియజేయవచ్చో ఈ సందర్భంగా ప్రజలు చేసి చూపించారు. ప్రజల్ని ఐక్యపరచడానికి బలమైన గొంతుతో ప్రభుత్వం పట్ల, కాంగ్రెస్ పట్ల తెలంగాణ ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో చాటి చెప్పడానికి ఇది దోహదం చేసింది. పత్రికల్లో టి.వి చానల్స్‌లో రోజూ ప్రధాన వార్తాంశంగా 'రచ్చబండకు నిరసన' పోరాటం ముందు నిలిచింది. ఇదే కాలంలో గల్ఫ్ ప్రజల ఆందోళనలు కూడా ప్రజలను, ఉద్యమకారులను ఉత్సాహపరిచాయి. ప్రజలు ఈ నిరసన కార్యక్రమాల్లో ఐక్యంగా నిలిచి మిలిటెన్సీని, చైతన్యాన్ని ప్రదర్శించడమే కాకుండా భవిష్యత్ ఉద్యమాల్లో వచ్చే వేగాన్ని, వాడిని సూచనగా ప్రతిబింబించారు. ఆ విధంగా తెలంగాణలో రచ్చబండ ప్రభుత్వ ఎత్తుగడను చిత్తుచేసింది. ప్రతి ఎత్తుగడలు మరింత మిలిటెన్సీతో రూపొందించుకునేందుకు, భూమిక తయారయ్యింది. ఆ విధంగా ప్రభుత్వం తలపెట్టిన "రచ్చబండ" కార్యక్రమం ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టి ప్రజల ఆగ్రహాన్ని వెలికితీసింది.

ప్రభుత్వం అధికారిక లెక్కల్లో వేల సంఖ్యలలో చూపినవన్నీ తప్పుల తడకలే. వాస్తవంలో ఎక్కడా ఒక్క సభ కూడా ప్రజల ఆమోదంతో ప్రజాస్వామికంగా జరగలేదు. పూర్తి స్థాయిలో బలగాలను దింపి, ఒక టెర్రర్ వాతావరణం సృష్టించి గొప్పగా జరిగినట్లు చూపడానికి ప్రయత్నించినా అలా జరగలేదు. కొన్ని చోట్ల ప్రజలు అంగీకరించలేదు. మధ్యలోనే అధికారులు మంత్రులు, ముఖ్యమంత్రి కూడా సభనుండి పలాయనం చిత్తగించారు.

## రాయినిగూడెం ప్రజలకు ప్రత్యేకాభివందనాలు.

ముఖ్యమంత్రి రాయిని గూడెంలో కేవలం 20ని॥లు "రచ్చబండ" సభ జరపడానికి, రాష్ట్ర, జిల్లా యంత్రాంగం ఎంత కుస్తీ పట్టిందో, ఎన్ని రోజులు రిహార్సల్స్ చేసారో, ఎంత బలగాన్ని వినియోగించారో మీడియా చాలానే ప్రచారం చేసింది. అయినా ప్రజలు రచ్చబండను

*(మిగతాది 26వ పేజీలో...)*

# ఉత్తర ఆఫ్రికా, పశ్చిమ ఆసియాలను కుదిపేస్తూ నడుస్తున్న చరిత్రలో ఈజిప్ట్.

# ఈజిప్ట్ నియంత హోస్నీ ముబారక్ శకం ముగిసింది.

మానవజాతి చరిత్రలో నైలు నది తీరంలో ఈజిప్ట్ ఒక పురాతన నాగరిక సమాజం. అది ఈనాడు ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. ఈజిప్ట్ పరిణామక్రమంలో గతం, వర్తమానం రెండూ చరిత్రలో నిలిచిపోతాయి. మొదట విజయం సాధించిన ట్యూనీషియా ప్రజాందోళన ఈజిప్ట్ ప్రజాందోళనకు, విజయానికి దారితీసింది. ఈ విజయాలు నేడు ఉత్తరాఫ్రికా, పశ్చిమాసియాలను గొప్పగా కుదిపేస్తున్నాయి. యెమెన్, అల్జీరియా, జోర్డాన్, మొరాకో, సిరియా, లిబియా, బహ్రెయిన్ దేశాలు దశాబ్దాలుగా నియంత్రత్వ పాలనను అనుభవిస్తున్న దేశాలు. ఇవేకాదు ఇంకా అనేక దేశాలు నియంతల పాలనలోనే కొనసాగుతున్నాయి. ఆ దేశాల్లోకి ఈ ప్రజాస్వామిక విప్లవ వెల్లువ దూసుకెదుతూ 2011సం॥లో అరబ్బుల ప్రజాస్వామిక ఉద్యమాలకు, విజయాలకు బాటలు వేస్తుంది. ఈ సం॥ జనవరి, ఫిబ్రవరి నెలల్లో 18రోజులు ఈజిప్ట్ రాజధాని కైరోలో వేల సంఖ్యలో ప్రజలు చేసిన నిరసన ప్రదర్శనలు, మిలిటెంట్ చర్యలు అణచివేతను, కాల్పులను ధిక్కరిస్తూ కొనసాగాయి. వందల మంది ప్రాణత్యాగాలతో విజయం సాధించారు. ఫిబ్రవరి 11న ప్రజల నిరసనకు తల ఒగ్గి 30సం॥ అధ్యక్షుడుగా ఉన్న హోస్నీ ముబారాక్ అధికారాన్ని వదిలి దేశం విడిచి పారిపోయాడు.

## అరబ్ దేశాల చరిత్ర పొడవునా దురాక్రమణలు - ప్రతిఘటనలు

శతాబ్దాలుగా అరబ్బు ప్రపంచాన్ని పశ్చిమ దేశాలు, అమెరికా దురాక్రమించి పీల్చి పిప్పి చేసాయి. జాతీయ స్వతంత్రంకోసం 1879 నుండి ఈజిప్టు ప్రజలు ఉద్యమ పథంలో పయనించి 1882 నాటికి విజయం సాధించి ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నారు. అయితే మొదట బ్రిటన్, ఫ్రాన్స్ తరువాత అమెరికా అనుసరించి కొనసాగించిన దుర్మార్గ దుష్ట పన్నాగాల కారణంగా ఈజిప్ట్‌లో ఆర్థిక రాజకీయ సంక్షోభాలు, నియంతృత్వాలు రాజ్యమేలాయి. ఈజివ్ట్ తిరిగి 1914లో బ్రిటిష్ ఆధీనంలోకి వెళ్ళింది. 1922లో అక్కడి ప్రజలు, మరల ఒకసారి పోరాడి స్వాతంత్రం పొందారు. అయినాగాని మరో 34 సం॥రాల పాటు (1956 వరకు) బ్రిటిష్ సైన్యం ఆ దేశాన్ని వదిలిపోలేదు. 1953లో ఏర్పడిన ఈజిప్ట్ రిపబ్లిక్‌కు నాసర్ మొదటి అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. నాసర్ కాలంలో అలీనోద్యమం పెరగడంతో "సోషలిస్టు" భావాలు అరబ్ దేశాల్లో విస్తరించాయి. నాసర్ అమెరికా ప్రయోజనాలకు భిన్నంగా పదికోట్ల డాలర్ల ఆదాయం వచ్చే సూయజ్ కాలువకు చెందిన కంపెనీని జాతీయం చేశాడు. గల్ఫ్ ప్రాంతంలో మధ్యధరా సముద్రంలో కీలక స్థానంలో ఈజిప్ట్ ఉంది. 1869లో సూయజ్‌కాలువ తవ్విన తర్వాతనే బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఈజిప్ట్‌ను



ఘర్షణల్లో మృతి చెందిన వారికి కైరోలో నివాళులర్పిస్తున్న ప్రజలు

అదుపులో ఉంచుకొని, అక్కడ తిరుగుబాటు (1879–1882)ను అణచివేసి సూయజ్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. 72 సం॥ల తర్వాత జాతీయపోరాటాలు బలపడడంతో బ్రిటీష్ ప్రభుత్వం 1956లో అక్కడినుండి వైదొలగింది.

గల్ఫ్ నుండి చమురు రవాణాకు సూయజ్ ప్రాముఖ్యత గుర్తించిన అమెరికా, 1948లో ఇజ్రాయిల్ ఏర్పడిన తర్వాత ఈజిప్ట్ పైన కేంద్రీకరించింది. ఈ క్రమంలోనే అమెరికా తొత్తు ఇజ్రాయిల్‌తో ఈజిప్టుకు శతృత్వం పెరిగి పెద్దదయింది. బ్రిటన్, ఫ్రాన్స్‌లతో కలిసి ఇజ్రాయిల్ ఈజిప్టుపై దాడి చేసింది. ఈకాలంలోనే ఈజిప్ట్, సిరయాతో కలసి యునైటెడ్ అరబ్ రిపబ్లిక్‌గా ఏర్పడింది. అలీనోద్యమంలో నాసర్‌కు ఉన్న పలుకుబడితో జనాదారణతో అమెరికాను, ఇజ్రాయిల్‌ను బలంగానే ఎదుర్కొన్నాడు.

ఒక విప్లవశక్తిగా మారాల్సిన జాతీయభావం "సోషలిజం" చివరికి సాంప్రదాయవర్గాల, ప్రభుత్వ పెట్టుబడి దారీ వర్గాల సామాజిక – ఆర్థిక స్వభావాలను గుర్తించలేకపోయింది. దానికే లోబడి పోవడంతో జాతీయభావాలు ఆ వర్గాల ప్రయోజనాలకే ఉపయోగపడ్డాయి. ఈజిప్ట్ సంపన్నవర్గం పాలనవగ్గాలు చేపట్టాడానికి నాసర్ జాతీయవాదం తోడ్పడింది. ప్రభుత్వ ఆధీనంలోని పెట్టుబడిదారీ విధానామే ఇక్కడ "సోషలిజం"గా చలామణి అయ్యింది.

నాసర్ అనుసరించిన అమెరికా వ్యతిరేక సైనిక విధానాలను, విదేశీ విధానాలను అణచివేసేందుకు అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయిల్ 1967 జూన్ 6న ఆరు రోజులు దాడులు చేసి ఈజిప్ట్‌ను, మిత్రదేశాలయిన సిరియా, జోర్డాన్‌లను ఓడించింది. ఈజిప్ట్‌లోని సినాయి ద్వీపకల్పం, గాజాస్ట్రిప్‌లను సిరియాలోని గోలన్‌హైట్స్ ప్రాంతాన్ని, జోర్డాన్‌లోని వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలెంలను ఆక్రమించింది. నాసర్‌కు (ఈజిప్ట్) సైనిక రాజకీయ పరిమితులు అర్థమయ్యాయి. 1963–69మధ్య యెమెన్‌లో జరిగిన అంతర్యుద్ధంలో ఈజిప్ట్ 70 వేల సైన్యాన్ని పంపి 'రిపబ్లికన్' పక్షాన్ని బలపరిచి అక్కడ ఊబిలో దిగడంతో ప్రపంచంలోనే ఈజిప్ట్‌కు చెడ్డపేరువచ్చింది. ఆర్థిక పరిస్థితి క్రమంగా దెబ్బతింది. అయినా సైనిక దళాలకోసం మరిన్ని ఆర్థిక వనరులు ఖర్చు చేసాడు. ఇజ్రాయిల్‌తో రాజీపడ్డాడు. సంతాకాలు చేసాడు. శాంతికోసం ఇజ్రాయిల్ ఆక్రమించిన ప్రాంతాన్ని అప్పగించాడు. దానితో స్వదేశంలో ప్రతిష్ట దెబ్బతిన్నది. ఈ ఓటమి నాసర్‌ను బాగా కృంగదీసినా 1971లో కన్నుమూసేవరకు అధ్యక్షుడుగా కొనసాగాడు. 18సం॥ నాసర్ పాలన తర్వాత అమెరికా అడుగులకు మడుగులొత్తే, ఉపాధ్యక్షుడు అన్వర్ సాధత్ అధికారంలోకి వచ్చి అధ్యక్ష హోదాలో ఇజ్రాయిల్‌తో సంధి కుదుర్చుకున్నాడు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలిచిన ఈజిప్ట్ ఇక అమెరికా సామ్రాజ్యవాదానికి పాదాక్రాంతం అయిపోయింది. **ఇన్‌ఫితా–** నయా ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేయడంతో ద్రవ్యోల్బణం, అప్పులు, అధికధరలు మరింతగా పెరిగాయి. ఆర్థిక స్థితి దిగజారింది. మరోసారి 1973లో ఇజ్రాయిల్–ఈజిప్ట్ దేశాలమధ్య యుద్ధం జరిగింది. ఈసారి ఈజిప్ట్ పై చేయి సాధించినా, రాజకీయంగా అనిశ్చిత పరిస్థితి, వైరం కొనసాగింది. 1978లో అమెరికా అధ్యక్షుడు జిమ్మికార్టర్ ఆధ్వర్యంలో శాంతి చర్చలు జరిగాయి. 1979లో క్యాంప్ డేవిడ్ ఒప్పందం ద్వారా పూర్తిగా అమెరికా అనుకూల ప్రయెజనాలు నెరవేర్చుకున్నారు. ఇజ్రాయిల్, ఈజిప్ట్ దేశాధి నేతలిద్దరూ అమెరికా తొత్తులుగా వ్యవహరించినందుకు ఇద్దరికి కలిసి నోబుల్ శాంతి బహుమతి దక్కింది. క్యాంప్ డేవిడ్ ఒప్పందంతో ఈజిప్ట్ ప్రతిష్ట దెబ్బతిన్నది. అరబ్‌లీగ్ నుండి ఈజిప్ట్‌ను వెలివేసారు. సాధత్ విధానాలను వ్యతిరేకించిన ఇస్లామిక్ శక్తులు తీవ్రంగా అసంతృప్తి చెంది సాధత్‌ను హత్యచేసాయి. తర్వాత వచ్చిన హోస్నీ ముబారక్ 1982లో లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడి చేసినపుడు సమర్థించాడు. పాలస్తీన విషయంలో మధ్యేమార్గం ప్రతిపాదించాడు. 1991 గల్ఫ్ యుద్ధంలో ఇరాక్‌ను కువాయిట్ నుండి తొలగించేందుకు అమెరికా కూటమిలో చేరాడు. 2003లో ఇరాక్‌పై దాడి చేసినపుడు కూడా భాగస్వామిగా చేరాడు. ఈజిప్ట్ గగనతలం అమెరికా యుద్ధ విమానాలకు, సూయజ్ కాలువ అమెరికా యుద్ధ నౌకలకు ఆలవాలమై పోయింది. ఇందుకోసం అమెరికా 1975 నుండి 5వేల కోట్ల డాలర్ల సహాయం అందించింది.

అవినీతితో ఈజిప్ట్‌లోని కొద్దిమంది అత్యంత సంపన్న వర్గంగా తయారయ్యారు. ముబారక్ కుటుంబం విదేశాల్లో లక్ష కోట్ల రూపాయలకు పైగా ఆస్థులు కలిగి వుంది.

1975నుండి ఉపాధ్యక్షుడుగా కొనసాగుతున్న హోస్నీ ముబారక్ అన్వర్ సాధత్ హత్య తర్వాత దేశాధ్యక్షుడయ్యాడు. 30 సం॥ల పాటు సామ్రాజ్యవాదుల 'స్వేచ్ఛావిఫణి' 'నూతన ఆర్థిక విధానాలను' కొనసాగించాడు. సామ్రాజ్యవాదుల 'అరబ్‌లీగ్' లో 1989లో ఈజిప్ట్‌ను చేర్చి సరళీకరణ, ప్రైవేటీకరణలతో అమెరికాకు మరింత సన్నిహితమై ప్రభుత్వ రంగాన్ని కుదించి ప్రైవేట్ దోపిడి యదేచ్ఛగా సాగేలా చేశాడు. అవినీతికి, అణచివేతకు పేరెన్నిక గన్న ముబారక్ వేల కోట్ల రూపాయల ఆస్థుల్ని కొల్లగొట్టి విదేశాలకు తరలించాడు. కొడుకులకు అధికారాన్ని బదలాయించడానికి విశ్వప్రయత్నం చేసాడు. ప్రజల నిరసనతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. అది దేశంలో రాజకీయ సంక్షోభానికి దారితీసింది. దేశంలో ఆర్థిక

పరిస్థితులు మరింత దిగజారి ప్రజల జీవన పరిస్థితులు మారి బతుకు భారమై, దినదిన గండంగా గడపవలసి వచ్చింది. ప్రజల నిరసన ఆకలి దాడులు చూసి భయపడిన ముబారక్ కొడుకు లండన్‌కు పారిపోయాడు.

ఈజిప్ట్‌లో క్రూర పోలీసు వ్యవస్థ ఉంది. ముబారక్ నేషనల్ డెమోక్రటిక్ పార్టీ, ప్రైవేట్‌సేనలు చేసే ఆకృత్యాలకు కొదవలేదు. వాళ్ళు చేసే దౌర్జన్యాలు అనేకం. వారిని ప్రతిఘటిస్తే పోలీసు లాఠీచార్జీ, తుపాకి కాల్పులు ఉంటాయి. హెూస్నీ ముబారక్‌కు వ్యతిరేకంగా ప్రజలు నిరసన ప్రదర్శలు చేస్తే వాళ్ళు, పోలీసులు విచక్షణారహితంగా దాడులుచేసి హింసించారు. బాష్పవాయు ప్రయోగాలు, గ్రెనేడ్ చార్జ్ చేయడంతో వేలాదిమంది ప్రజలు గాయపడ్డారు. వీళ్ళే చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన మ్యూజియంపై దాడిచేసి ధ్వంసం చేసారు. అమూల్యమైన 'పారో' ల ప్రతిమలను, ఈజిప్ట్ చరిత్రలో అంతర్భాగమైన 'మమ్మీలను' ధ్వంసం చేయడం, విలువైన వస్తువులను, సంపదను కొల్లగొట్టడం చేసారు.

దశాబ్ధాలుగా రాజకీయాలకు దూరంగా ఉన్న సైన్యం కూడా ప్రజాస్వామిక ఉద్యమాల పట్ల సానుభూతితో ఉంది. సైనికులు కూడా యూనిఫారమ్ వదిలి ప్రజాందోళనతో కలసి పోయారు. న్యాయాధిపతులుకూడా ముబారక్‌కు వ్యతిరేకంగాకలిశారు. ముబారక్ జేబుసంస్థ అయిన రాజకీయ పార్టీ పట్ల అగ్రహంతో ఆందోళనకారులు ఎన్.డి.పి కేంద్ర కార్యాలయాన్ని అగ్నికి ఆహుతి చేసారు. ముబారక్ ప్రకటించిన కొత్త ప్రభుత్వాన్ని గుర్తించలేదు. ఈజిప్ట గూడచారి విభాగం అధిపతిగా పనిచేసిన 75సం॥ల ఒమర్ సులేమాన్‌ను ఇప్పుడు ఉపాధ్యాక్షుడిగా ముబారక్ నియమించాడు. వీడు పరమ కర్కోటకుడు. ఇజ్రాయిల్ గూడచారి సంస్థ 'మొసాద్' అధిపతి మీర్ దగాన్ కన్నా ఘటికుడని పేరుంది. చిత్రహింసల ఔట్‌సోర్సింగ్ 'రిడెక్షన్' విధానాన్ని అమలుచేసిన చిత్రహింసల స్పెషలిస్టు.

ముబారక్ పదవినుండి వైదొలగి అధికారాలన్నీ సైన్యానికి ఉన్నతశ్రేణి మిలటరీ కమీషన్‌కు ఒప్పగించాడు. ప్రజలు తక్షణ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తున్నారు. హమీ దొరికేవరకు కైరోను ప్రదర్శకులు వదిలి వెళ్ళలేదు. సెప్టెంబర్ వరకు ప్రకటించిన గడువును 2నెలలకు తగ్గించే వరకు పట్టుబట్టారు పార్లమెంటును రద్దుచేయించారు. 'ఆల్‌జజీరా వార్తాసంస్థ' ప్రకారం మొదటి వారంలోనే 150మంది చనిపోగా, 4వేల మంది గాయపడ్డారు. మొత్తం ఉద్యమంలో ఈ సంఖ్యలో అనేకరెట్లు పెరిగాయి. ప్రతిఘటనా విజయాల చరిత్రలో ఈజిప్ట్ ప్రజాందోళనకు ప్రముఖస్థానం లభించింది. (ఈజిప్ట్ తర్వాత 7దేశాలలో వెంటనే ప్రతిఘటనా పోరాటాలు బద్దలయ్యాయి.)

**హోస్నీ ముబారక్ మీద ఎందుకింత వ్యతిరేకత అంటే కారణాలు స్పష్టమే.** 1981లో అధికారంలో వచ్చినప్పటినుండి చేయని దుర్మార్గం లేదు. రాజకీయ స్వేచ్ఛను పూర్తిగా అణగదొక్కాడు. అవినీతికి పట్టంకట్టి, దేశాన్ని కొల్లగొట్టి, విదేశాలకు దోచిపెట్టాడు. అనువంశిక పాలనకు బలవంతంగా అమలు చేయడానికి 34 సవరణలు చేసి వాడి అధ్యక్షపీటాన్ని సుస్థిరం చేసుకున్నాడు. పోలీసుల అధికారాలు పెంచి పోలీసు రాజ్యంగా మార్చాడు. బూటకపు ఆర్థిక సంస్కరణలతో, అమెరికా అనుకూల ఆర్థిక రాజకీయ విధానాలతో 30సం॥ల పాటు పాలించాడు. ధనిక పేదల మధ్య అంతరాలు పెరిగిపోయాయి. 40శాతం ప్రజలకు తిండి దొరకని పరిస్థితి, 40 శాతం నిరక్ష్యరాస్యులున్నారు. నిరుద్యోగం పెరిగిపోయింది. అధికధరలు, ఆకలిచావులు పెరిగిపోయాయి. పశ్చిమాసియాలో దశాబ్దాల పాటు పాలన సాగిస్తున్న ఈ నియంతలను ప్రజలు ఇక సహించడం కష్టం. స్వేచ్ఛగా ఎన్నికలు జరిగిందిలేదు. ముబారక్ నిరంకుశ పాలనకు ప్రజాస్వామిక ముసుగు తొడిగేందుకే 2005లో ఎన్నికలు జరిపి రిగ్గింగ్, దౌర్జన్యాలతో గెలిచాడు. 25శాతం ప్రజలు మాత్రమే ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. 2010 ఎన్నికల్లో కూడా ఇదే విధంగా చేసి గెలిచాడు.

అన్ని సెక్షన్ల ప్రజలు నియంత ముబారక్ తొలగి పోవాలనే ప్రధాన డిమాండ్‌తో అన్ని కీలకప్రాంతాల్లో వారాల తరబడి తిష్టవేసి పోరాడారు. అక్కడి ఉక్కుచట్టాలు. నిషేదాజ్ఞలు, బలప్రయోగాలు వారి పోరాటదీక్షను, పట్టుదలను ఓడించలేకపోయాయి. మంత్రివర్గం రద్దు, ఉపాధ్యక్ష పదవి తిరిగి సృష్టించడం, సంస్కరణల జాబితా ఇలా ఏ రకమైన హామీ, ఉపశమన చర్య కూడా ప్రజల ఆగ్రహాన్ని ఆపలేకపోయాయి. ఫిబ్రవరి 3న తాహ్రిరేస్క్వేర్‌లో ప్రభుత్వ అనుకూల వర్గాలు చేసిన కాల్పుల్లో 7గురు చనిపోయారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు ఉండడంతో ప్రపంచవ్యాపిత చర్చ జరిగి ఈజిప్ట్ ప్రధాని అహ్మద్ షపీజ్ క్షమాపణలు చెప్పాల్సివచ్చింది. అంతర్జాతీయంగా ప్రజల ఆందోళనకు గొప్ప మద్దతు లభించింది.

ఫిబ్రవరి మొదటి వారంలో ఐదు ప్రధాన ఐరోపా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ. స్పెయిన్‌లు చేసిన సంయుక్త ప్రకటనలో "అస్థిరత, హింస తొలగించడానికి అధికార మార్పిడి తప్పదు" అన్నాయి. అమెరికా కూడా అదే విషయాన్ని ప్రకటించింది. నిజానికి ఈజిప్ట్‌లోనూ, మొత్తం అరబ్ ప్రపంచంలోనూ అల్లకల్లోలానికి, అస్థిరతకు, హింసకు వారే బాధ్యులు. సామ్రాజ్యవాదులు చేసిన దురాక్రమణలు, వారికి దోచిపెట్టే దళారీ పాలకులు,

నియంతృత్వాలు, ఆర్థిక రాజకీయ సంక్షోభాలు అన్ని వారిసృష్టే. ప్రజల్లో సామ్రాజ్యవాదులు, స్థానిక నియంతలకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న నిరసనను, ప్రజాస్వామిక చైతన్యాన్ని దారి మళ్ళించేందుకే ఈ దొంగలు ఈ రకమైన ప్రకటనలు చేస్తున్నారు. ఈ పోరాటాలన్నీ సామ్రాజ్యవాదులను, వారి తొత్తులను, నియంతలను లక్ష్యంగా పెట్టుకొని నడుస్తున్నవే. వాటిని నడుపుతున్న శక్తులు దళారీ, అభివృద్ధి నిరోధక పార్టీల కుటిల రాజకీయాలకు ఆ ఉద్యమాలు బలికాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనావుంది.

అరబ్ ప్రపంచం ప్రజాస్వామిక చైతన్యంతో కదం తొక్కుతోంది. కైరోలోని తెహ్రీర్ స్క్వేర్ మిలియన్ మార్చ్‌తో కిక్కిరిసి పోయింది. నూతన శక్తులు ఉద్భవిస్తున్నాయి. కార్మికవర్గం మరింత సంఘటితమై చైతన్యవంతంగా నాయకత్వాన్ని అందించాల్సి వుంది. 1986లో ఫిలిప్పైన్స్‌లోను, 1998లో ఇండోనేషియాలోను ప్రజా ఉద్యమాలు విజయవంతమైనప్పటికీ సరైన మార్గ దర్శకత్వం వహించే స్వీయాత్మకశక్తులు లేకపోవడంతో ప్రజలనుండి అధికారం చేజారిపోయింది. అక్కడిలాగానే ఇక్కడ కూడా దోపిడి పాలకవర్గాలు, సైనికాధికారులు, సామ్రాజ్యవాద శక్తులు పొంచివున్నాయి. ఆ ప్రమాదం పట్ల హెచ్చరికగానే ఉండాలి.

ఈజిప్ట్ విప్లవ సోషలిస్టు సంస్థ ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిస్తూ ఒక ప్రకటనను విడుదల చేసింది. అమరులకు జోహార్లు చెప్పి విప్లవానిదే విజయం అని చెప్పింది. అందులో విషయాలపట్ల స్పష్టమైన అవగాహన, భవిష్యత్ దృష్టి వ్యక్తమవుతున్నాయి. "ఈజిప్టు ప్రజావిజయాన్ని, మారిన పరిస్థితులను విశ్లేషిస్తూ ప్రజల సమైక్యతను నిర్మాణావసరాన్ని తెలియజేసింది. ముబారక్ పలాయనం తొలిఅడుగు మాత్రమే. ఇప్పుడున్న ఒమర్ సులేమాన్, అహ్మద్ షఫీక్‌లు ముబారక్‌కు, అమెరికాకు కూడా సన్నిహితులు, ఏజెంట్లు కూడా. ఈ దేశ సంసద ఈ దేశ ప్రజలకే తిరిగి చేరాలి. విదేశీ బహుళజాతి సంస్థలతో, బడా పెట్టుబడిదారులతో మిలాఖతై అవినీతితో దేశ సంపదను దోచిపెట్టారు. 100 కుటుంబాల చేతిలో 90 శాతం సంపద పోగుపడిఉంది. ఇప్పుడిక్కడ ప్రజలు భూమిని కోల్పోయారు. పేదరికం, నిరుద్యోగం, ఆకలిచావులు ఉన్నాయి. భూమి, పరిశ్రమలు జాతీయం చేసి ప్రజలకు ఇవ్వాలి.

రాజకీయ నిరంకుశత్వం, ఆర్థిక బానిసత్వం రెండూ బొమ్మ – బొరుసు లాంటివి. మనం అమెరికా, ఇజ్రాయిల్‌లకు కాపలా కుక్కలం కాదు. ముబారక్ మనకు సైనిక నియంత, వాళ్ళకు తొత్తు, బానిస. ఈజిప్టును 'వలస'గా మార్చి వారి ప్రయోజనాలకు పని చేసాడు. పాలస్తీనా, ఇరాక్ సోదరులకు మన పాలకులు ద్రోహం తలపెట్టారు.

నేటి విప్లవం ఈజిప్ట్ స్వాతంత్రాన్ని, గౌరవాన్ని, ప్రాంతీయ నాయకత్వాన్ని పునరుద్ధరించాలి. ఇది నిజమైన ప్రజా విప్లవం కావాలి. విద్యార్థి యువజన కార్మికశ్రేణులు పీడిత ప్రజలతో చేరి నడుపుతున్న ఈ విప్లవం అమరుల త్యాగాలతో నడుస్తున్నది. హైజాక్ చేసే శక్తుల ఈ ఉద్యమాన్ని మనం కాపాడుకోవాలి.

విప్లవాన్ని పరిరక్షించేదే ప్రజాసైన్యం. 1973లో జియోనిస్టులకు వ్యతిరేకంగా పోరాడి ఓడించిన సైనిక లక్షణాలు ఈ నాటి సైన్యానికి లేవు. ఈ సైన్యానికి అమెరికా, ఇజ్రాయిల్ తో దగ్గర సంబంధాలున్నాయి. అధికారులు అక్కడ శిక్షణ పొందారు. వేల కోట్ల రూపాయల మిలటరీ సహకారాలు, ఒప్పందాలు ఉన్నాయి. మిశ్రమ ప్రభుత్వం ఇప్పుడు పాత విదేశాంగ విధానాన్నే కొనసాగిస్తామని, అంతర్జాతీయ ఒప్పందాలు కొనసాగిస్తామని ఇజ్రాయిల్‌కు హామీ నిచ్చింది. అంటే ఏమిటి ? నూతన ఆర్థిక విధానాలను, ప్రపంచీకరణ విధానాలను వదులుకుంటామన్న హామీ లేదు. కాబట్టి ఏంచేయాలి?" ఆ కార్యక్రమాన్ని కూడా ప్రకటించారు.

"తక్షణం విప్లవసమితులను ఏర్పరచాలి. క్రింది నుండి పైకి నిర్మించి ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిపి పటిష్టపరచాలి. ఈ సంస్థల నుండి దేశం మొత్తానికి ఒక అత్యున్నత ప్రజామండలి ఎన్నిక కావాలి. అలాగే విప్లవ శ్రేణుల్లో ఈజిప్షియన్ కార్మికులు చేరాలని పిలుపునిస్తూ దేశ భవిష్యత్తును మార్చే కృషి చేయాలన్నారు. రైల్వే, రవాణా, పరిశ్రమలతో సహా అన్ని రంగాల్లో సార్వత్రిక సమ్మె జరగాలని పూర్తిగా శక్తి సామర్థ్యాలను వినియోగించాలన్నారు. ఈ దేశంలో తిరుగుబాటు చేస్తున్న యువతరంతో కలిసి విప్లవ శ్రేణుల్లో ప్రధాన భూమిక పోషించాలన్నారు." ఈ పిలుపు ఆచరణ రూపం ధరిస్తుందని ఆశిద్దాం.

(అరబ్ ప్రపంచంలో రాజకీయ సంక్షోభం గురించి ఒక వరుస క్రమంలో వ్యాసాలు ప్రచురిస్తున్నాం. ఈ సంచికలో ఒకటి టునీషియా, రెండు ఈజిప్ట్ వ్యాసాలు ప్రచురిస్తున్నాం. లిబియా తదితర దేశాల గురించి తరువాత సంచికల్లో చూడగలరు. –సంపాదకవర్గం)

**"సమాజపు ఉత్పత్తి శక్తుల్ని అభివృద్ధి చేయడం మన విప్లవం యొక్క ఉద్దేశం. ఈ లక్ష్యం కోసం మనం తప్పని సరిగా మొదట శత్రువును కూలదోయాలి."**

# చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం డాక్టర్ వినాయక్‌సేన్‌ను, పౌరహక్కులను నిరంకుశంగా అణచివేయడాన్ని ఖండిద్దాం.

1981లో చత్తీస్‌ఘడ్ వచ్చిన వినాయక్‌సేన్ 30సం॥ నుండి డాక్టర్‌గా ఆదివాసుల ఆరోగ్య సంరక్షణకు అంకితమై పనిచేస్తున్నాడు. మొదట కార్మిక నాయకుడు శంకర్ గుహ నియోగితో కలిసి ఆదివాసీ ప్రాంతాలలో పని చేసాడు. ప్రస్తుతం డా॥సేన్ పి.యు.సి.ఎల్‌కు జాతీయ ఉపాధ్యక్షుడు, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్నారు.

2004 దీపావళి పండుగ రోజుల్లో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం దంతేవాడ జిల్లా గొల్లపల్లి గ్రామంలో జరిగిన కాల్పుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు చనిపోయినట్లు పత్రికల్లో వార్త వచ్చింది. పి.యుసి.ఎల్ ఆధ్వర్యంలో నిజనిర్ధారణకు ఒక బృందం వెళ్ళింది. అక్కడి ప్రజలు, భద్రాచలంలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు ఇచ్చిన సాక్ష్యాల ఆధారంగా అక్కడ ఎదురుకాల్పులు జరుగలేదని, పోలీసులే వారిని కాల్చిచంపారని నిర్ధారణ అయ్యింది. “బాబా(తండ్రి) లాంటి వారు పూనుకోకపోతే ఈ నిజం బయటికి వచ్చేదికాదని, బాబా ప్రాణాపాయాన్ని కూడా లెక్క చేయకుండా ఇటువంటి మంచి, మానవీయ కృషి చేస్తున్నారని” ఆ బృందంలో ఉన్న కన్నబిడ్డ ప్రాణహితసేన్ (విద్యార్థిని) ఎంతో గర్వంగా చెప్పుకుంది. ఎప్పటినుండో వినాయక్ సేన్ చేస్తున్న ఈ రకమైన పనులు నచ్చని చత్తీస్‌గడ్ పోలీసులు ఈ నిర్ధారణ వెలుగులోకి రావడంతో మరింతగా ఆయన చుట్టూ ఉచ్చు బిగించారు.

సల్వాజుడుం మారణకాండపై 2006లో వినాయక్‌సేన్ ఒక నివేదికను తయారు చేసాడు. అందులో చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం మీద మూడు తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. 1. సల్వాజుడుం అప్పటికప్పుడు తయారయిన ప్రజా ఉద్యమం కాదు. 2. అది ప్రభుత్వం నిర్వహిస్తున్న తీవ్రవాద వ్యతిరేక ఉద్యమం. 3. పల్లెలను బారీ స్థాయిలో తుడిచిపెట్టి, లక్షలాది మందిని శరణార్దులను చేయడానికి చేసిన ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఆ హింసను రెచ్చగొట్టింది. పోలీసులు డాక్టర్ సేన్ మీద “చట్టపరమైన చర్యలు” తీసుకోవడానికి ఈ నివేదికనే కారణం.

ప్రజల డాక్టరు, చట్టబద్దంగా పనిచేస్తున్న పి.యు.సి.ఎల్ క్రియాశీల కార్యకర్త అయిన వినాయక్ సేన్‌ను ఒక పథకం ప్రకారం కనబడుట లేదని ప్రచారం చేసారు పోలీసులు. పత్రికలకు తన మొబైల్ నెంబరిచ్చి తాను బహిరంగంగానే ఉన్నానని, ప్రతి నిముషం అందుబాటులోనే ఉంటానని చెప్పి వినాయక్ సేన్ ఆ కుట్రను ఓడించాడు. దానితో గంగ వెర్రులెత్తిన పోలీసులు 2007 వేసవిలో బిలాస్‌పూర్‌లో హైకోర్టు లాయర్‌ను కలవడానికి డా॥సేన్ వెళ్లినపుడు అరెస్టు చేసారు. ఏడునెలలు జైలులో విచారణ ముద్దాయిగా ఉన్న తర్వాతనే ఆయనపై అభియోగాలు మోపారు.

అభియోగాలు లేకుండా ఎందుకు జైలులో పెట్టారని దేశ, విదేశాల్లోని విద్యార్థి, మేధావి వర్గాలనుండి వచ్చిన ప్రశ్నకు చత్తీస్‌ఘడ్ డి.జి.పి విశ్వరంజన్ “దర్యాప్తు జరుగుతున్నప్పుడు జ్యూడిషియాల్ కస్టడీ ఏళ్ళ తరబడి కూడా ఉంటుంది” అని సమర్ధించుకున్నాడు. 2సం॥ల పాటు దేశ విదేశాల్లో ఆయన విడుదలకు అన్ని స్థాయిల్లో, వివిధ పద్దతుల్లో పోరాటాలు చేపట్టారు. చివరికి 2సం॥ల తర్వాత 2009 మేలో ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాధారమేదీ సమర్పించకపోవడం వల్లనే డా॥సేన్‌కు బేషరతు బెయిల్ వచ్చి విడుదలయ్యాడు. మరల విచిత్రంగా ఆదే అరకొర సాక్ష్యం ఆధారంగానే యావజ్జీవ కారాగారశిక్ష వేసారు. సాక్ష్యాధారాల నాణ్యత గురించి చూడలేదు. శిక్ష వేయాలనుకున్నారు కాబట్టి పాలకులు, వారి అనుకూల న్యాయస్థానాలు జీవిత ఖైదు శిక్ష వేసారు. ప్రభుత్వానికి, పోలీసులకు ప్రతీకారవాంచ, (అది డిజిపి రాథోడ్ అయినా, విశ్వరంజన్ అయినా) ఏ స్థాయిలో ఉందో ఆర్ధమవుతుంది. సరైన సాక్ష్యాలు లేకుండా జీవితఖైదు శిక్ష వేసిన కేసుల్లో ఇది ఒకటి. వివరాల్లోకి వెడితే...

సి.పి.ఐ మావోయిస్టు నాయకుడు నారాయణసన్యాల్ (విజయ్‌దా) ను 2006లో రాయపూర్ జైలుకు తీసుకవచ్చారు. సన్యాల్ కుటుంబసభ్యులు డా॥సేన్‌ను కలిసి “అనారోగ్యంతో ఉన్న సన్యాల్‌కు శస్త్ర చికిత్స అవసరాన్ని అధికారులకు నచ్చచెప్పేందుకు ” సహకారాన్ని కోరారు అధికారులకు నచ్చ చెప్పడంలో డా॥సేన్ సహకరించారు. (ఆ పత్రాలన్ని కోర్టు ప్రకటనలో ఇచ్చారుకూడా)

నక్సలైటు లేఖలు, పత్రికలను సన్యాల్, గుప్తా(బీడి ఆకు కాంట్రాక్టరు)లకు అందజేసే వార్తాహరుడుగా డా॥సేన్ వ్యవహరించినట్లు పోలీసులు కేసు నమోదు చేసి, చాలా కాలానికి చార్జిషీటు పెట్టారు. ప్రజల ఒత్తిడి పెరగడం, కేసులో బలమైన సాక్ష్యం లేకపోవంతో 2సం॥ల తర్వాత బెయిల్ అదికూడా భేషరతు బెయిల్ వచ్చి విడుదలయిన విషయం అందరికీ తెలిసినదే. డాక్టర్ వినాయక్‌సేన్‌పై అక్రమ నిర్బంధాన్ని వ్యతిరేకించిన ప్రజల నిరసనను

మీడియాకూడా ప్రచారం చేసింది. అయితే 2010 డిసెంబర్ 24న రాయపూర్ లోని 2వ అదనపు సెషన్స్ జడ్జి బి.పి. వర్మ 92 పేజీల తీర్పును చదివి వినిపించారు. "నక్సలిజాన్ని ప్రేరేపించడంలోను.. దేశద్రోహం తలపెట్టిన కుట్రలోను నిందితుడు" అని గట్టిగా చెప్పి 'కఠిన జీవిత కారాగారశిక్ష' అని తీర్పు చెప్పాడు. అప్పుడు డా॥వినాయక్‌సేన్‌ను రాజద్రోహ నేరానికి రాయపూర్ జైలుకు తరలించి నిర్బంధించారు.

ఇందులో 1) ముఖ్యమైన సాక్షిని ప్రవేశపెట్టలేదు. ఆ సాక్షి అనిల్‌కుమార్ సింగ్ జాడలేదు. 2) గుహను అరెస్టు చేసినట్లు చూపిస్తున్న ప్రదేశాల్లో తేడా వుంది. 3) సొంత సూత్రం ప్రాతిపదికన (''ఈ కేసు సందర్భానుగతంగా నిర్మించబడింది. ఇది సాక్ష్యాధారాలకన్నా శక్తి వంతమైనది" అని డిజిపి విశ్వరంజన్ అన్నారు.) ఈ కేసు నిర్మించారు కాబట్టి శిక్షకు సాక్ష్యాధారాలకు సంబంధం లేదు. 4) లేఖలను చేరవేశారనడాన్ని పూర్తిగా నిరూపించలేకపోయారు. 5) సాక్ష్యాధారాలను సీలు వేయని సంచుల్లో తీసుకువెళ్ళిన పోలీసులు అందులో ఏవైనా మరికొన్ని చేర్చవచ్చు.

మన దేశంలో విచారణ జరుగుతున్న తీరును అనుమానించిన విదేశీ న్యాయవాదులు, మేధావులు విచారణ సమయంలో కోర్టుకు రావడానికి 8 యూరప్ దేశాలనుండి అనుమతిని కోరారు. వారికి చత్తీస్‌ఘడ్ హైకోర్టు అనుమతి ఇచ్చింది. వారు, మన మేధావులు, ప్రజలు ఊహించిన విధంగానే పౌరహక్కుల ఉద్యమాలను పీకనొక్కే దురుద్దేశంతో, అన్ని సెక్షన్లను హెచ్చరిస్తూ ఈ తీర్పు వెలువడింది.

చిన్నప్పుడే సేవాదృక్పథం కనబరిచిన వినాయక్‌సేన్‌ను తల్లి 'రాజయోగి' అంటుంది. కాన్సర్‌తో పోరాడి గెలిచిన భార్య ఎలినా డా॥సేన్‌ను నిర్బంధం, తప్పుడు కేసులనుండి విముక్తి చేయించేందుకు పోరాడుతుంది. ఈ కేసు వాదిస్తున్న ప్రముఖ న్యాయవాది రామ్‌జెత్మాలాని డా॥వినాయక్‌సేన్‌కు 'భారతరత్న' ఇచ్చి గౌరవించాలని అన్నారు. వైద్యరంగంలో డా॥సేన్ అందించిన సేవలకు జోనాథన్‌మన్ ఆవార్డు ఫర్ హెల్త్ అండ్ హ్యూమన్‌రైట్స్ లాంటి అనేక అవార్డులు ఆయనకు వచ్చాయి. అంకిత భావంతో ఆదివాసుల మధ్య వైద్యసేవలంధించి, వారి హక్కుల కోసం ఉద్యమించాడు.

బినాయక్ సేన్‌కు జీవిత ఖైదు శిక్ష వేయడం సరైనది కాదని, ఇది అన్యాయమైన తీర్పు అని దేశంలో, ప్రపంచ వ్యాపితంగా నిరసనలు వెల్లువెత్తాయి. జీవితఖైదు శిక్ష విధించడానికి ఆందోళన చెందుతూ ది బ్రిటిష్ హౌస్ ఆఫ్ కామన్స్, ది బ్రిటిష్ మెడికల్ కౌన్సిల్, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, హార్వర్డ్ మెడికల్ స్కూల్ నిరసన తెలియజేసాయి. అమర్త్యసేన్ లాంటి 40మంది నోబుల్ పురష్కార గ్రహీతలు, నోమ్‌చామస్కీ లాంటి ప్రముఖులు ఖండించారు. డా॥వినాయక్ సేన్ మీద రాజద్రోహ నేరం కేసు మోపబడింది. నారాయణ సన్యాల్. పియూష్ ఘోష్‌లపై కూడా మోపబడిన ఈ కేసులు పోలీసులు, ప్రభుత్వం కుట్ర పూరితంగా బనాయించినవే. అలాగే ఆదే రోజున (డిసెంబర్ 24న) రాయపూర్‌లోనే మరో సెషన్ కోర్టులో 'వరల్డ్ టు విన్' ప్రచురణకర్త, 'స్ట్రగుల్ ఇండియా' సంస్థ అధ్యక్షుడు అసిత్‌సేన్ గుప్త పై ఒక తప్పుడు కేసులో 8సం॥లు కారాగారశిక్ష విధించారు. ఇప్పుడు రాజ్యం కుట్రతో జనవరి 2న మహారాష్ట్ర వార్ధాలో అరెస్టు చేసిన మహారాష్ట్ర రిపబ్లికన్ ఫాంథర్స్ నాయకుడు సుధీర్ దావ్లేకు మావోయిస్టులతో సంబంధాలున్నాయని ఆరోపించింది. ప్రజల పక్షాన ఉన్న మేధావులను మావోయిస్టు ముద్రతో శిక్షించే ప్రమాదం పెరిగిపోతున్నది. ఈ హింసారాజ్యమే రాజద్రోహనేరాన్ని మోపుతుంది. ప్రజలు పోరాడి ఓడించకతప్పదు. ఈ శిక్షలన్నీ రద్దుచేసి, వారిని విడుదల చేసేవరకు అవిశ్రాంతంగా పోరాడాల్సిన అవసరం ఉంది. విప్లవోద్యమాన్ని ఒంటరి చేసే కుట్రలను ఓడించాల్సి ఉంది.

---

*(....8వ పేజీ తరువాయి)*

ప్రజావ్యతిరేకంగా పాలిస్తూనే వున్నారు. ఈ కంపెనీలలో విదేశీ కంపెనీలకు పెద్ద వాటాలున్నాయి. కంట్రోల్ చేసేదివాళ్ళే. పరోక్షంలో మన ప్రభుత్వాలను కూడా నడిపేది వాళ్ళే.

సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక రాజకీయ విధానాల ఫలితంగా నిన్న సోంపేట, నేడు కాకరాపల్లి అగ్నిగుండాలుగా మారాయి. రేపు ఇదే జిల్లాలో మేఘవరం, డొంకూర్, రణస్థలంలలో కూడా అగ్నిగుండం పేర్చడానికి ప్రభుత్వం సిద్ధపడుతుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదుర్కొవడానికి ప్రతిఘటన ద్వారా విజయాలు సాధించడానికి మరింతగా సంఘటితం కావలసి ఉంది. నెత్తురు చిందించిన సోంపేట, కాకరాపల్లి ఉద్యమాలు భవిష్యత్ ఉద్యమాలకు దిక్సూచీలే. ఉద్యమాల కాలం ఇది. ఉద్యమించడమే చలన నియమం.

ప్రజలు సంఘటితంగా పోరాడి ప్రజారాజ్యం సాధించేందుకు విముక్తి పోరుబాటల్లో అడుగులు కలుపుదాం. సోంపేట, కాకరాపల్లి ఒంటరిగా లేవు. లాల్‌గఢ్, నారాయణపట్నాల బాసట చేరిపోయాయి. అణచివేత ఏ స్థాయిలో ఉంటే ప్రతిఘటన ఆ స్థాయిలో వుంటుందని ఈ పోరాటాలు చాటి చెబుతున్నాయి.

# కలెక్టర్‌ను కిడ్నాప్ చేసి ఒరిస్సా ప్రభుత్వం మెడలు వంచిన పి.ఎల్.జి.ఎ

ఒడిస్సా రాష్ట్రంలో మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ వినీల్‌కృష్ణను, జూనియర్ ఇంజనీర్ పవిత్ర మాజీలను సి.పి.ఐ (మావోయిస్టు) ఫిబ్రవరి 16వ తేదిన కిడ్నాప్ చేసింది. కొన్ని డిమాండ్లను ముందుపెట్టి ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని హెచ్చరించింది. ఒడిషా ప్రభుత్వం మావోయిస్టులు పెట్టిన షరతులకు అంగీకరించి కలెక్టర్, ఇంజనీరుల విడుదల కోసం యంత్రాంగాన్ని వేగిరపరిచింది. మధ్యవర్తులు శ్రీయుతులు ఆర్.ఎస్ రావు, హరగోపాల్, దండపాణి మహంతలతో సంప్రదించి ఇద్దరు ప్రభుత్వాధికారులు క్షేమంగా విడుదలయ్యేలా చేసుకుంది.

మావోయిస్టులు ప్రభుత్వం ముందుపెట్టిన అన్ని డిమాండ్స్ కూడా ప్రజల డిమాండ్స్. ప్రజలమీద తలపెట్టిన గ్రీన్‌హంట్ యుద్ధాన్ని ఆపాలి. బలగాలను ఉపసంహరించాలి. తక్షణం కూంబింగ్స్ నిలిపివేయాలి. ఇది ఒక్క చోటకాదు దేశమంతా ఉన్న డిమాండ్, ఈ డిమాండ్ మీద సామాన్య ప్రజలనుండి ప్రపంచ మేధావులు. అత్యున్నత న్యాయస్థానాలు మొత్తుకున్నా గాని కనీసం అంగీకరించని ప్రభుత్వాలు ఇప్పుడు ఆ పరిస్థితిని అంగీకరించడమే కాకుండా తక్షణం బలగాలను నియంత్రించాయి.

ఒడిషా ప్రభుత్వం వేదాంత, పోస్కో, ఎస్సార్ వంటి ఎన్నో బహుళజాతి కంపెనీలతో, టాటావంటి బడా కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను (ఎమ్.ఒ.యు)లను రద్దుచేయాలి. లక్షలాది ప్రజలను నిర్వాసితులను చేసే గనులు తవ్వకాలు, ప్రాజెక్టు నిర్మాణాలు ఆపాలి. 22శాతం ఆదివాసుల పొట్టగొట్టి సమృద్ధిగా ఉన్న సహజవనరులు తరలించుకు పోవడాన్ని నిలిపివేయాలన్నారు. మాలి, దేవమాలితో సహ అన్ని ప్రాంతాలలో అల్యూమినియం, ఇనుము లాంటి ఖనిజాల తవ్వకాలను ఆపాలని డిమాండ్ చేస్తున్న ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తూ, ఆదివాసీ స్త్రీలపై అత్యాచారాలు చేస్తూ, పిల్లలని చూడకుండా ఎన్‌కౌంటర్‌లలో చంపుతున్నాడు. అక్కడ జిల్లా కమిటీ నాయకుడు శ్రీనివాస్ (రవి) తో పాటు అనేక మందిని నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపారు పోలీసులు. నారాయణపట్నాలో సింగన్న, ఆండ్రూతో పాటు మరికొంత మందిని పోలీసులు క్రూరంగా హత్యలు చేశారు. అక్కడ ఆదివాసుల భూమికి రక్షణ లేదు. భూములు క్రమబద్దీకరణ (1956) చట్టం అమలు చేయడం లేదు. నారాయణపట్నాలో ప్రజలు తిరిగి ఆక్రమించుకున్న తమ భూములకు రక్షణ కల్పించాలి. కొత్తగా సాగుచేసిన భూములకు పట్టాలివ్వాలి అని డిమాండ్ చేశారు. అక్కడ భూపోరాటాలు చేస్తున్న ప్రజలపై శాంతి సంఘం, పోలీసు, పారామిలిటరీ, ఎస్ఒజి బలగాలు దాడులు చేస్తున్నాయి. ఆ దాడులు ఆపాలని, వాటిపై వెంటనే విచారణ జరపాలన్నారు.

బలిమెల రిజర్వాయర్ ప్రాంతంలో కట్‌ఆఫ్ ఏరియా లో ముంపుకు గురైన గ్రామల రైతాంగనికి నష్ట పరిహారం కోసం అనేకసార్లు వేలాది మంది ప్రజలు మిలిటెంట్ పోరాటాలు చేసినా సమస్యలు పరిష్కారం కావడంలేదు. అక్కడ పుట్టి పెరిగిన ఆదివాసీలైన కొండరెడ్లకు రిజర్వేషన్ గురించి అనేక సం॥గా ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. లక్షాలాది ప్రజలు నిర్వాసితులయ్యే (మల్కన్‌గిరి జిల్లాలో కూడా అనేక గ్రామాల ప్రజలు) పోలవరం నిలిపివేయాలని, కలిమెల ప్రాంత రైతుల భూములకు సాగునీరు అందించాలని డిమాండ్‌తో చాలా కాలంగా ప్రజలు ఆందోళన చెందుతున్నా, ఉద్యమాలు చేపడుతున్నా ఫలితం ఉండడం లేదు. ఈ కిడ్నాప్‌తో ఆ సమస్యలన్నీ మరల చర్చకొచ్చాయి. పరిష్కరిస్తామనే హామీ కూడ ఇవ్వాల్సి వచ్చింది. ఏ రకం సమస్యలున్నాయి ఎంత దయనీయ పరిస్థితులున్నాయో, అవి ఎలా కొనసాగుతున్నాయి ఈ సందర్భంగా అందరికీ అర్థమయ్యింది.

ఒడిషాలో భువనేశ్వర్, కోరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, గజపతి జైల్లల్లో 700మంది ఆదివాసులు నిర్బంధించబడి ఉన్నారు. బహుళజాతి కంపెనీలను అడ్డుకున్నందుకు, ప్రజా ఉద్యమాలలో పాల్గొన్న కారణంగానే వీరిని నిర్బంధించారు. అరెస్టులకు నిరసనగా సుందర్‌గడ్, చాందీపోష్, నారాయణపట్నా, బందుగాం, కోరాపుట్, మల్కన్‌గిరి, కలిమెల అనేక ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు, బాధిత కుటుంబాలు బందుమిత్రులు, ప్రజాసంఘాలు కలిసి రాస్తారోకో, ధర్నాలతో పాటు బంద్ కార్యక్రమాలు నిర్వహించారు. అక్రమ కేసులు, అక్రమ నిర్బంధం, గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నో సం॥ల తరబడి విచారణలేదు. బెయిల్ రాదు. బెయిల్‌పై విడుదలయినా, కేసును ఒకవేళ కొట్టివేసి బయటికి వచ్చినా వెంటనే గేటు దగ్గరనే తిరిగి అరెస్టులు చేస్తున్నారు. ఇలా ఒడిషాలో అనేక సార్లు జరుగుతూ వస్తుంది. దీనికి నిరసనగా జైళ్ళలోని ఖైదీలు అనేక విజ్ఞప్తులు చేశారు. వివిధ పోరాటాలు చేపట్టారు. ఆమరణ నిరహారదీక్షలు (2010 సెప్టెంబర్ 15నుండి ) జరిగాయి. హామీలు ఇచ్చి మరల మరల అదే విధానాన్ని కొనసాగిస్తున్నారు అధికారులు, ప్రభుత్వం పట్టించుకోలేదు. శాంతియుతంగా, చట్టబద్దంగా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితంలేని పరిస్థితుల్లో మిలిటెంట్ చర్యలకు ⇨

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో చేనేత కార్మికుల ఆత్మహత్యల కొనసాగింపు

ప్రభుత్వ విధానాలు చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదు. ప్రపంచీకరణ విధానాలు దేశంలో చేనేత రంగాన్ని అన్ని విధాల వినాశానానికి గురిచేసాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పిన ఉచిత విద్యుత్, చేనేత పార్కుల ఏర్పాటు, జనతావస్త్ర పథకం, పునరావాస పథకం, రుణసౌకర్యం, పావలావడ్డీ పథకం ఏవి కూడా అమలుకాలేదు.

నూలు ధరలు తగ్గించలేదు. నూలు ధరలు తగ్గించడం తమ చేతుల్లో లేదని ప్రభుత్వం చేతులెత్తేసింది. సబ్సిడీలు ఇస్తామని ప్రకటించి కూడా అమలు చేయడం లేదు. మరమగ్గాలకు విద్యుత్ సబ్సిడీ 50శాతం ఇవ్వాలని 10సం॥ల క్రితం ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు ఆ సౌకర్యం రద్దు చేసింది. జనవరి 2న ముఖ్యమంత్రి తనను కలిసిన చేనేత కార్మికుల ప్రతినిధులకు హామీ ఇచ్చారు. కానీ అది అమలు కావడంలేదు. అన్ని చోట్ల ట్రాన్స్‌కో అధికారులు పూర్తిగా బిల్లు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. అనంతపురం జిల్లాలో 10వేల మగ్గాలు ఉన్నాయి. వారంతా ఇప్పుడు యూనిట్‌కు రూ॥ 1-80పై చెల్లించాల్సి వస్తున్నది. ఇలానే అన్ని జిల్లాల్లో పరిస్థితి ఉంది.

ప్రకాశం జిల్లాలో వ్యక్తిగత పరపతితో 500మంది కార్మికులు కోటిన్నర రూపాయలు రుణాలు తీసుకొని స్వంతంగా బతకాలని నిర్ణయించుకున్నారు. వీరందరిని రుణమాఫీ పథకం నుండి తొలగించింది. దరిదాపుగా అన్ని జిల్లాలలోను ఇదే పరిస్థితి నెలకొన్నది. గత బడ్జెట్‌లో రుణమాఫీ పథకం ప్రకటించి కూడా రుణాలను రద్దు చేయలేదు. బడ్జెట్ కేటాయింపుల్లో 2రకాల మోసం జరుగుతుంది. ఎన్నికలకు ముందు ఓట్లు గుంజుకునేందుకు

---

⇨

తలపడుతున్నారు. వాటితోను ప్రభుత్వం పట్టించుకోని స్థితిలో ఈ కిడ్నాప్ లాంటి చర్యలు కూడా అవసరమవుతున్నాయి. కార్యకర్తల మీద, ఆదివాసులమీద తప్పుడు కేసులు ఎత్తివేసి, విడుదల చేయాలనే డిమాండ్‌కు ప్రభుత్వం ఇపుడు అంగీకరించింది. కామ్రేడ్స్ గంటి ప్రసాదం, శ్రీరాముల శ్రీనివాస్, గణనాథ పాత్రోలతో సహ పార్టీ కామ్రేడ్స్, ప్రజల విడుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా? కూంబింగ్‌లు ఆపుతుందా? ప్రజల సమస్యలను పరిష్కారిస్తుందా? బహుళజాతి కంపెనీలతో ఒప్పదాలను రద్దు చేసుకుంటాందా? ఒక్క కిడ్నాప్‌తో సమస్యలన్నీ పరిష్కారం అయిపోతాయా?.

కిడ్నాప్ ఆ నిర్దిష్ట పరిస్థితుల్లో ఒక ఎత్తుగడ మాత్రమే. సమస్యలన్నీ ఒక్క కిడ్నాప్‌తోనే పరిష్కారం కావు కాని అది ఒక పోరాట రూపమనేది గత అనుభవాల నుండి మనం గుర్తిస్తున్నదే. ప్రభుత్వ స్వభావాన్ని ఎండగట్టడానికి, ప్రజల సమస్యల్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి ఒక మేరకు ఉపయోగపడుతుంది.

కలెక్టర్ మంచివాడు. తెలివైనవాడు, 'సంస్కర్త' అనేవి ఇక్కడ ప్రధానం కాదు. వాటిని విడిగా చూడకూడదు. ఈ దోపిడీ, అణచివేత దాడులు చేస్తున్న రాజ్యంలో ఏ పాత్ర నిర్వహిస్తున్నాడు. 'అభివృద్ధి' సంస్కరణల పేరుతో విప్లవశక్తుల్లో చీలిక తెచ్చేందుకు, మన కుటుంబాలలో చిచ్చు పెట్టడానికి ప్రజల్లో ఎటువంటి ప్రయత్నాలు చేస్తున్నాడో, ప్రజల్లో ఎటువంటి చీలిక తెచ్చాడో ప్రజల్లో వివరంగా చెప్పాల్సి వుంటుంది. రాజకీయ పార్టీలు, సామ్రాజ్యవాద అనుకూల శక్తులు మావోయిస్టులకు వ్యతిరేకంగా మాట్లాడి కలెక్టర్‌ను గొప్ప వ్యక్తిగా చెప్పి ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. విప్లవోద్యమం పట్ల ప్రజలకున్న విశ్వాసంతో అవి నిలువలేదు. ఇటువంటి కిడ్నాప్ ఎత్తుగడల వలన ప్రజల పాత్ర, చొరవ తగ్గిపోతున్నదనే వాదనలో వాస్తవం లేదు. ఇదొక పోరటరూపం. ప్రభుత్వంతో తలపడేటపుడు ప్రజలు అనేక ఎత్తుగడలను వినియోగించుకుంటారు. సాదారణ పరిస్థితులు లేనపుడు ప్రత్యేక పరిస్థితుల్లో అవలంబించాల్సిన ఎత్తుగడలు అవలంబించడం వలన విప్లవక్యాంపుకు అనుకూలమైన పరిస్థిలులు వస్తాయి. తాత్కాలికంగనైనా చొరవ ప్రజల చేతుల్లోకి వస్తుంది. ఇది ఒంటరి పోరాటం కాదు. ఐక్య ఉద్యమాలకు చొరవను పెంచేది మాత్రమే. ఈ సందర్భంగా ఎఓబి స్పెషల్ జోనల్ కమిటీ పత్రికలకు డిమాండ్స్ పత్రం విడుదల చేయడంతో పాటు ప్రజలకు పిలుపునిచ్చింది. అందులో అవినీతి, అణచివేతలతో పాలిస్తున్న దోపిడివర్గాల, ప్రభుత్వ సంస్కరణల బూటకత్వాన్ని తిప్పికొట్టి, దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ ఉద్యమాలు నిర్మించాలని చెప్పింది. అవే ప్రధానం కావాలి. ప్రజాయుద్ధంలో విస్తృతంగా చేరి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలని కోరింది. ఈ కిడ్నాప్ ఒరిస్సా ప్రభుత్వ బలహీనతల్ని బయటపెట్టింది. సి.పి.ఐ (మావోయిస్టు) డిమాండ్లను ప్రభుత్వం ఒప్పుకుంది. కిడ్నాప్ ద్వారా పాలకవర్గాల్లో కలవరాన్ని కలిగించిన పి.ఎల్.జి.ఎకు జేజేలు.

అనుగుణంగా బడ్జెట్ లెక్కల్లో కేటాయించి, గెలిచినాక పట్టించుకోకపోవడంతో బడ్జెట్ లెక్కల్లో కనబడిన కేటాయింపులు ఆచరణలో మాత్రం కనబడకపోవడం సాధారణమయిపోయింది.

గత 4బడ్జెట్‌లలో (2007 నుండి 2011) చేనేతకు కేటాయింపులు పెరిగినట్లు కనబడుతున్నా అవి కార్మికులకు కాదు. బడాబాబులకే. చేనేత కార్మికులకు ఖర్చు చేస్తున్నవి 31కోట్ల 46లక్షల రూ॥మాత్రమే. రోశయ్య బడ్జెట్‌లో ప్రేమ ఒలకపోశాడు. రుణమాఫీలని బడ్జెట్ సందర్భంగా గతంలాగానే ప్రకటించి ఓట్లు గెలుచుకున్నారు గాని రుణాలను రద్దు చేయలేదు. బ్యాంకు అధికారుల ఒత్తిడికి చేనేత కార్మికులు అప్పులు తీర్చలేక ఇల్లు వదిలి వలస పోతున్నారు. ప్రైవేటు అప్పులు తీర్చలేనంత భారంగా పెరిగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రతినెల 10,12 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకొని చనిపోతున్నారు.

దేశంలో 40లక్షల మగ్గాలుంటే మన రాష్ట్రంలో 4లక్షల 20వేల మగ్గాలున్నాయి. వ్యవసాయం తరువాత అత్యధికంగా ఆధారపడే రంగం ఇదే. ఇవి రెండవ ఉత్పత్తి రంగం. మన రాష్ట్రంలో 30లక్షల మంది చేనేత మీద ఆధారపడి జీవిస్తున్నారు. చేనేత రంగంలో సంక్షోభానికి, ఆకలి చావులు, ఆత్మహత్యలకు ముఖ్యకారణం నూలు ధరలు విపరీతంగా పెరిగి పోవడం. పొరుగు రాష్ట్రాలలో సబ్సిడీ ఇస్తున్నా మన రాష్ట్రంలో సబ్సిడీ ఇవ్వడంలేదు. తమిళనాడులో 2లక్షల మగ్గాలున్నా వారి ఉత్పత్తులు ఎక్కువ ఉన్నాయి. వాళ్ళు మన రాష్ట్రంలో ప్రతీ సం॥ము 8వేల కోట్ల రూపాయల వస్త్రాలు అమ్ముతున్నారు. అక్కడి ప్రభుత్వాలిస్తున్న ప్రోత్సాహం ఇక్కడ లేదు. చేనేతకు నిధుల కోసం తెలంగాణ, రాయలసీమ, కోస్తా అన్ని ప్రాంతాల్లో ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత ప్రత్యేక అభివృద్ధినిధి, అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధినిధి (పీలేరు) పేరుతో 835 కోట్ల రూపాయలు విడుదల చేశారు. రాజకీయ ఉనికిని నిలబెట్టుకోవడానికి, తమ కార్యకర్తల ప్రయోజనాలకు, అనుత్పాదక రంగానికి ఖర్చు చేశారు తప్ప చేనేత కార్మికులకు ఖర్చు చేసింది లేదు. డ్వాక్రా మహిళలకిచ్చే పావలా వడ్డీ రుణాలు, పనికి ఆహార పథకం కేటాయింపులు అన్ని అవినీతి, రాజకీయాల లబ్ధికే తప్ప ప్రజలకు చేరుతున్నది స్వల్పమే. చేనేత కార్మికుల కిస్తానన్న పావలా వడ్డీ పథకం అసలు అమలుకే నోచుకోలేదు. సామాజిక భద్రతా పథకాలకు వివిధ విభాగాల కింద 1250 కోట్ల రూపాయలు కేటాయింపులు జరగాల్సివుంది. అవన్నీ ఈసారి బడ్జెట్‌లో లేవు. త్రిప్ పథకం గురించిన ప్రస్తావనేలేదు.

6నెలల కాలంలో సమస్యలన్నీ పరిష్కారిస్తాం. చేనేత రంగంలో ఆత్మహత్యలుండవని ముఖ్యమంత్రి, చేనేత మంత్రి శంకర్రావు ప్రగల్భాలు పలికారు. వివక్ష కొనసాగుతునే ఉంది. ఉపాధి రంగంను నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజలు జీవనోపాదిలేక ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు.

పరిశ్రమల అభివృద్ధికి 200కోట్ల రూపాయలతో ప్రోత్సాహకాలు ప్రకటించిన ప్రభుత్వం చేనేత రంగాన్ని కనీసంగా పట్టించుకోలేదు. చేనేత రంగ రుణాలకు 1000కోట్ల రూ॥లు గ్యారంటీ ఇవ్వాల్సి ఉండగా కేవలం 160కోట్ల రూ॥ ఇచ్చింది. ఈ సం॥ సిల్క్, కాటన్ ధరలు అడ్డు అదుపులేకుండా పెరుగుతున్నాయి. 500కోట్ల రూపాయలు సబ్సిడీల క్రింద ఇవ్వాల్సిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. వ్యవసాయశాఖతో పాటు చేనేత రంగం రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. కొన్ని జి.ఒలను విడుదల చేసి చేతులు దులుపుకుందేగాని ఆచరణలో రుణమాఫీ ఇంతవరకు జరగనేలేదు.

రాజోలీ, ఐజ వరదబాదితులకు ఇల్లు కడతామని హామీ ఇచ్చి ఇంతవరకు ఇల్లు కట్టనేలేదు. స్థలాలను కూడా కేటాయించలేదు. 600 కుటుంబాలు పక్క గ్రామాలలో తల దాచుకుంటున్నారు. కోస్తా తీరంలో తుఫాన్‌ల తాకిడికి దెబ్బతిన్న చేనేత బతుకుల్లోకి తొంగి చూసింది లేదు. నిధుల కొరత ఉంది అని ప్రభుత్వం చేనేత కార్మికులకు శూన్యహస్తం చూపిస్తున్నది. బడా కాంట్రాక్టర్లకు, పారిశ్రామికాదిపతులకు వేలకోట్ల రూపాయలు చెల్లిస్తున్నది. చేనేత కార్మికులకు ఉపాధి. సంక్షేమ పథకాల గురించి బడాయి కబుర్లు, కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలకు కారణమైన సంక్షోభాన్ని పరిష్కరించడంలేదు. చేనేత కార్మికులకు పోరాట మార్గం తప్ప, మరో మార్గం లేదు. నూలు ధరలు తగ్గించడం, సరపరాలు పెంచడం, సబ్సిడీలు ఇవ్వడం, రుణాలు మాఫీ చేయడం, బడ్జెట్ కేటాయింపులు పెంచడం, సామాజిక భద్రతా పథకాలు చేపట్టడం, మార్కెట్ కల్పించడం లాంటి ఎన్నో సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవాలి. అలా పట్టించుకునే విధంగా ఉద్యమాలను తీవ్రం చేయాల్సివుంది. చేనేత కార్మికుల పోరాటానికి అన్ని రంగాల నుండి పూర్తి మద్దతునిచ్చి ఆత్మహత్యల దుర్భర పరిస్థితుల నుండి వారిని కాపాడుకోవలసి ఉంది. విశాల ఐక్యసంఘటనా నిర్మాణాలు, పోరాటాల ద్వారా అన్ని సెక్షన్ల ప్రజల పోరాటాలతో ఈ పోరాటాలను ముందుకు తీసుకువెడదాం. చేనేత కార్మికుల జీవనానికి, భద్రతకు హామీ పడదాం. ❍

**నూలు పోగులన్నీ ఏకమై దోపిడీ పాలకుల మెడకు ఉరితాళ్ళు కావాలి!**

# జనసామాన్యపు సంక్షేమాన్ని పట్టించుకోండి,

**జనవరి 27, 1934**

(1934 జనవరిలో కియాంగ్సీ రాష్ట్రంలోని జయ్‌చిన్‌లో జరిగిన కార్మిక కర్షక ప్రతినిధుల రెండవ జాతీయ కాంగ్రెస్‌లో కామ్రేడ్ మావో – సే – టుంగ్ చేసిన ముగింపు ఉపన్యాసంలో ఇది ఒక భాగం.)

చర్చలలో రెండు ప్రశ్నలను నొక్కి వక్కాణించడంలో కామ్రేడ్స్ విఫలమయారు. వాటిని తడమాలని నేననుకుంటున్నాను.

మొదటిది ప్రజానీకపు సంక్షేమానికి సంబంధించినది.

ప్రస్తుతం మన ప్రధాన కర్తవ్యం యుద్ధంలో పాల్గొనడానికి విశాల జన సామాన్యాన్ని సమీకరించడమూ, అటువంటి యుద్ధం ద్వారా సామ్రాజ్యవాదాన్నీ కొమింగ్‌టాంగ్‌నూ కూలదోయడమూ, దేశమంతటా విప్లవాన్ని వ్యాపింపజేయడమూ, చైనానుండి సామ్రాజ్యవాదాన్ని తరిమివేయడమూను. ఈ కేంద్ర కర్తవ్యానికి తగినంత ప్రాధాన్యతను ఇవ్వని ఎవరైనా మంచి విప్లవకర కేడరుకారు. మన కామ్రేడ్స్ ఈ కేంద్ర కర్తవ్యాన్ని నిజంగానే అవగాహన చేసుకున్నట్టయితే, ఎంత వ్యయ ప్రయాసలకోర్చి అయినా విప్లవాన్ని దేశమంతటా వ్యాపింపజేయాలని అర్థం చేసుకున్నట్టయితే, అప్పుడిక విశాల ప్రజానీకం యొక్క తక్షణ ప్రయోజనాలను అంటే, వారి సంక్షేమాన్ని ఏ విధంగానూ తక్కువ అంచనావేయరాదు. నిర్లక్ష్యం చేయరాదు. విప్లవ యుద్ధం ప్రజాయుద్ధమే గనుక, ప్రజలను సమీకరించడమూ వారిపై ఆధారపడడం ద్వారా మాత్రమే ఆ యుద్ధం కొనసాగించగలం.



యుద్ధం చేయడానికి మనం ప్రజాసమీకరణ మాత్రమేచేసి, వేరేమి చేయనట్టయితే శతృవును ఓడించడంలో విజయం పొందగలమా? పొందలేం. మనం గెలువ దలుచుకుంటే మనం ఇంకా చాలా చేయాలి. భూమికోసం రైతుల పోరాటాన్ని నడిపి వారికి భూమి పంచియివ్వాలి, వారి శ్రామికోత్సాహాన్ని పెంపొందించి వ్యవసాయోత్పత్తులను పెంచాలి, కార్మికుల ప్రయోజనాలను కాపాడాలి, సహకారసంఘాలన నెలకొల్పాలి, బయటి ప్రాంతాలలో వర్తకాన్ని అభివృద్ధి చేయాలి. ప్రజానీకం ఎదుర్కొనే సమస్యలు – కూడు, గుడ్డ, యిల్లు, వంటచెరకు, బియ్యం, నూనె, ఉప్పు, రోగాలు, పరిశుభ్రత, పెళ్ళి – అన్నీ పరిష్కరించాలి. ఒక్క మాటలో, జనసామాన్యపు రోజువారీ సమస్యలన్నిటిపట్లా మనం శ్రద్ధచూపాలి. మనం ఈ సమస్యలను పట్టించుకొని, పరిష్కరించి జనసామాన్యపు అవసరాలు తీర్చితే మనం నిజంగా ప్రజాసంక్షేమ నిర్మాతలం కాగలుగుతాం. వారు నిజంగా మన చుట్టూ సమీకృతులై మనకు ఆత్మీయంగా మద్దతుయిస్తారు. కామ్రేడ్స్, అప్పుడు మనం వారిని విప్లవయుద్ధంలో పాల్గొనేలాగున ఉత్తేజపరచగలమా ? అవును, తప్పక అలా చేయగలం.

మన కామ్రేడ్స్ కొందరిలో కనిపించిన ధోరణులు ఇదిగో ఇలా వుంటాయి. వారు ఎంతసేపూ ఎర్రసైన్యాన్ని విస్తృత పరచడం గురించీ, రవాణా దళాలను పెంచడం గురించీ, భూమిపన్ను వసూలు, బాండ్ల అమ్మకం గురించీ మాత్రమే మాట్లాడుతారు. మిగతా విషయాలను చర్చించరు. వాటి గురించి పని చేయరు, అసలు వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. ఉదాహరణకు, ఒకప్పుడు టింగ్‌చౌ మున్సిపల్ ప్రభుత్వం కేవలం ఎర్రసైన్య విస్తరణ, రవాణాదళాల విస్తరణ గురించి మాత్రమే పట్టించుకుని ప్రజల క్షేమం గురించి కనీసమైన శ్రద్ధకూడ చూపలేదు. అచ్చటి ప్రజలకు వంటచెరకులేదు, పెట్టుబడిదారులు దొంగతనంగా నిల్వచేస్తున్నందువల్ల ఉప్పు అమ్మడంలేదు. కొందరికి వుండడానికి ఇళ్ళులేవు. బియ్యం కొరత, దొరికినా చాలా ప్రియం. టింగ్‌చౌ

# పని పద్ధతులపట్ల శ్రద్ధ చూపండి

**- కామ్రేడ్ మావో**

నగరంలో జనసామాన్యం రోజూ ఎదుర్కొనే సమస్యలు ఇవి. వీటిని పరిష్కరించుకోవడంలో సాయపడతామని ఆతృతంగా మనవైపు చూసారు. కాని టింగ్‌చౌ మునిసిపల్ ప్రభుత్వం ఈ సమస్యలు వేటినీ చర్చించనైనాలేదు. నగరంలో నూతన కార్మిక కర్షక ప్రతినిధుల సమితి ఎన్నుకోబడిన తర్వాత, మొదటి కొద్ది సమావేశాలూ ఆ విధంగా కేవలం ఎర్రసైన్యం విస్తరణనూ, రవాణా దళాలను పెంచడం గురించీ మాత్రమే చర్చించి, ప్రజాసామాన్యపు క్షేమం గురించి పట్టించుకొనకపోవడంవల్ల వందమందికి పైగా ప్రతినిధులు సమావేశాలకు హాజరవడానికే ఇష్టపడలేదు. దాంతో సమితి సమావేశాలు జరపడమే అసాధ్యమైపోయింది. తత్ఫలితంగా ఎర్రసైన్య విస్తరణ, రవాణాదళాల సమీకరణలోకూడా సాధించిందేమిలేదు. ఇది ఒకరకం పరిస్థితి.

కామ్రేడ్స్ ! రెండు నమూనా పట్టణాలను గురించి మీకు యిచ్చిన కరపత్రాలు చదివేవుంటారు. అక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నమైంది. కియాంగ్సీలోని చాంగ్ కాంగ్[1] పట్నంనుండి, ఫ్యూకెయిన్‌లోని షాయ్‌సి[2] పట్నంనుండీ ఎంత ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఎర్రసైన్యంలో చేరారో తెలుసా ! చాంగ్‌కాంగ్‌లో యువతీ యువకులలో 80 శాతమూ, షాయ్‌సి పట్నంలో 88 శాతం ఎర్రసైన్యంలో చేరారు. బాండ్ల అమ్మకం కూడా పెద్దఎత్తునే జరిగింది. 1,500 మంది ప్రజలున్న చాంగ్‌కాంగ్‌లో 4,5 వేల యువాన్ల బాండ్లు అమ్ముడయాయి. ఇతర రంగాలలోకూడా చాలా పని జరిగింది. దీనికి కారణం ఏమిటి ? కొద్ది ఉదాహరణాలు చూస్తే విషయం స్పష్టమవుతుంది. చాంగ్‌కాంగ్‌లో ఒక బీదరైతు ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించి ఒకటిన్నర గదులు నాశనమైనప్పుడు, అతని సహాయార్థం చందాలు ఇవ్వమని పట్టణ ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇంకొకసారి, ముగ్గురు వ్యక్తులు పస్తులుండి మాడుతూవుంటే, పట్టణ ప్రభుత్వమూ, పరస్పర సహాయక సంఘమూ వారికి వెంటనే బియ్యం యిచ్చాయి. కిందటి వేసవిలో ఆహారకొరత సంభవించినప్పుడు, పట్టణ ప్రభుత్వం రెండువందల లీలకుపైగా దూరానవున్న కుంగ్‌లు[3] కౌంటీనుండి ప్రజల సహాయం కొరకు బియ్యం తెచ్చింది. ఇదే పద్ధతుల్లో షాయ్‌సీ పట్నంలోకూడా అద్భుతంగా పనిచేశారు. అటువంటి పట్టణ ప్రభుత్వాలు నిజమైన నమూనాలు. బ్యూరాక్రటిక్ పద్ధతి నాయకత్వంగల టింగ్‌చౌ మున్సిపల్ ప్రభుత్వంకంటె అవి పూర్తిగా భిన్నమైనవి. మనం చంగ్‌కాంగ్, షాయ్‌సీ పట్టణాలనుండి నేర్చుకోవాలి. టింగ్‌చౌ నగరంలో వుంటున్న వారిలాటి బ్యూరాక్రటిక్ నాయకుల్ని వ్యతిరేకించాలి.

మనం ప్రజల యోగక్షేమాలను చాలా శ్రద్ధగా పట్టించుకోవాలి. భూమి శ్రమకు సంబంధించిన సమస్యలనుండి వంటచెరకు, బియ్యం, నూనె, ఉప్పు మొదలైన సమస్యలవరకూ అన్నిటికీ మనం అత్యంత శ్రద్ధ చూపాలన్నదే నేను యీ సభకు గట్టిగా చెప్పే సలహా. స్త్రీలు దున్నడమూ, నొల్ల తోలడమూ నేర్చుకోవాలనుకుంటున్నారు. వారికవి ఎవరు నేర్పాలి ? పిల్లలు, స్కూల్‌కు వెళ్ళాలనుకుంటున్నారు. మనం ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేశామా ? అక్కడ కర్ర వంతెన చాలా ఇరుకుగావుంది. జనం దానిమీంచి పడిపోవచ్చు. అది మనం మరమ్మత్తు చేయవద్దా ? చాలామంది కురుపులు ఇతర జబ్బులతో బాధపడుతున్నారు. దాని గురించి మనం ఏం చేయ్యబోతున్నాం ? ప్రజల క్షేమానిక సంబంధించిన అటువంటి సమస్యలన్నీ మన ఎజెండాలోకి తీసుకోవాలి. వాటిని చర్చించి, నిర్ణయాలు చేసి, వాటిని అమలుచేసి, ఫలితాలు ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. మనం జన సామాన్యపు ప్రయోజనాలకే ప్రతినిధులమని, మన బతుకులు వారి బతుకులతో సన్నిహితంగా ముడిపడివున్నాయనీ మనం ప్రజలను ఒప్పించాలి. ఈ విషయాలనుంచి ప్రారంభించి, వారి ముందు మనం వుంచిన ఉన్నత కర్తవ్యాలు – విప్లవ యుద్ధ కర్తవ్యాలు – అవగాహన చేసుకొనేలాగున వారికి మనం సహాయపడాలి. తద్వారా వారు విప్లవాన్ని సమర్థించి, దానిని దేశవ్యాప్తంగా విస్తరింపజేసి, మన రాజకీయ నినాదాలనందుకొని విప్లవ విజయం కొరకు చివరంటా పోరాడగలరు. చాంగ్‌కాంగ్‌లో జనం "కమ్యూనిస్టు పార్టీ నిజంగా చాలా మంచిది ! మా తరపున అన్ని విషయాలూ అదే ముందు ఆలోచిస్తుంది" అంటారు. చాంగ్‌కాంగ్‌లోని కామ్రేడ్స్ మనందరికీ మంచి ఉదాహరణ. వారు ఎంత మెచ్చదగిన వాళ్ళు. విశాల జనసామాన్యం యొక్క నిజమైన అభిమానం చూరగొన్నారు. యుద్ధ సమీకరణకు వారిచ్చిన పిలుపును జనం బలపరిచారు. మనం జనం మద్దత్తును సంపాదించాలనుకుంటే, నిజాయితీతో శ్రద్ధగా వారి ప్రయోజనాల కొరకు, పనిచేసి, వారి దైనందిన సమస్యలనూ ఉత్పత్తి సమస్యలనూ పరిష్కరించుకోవాలి. ఉప్పు, బియ్యం, కొంప, గుడ్డలు, పురుళ్ళు మొదలైన అన్ని సమస్యలూ పట్టించుకోవాలి. అలాగైతే ప్రజలు తప్పకుండా మనకు మద్దతు ఇస్తారు. విప్లవాన్ని వారు తమ మహత్తర నినాదంగాను, తమ జీవితంగానూ భావిస్తారు. ఎర్ర ప్రాంతాలపై కొమింగ్‌టాంగ్ దాడి సంభవిస్తే

చచ్చేవరకూ వారు కొమింగ్‌టాంగ్‌తో పోరాడుతారు. ఇందులో సందేహంలేదు. ఎందుకుంటే శత్రువు యొక్క మొదటి, రెండు, మూడు, నాలుగు "చుట్టుముట్టి మట్టుపెట్టే" దాడులను మనం ధ్వంసం చేయలేదా ?

కొమింగ్‌టాంగ్ ఇప్పుడు బ్లాక్‌హౌస్ యుద్ధతంత్రాన్ని[4] అనుసరిస్తూంది. అవే ఏవో ఉక్కుకోటలు అయినట్టుగా ఆ "తాబేటి – డొప్ప"ల్ని పిచ్చెత్తినట్లు నిర్మిస్తూంది. కామ్రేడ్స్ ! అది నిజంగా ఉక్కుకోటలేనా ? ఎంతమాత్రంకావు. వేలాది యేళ్ళుగావున్న భూస్వామ్య చక్రవర్తుల భవనాలు గుర్తుకుతెచ్చుకోండి, ఆ గోడలూ కందకాలతో అవి బలమైన కట్టడాలుకావా ? కాని ప్రజలు విజృంభించేసరికి అవి ఒక్కొక్కటే కూలిపోయాయి. రష్యా జారు ప్రపంచంలో అత్యంత క్రూరులైన పాలకులలో ఒకడు, అయినా అక్కడా కార్మికవర్గమూ, రైతాంగమూ విప్లవం లేవదీసేటప్పటికీ అతడి గతి ఏమయింది ? నాశనం కాలేదా ? అతడి ఉక్కుకోటలో ? అవన్నీ కూలిపోలేదా ? కామ్రేడ్స్ ! నిజమైన ఉక్కుకోట ఏది ? అది ప్రజలే. విప్లవాన్ని నిజంగా నిజాయితీగా బలపరిచే లక్షలు, కోట్లాది ప్రజలే నిజమైన ఉక్కుకోట. ఆ ఉక్కుకోటను ఏ శక్తి బద్దలుకొట్టలేదు. ఏ శక్తి, అదెంతటిదయినా సరే దాన్నేం చేయలేదు. ప్రతీఘాత విప్లవం మనల్ని నాశనం చేయలేదు. తద్వ్యతిరేకంగా, మనమే దాన్ని నాశనంచేస్తాం. విప్లవ ప్రభుత్వం చుట్టూ లక్షలాది ప్రజల్ని సమీకరిస్తూ విప్లవ యుద్ధాన్ని విస్తృతపరచి మనమే ప్రతీఘాత విప్లవాన్నతంటినీ తప్పనిసరిగా తుడిచిపెట్టి యావత్తు చైనాను వశం చేసుకుంటాం.

రెండో ప్రశ్న మన పని పద్ధతులకు సంబంధించినది.

మనం విప్లవయుద్ధానికి నాయకులం, నిర్మాతలం కావడంతోపాటు, ప్రజా జీవితానికి సయితం నాయకులం, నిర్మాతలంకూడా. విప్లవయుద్ధాన్ని సంఘటితం జేయడమూ, ప్రజల జీవితాలను మెరుగుపరచడమూ, మన ముందున్న రెండు బృహత్తర కర్తవ్యాలు, ఈ విషయంలో మనం ఎదుర్కొనే తీవ్ర సమస్య మన పని పద్ధతులగురించి. మనం కర్తవ్యాలను ఏర్పరచుకోగానే సరికాదు. వాటిని నిర్వహించే పద్ధతుల సమస్యకూడా మనం పరిష్కరించుకోవాలి. ఒక నదిని దాటడం మన కర్తవ్యం అయితే, ఒక నావగాని, వంతెనగాని లేకుండా నది దాటలేం. మరి నావ, లేక వంతెన సమస్యను పరిష్కరించకుండా నదిని దాటడం గురించి మాట్లాడడం దండగ. పద్ధతి సమస్య పరిష్కరించకుండా కర్తవ్యం గురించి మాట్లాడడం నిష్ప్రయోజనం. ఎర్రసైన్యాన్ని విస్తృతపరచే కృషికి నాయకత్వం సమకూర్చడానికి శ్రద్ధ వహించకుండా, మన పద్ధతులపట్ల అప్రమత్తమైన జాగ్రత్త చూపకుండా, "ఎర్రసైన్యాన్ని విస్తరించండి" అనేమాట వెయ్యిసార్లు వల్లించినా మనం విజయం సాధించలేం. అలాగే, బ్యూరాక్రటిక్ (పెత్తందారీ) పద్ధతులపై పోరాడకుండా, ఆచరణాత్మకమైన ఖచ్చితమైన పద్ధతులను అనుసరించకుండా, ఆజ్ఞాపించే పద్ధతిని విడనాడి ఓపిగ్గా నచ్చజెప్పే పద్ధతిని అమలుచేయకుండా, వాటిని నిర్వహించే పద్ధతులను ఏర్పరచుకోకుండా కేవలం కర్తవ్యాలను నిర్దేశించుకోవడం మాత్రమే చేస్తే, మనం ఏ ఇతర రంగాలలోకూడా ఉదాహరణకు భూమి పంపకాన్ని తనిఖీ చేయడంలోగాని, అర్థిక నిర్మాణంలోగాని, విద్యా సాంస్కృతిక రంగాల్లోగాని, కొత్తప్రాంతాలు, సరిహద్దు కావలి జిల్లాల్లో మన కృషిలోగాని – ఎందులోనూ మన కర్తవ్యాలను సాధించలేం.

షింగ్‌కువోలో కామ్రేడ్స్ ఒకటోరకంగా పనిచేశారు. వారు నమూనా కార్యకర్తలుగా అభినందనీయులు. అలాగే ఆగ్నేయ కియాంగ్సీలోని కామ్రేడ్స్ కూడా చాలాబాగా పనిచేశారు. వారుకూడా నమూనా కార్యకర్తలే. ప్రజల సంక్షేమ సమస్యను విప్లవ యుద్ధసమస్యతో ముడిపెట్టడం ద్వారా ఈ రెండుప్రాంతాల కామ్రేడ్స్ విప్లవాత్మక పనిపద్ధతుల సమస్యను, విప్లవ కర్తవ్యాల సాధన సమస్యనూ రెంటినీ ఏకకాలంలో పరిష్కరిస్తున్నారు. వారు చాలా చైతన్యవంతంగా పనిజేస్తూ, సమస్యలను అత్యంత అప్రమత్తంగా పరిష్కరిస్తూ వారి విప్లవ బాధ్యతలను నిజాయితీగా శ్రద్ధగా నిర్వహిస్తున్నారు. వారు విప్లవయుద్ధానికీ ప్రజాసంక్షేమానికీ, రెంటికికూడా మంచి నిర్మాతలూ, నాయకులూను, షాంగ్సై కౌంటీలలో కొన్ని ప్రాంతాలు, ఫ్యూకెయిన్ రాష్ట్రంలోని చాంగ్‌టింగ్, యుంగ్‌టంగ్, దక్షిణకియాంగ్సీ రాష్ట్రంలోని పికియాంగ్, ఇతర ప్రదేశాలు, డాలింగ్ కౌంటీలలోని కొన్ని భాగాలు, కియాంగ్సీలోని అనేక ఇతర కౌంటీలలోని జిల్లాలు, పట్టణాలు, కేంద్రప్రభుత్వ ప్రత్యక్షపాలన క్రింద వుంటున్న జాయ్‌చిన్ కౌంటీ – ఇలా అనేక ఇతర ప్రాంతాలలోకూడా కామ్రేడ్స్ వారి పనిలో ప్రగతి సాధించి అభినందన పాత్రులయారు.

మన నాయకత్వానవున్న ప్రాంతాలన్నిటా, ప్రజలనుండి వచ్చినవారు నిస్సందేహంగా చాలా చురుకైన కేడర్లు, గొప్ప కామ్రేడ్స్ వున్నారు. మన కృషి బలహీనంగా వున్నచోట్లా, ఇంకా బాగా పని చేయలేకపోతున్న కామ్రేడ్సుకీ సహాయపడవలసిన బాధ్యత వీరికున్నది. మనం గొప్ప విప్లవయుద్ధం మధ్యలో వున్నాం. శత్రువు ఎద్ద ఎత్తున సాగిస్తున్న "చుట్టుముట్టి మట్టుపెట్టే" దాడిని బద్దలుకొట్టి మనం బయటపడాలి. విప్లవాన్ని దేశం అన్ని ప్రాంతాలకీ వ్యాపింపజేయాలి. విప్లవకర కేడర్లందరికీ అత్యాధికమైన బాధ్యతవుంది. ఈ సభ తరువాత, మన కృషిని పెంచడానికి శక్తివంతమైన పద్ధతులు అవలంబించాలి. అభివృద్ధి చెందిన ⇨

# అమరుల జీవిత చరిత్రలు

## శత్రు దుర్మార్గపు కుట్రలో అసువులు బాసిన వీరకిశోరం కామ్రేడ్ విక్రంకు విప్లవజోహార్లు !

మావోయిస్టు ఉద్యమ నిర్మూలన లక్ష్యంగా శత్రువు అమలు చేస్తున్న ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా సంస్కరణలు, పోలీసు హోంగార్డు ఉద్యోగాల ఆశచూపి అనేక మందిని కోవర్టులు, ఇన్‌ఫార్మర్లుగా మార్చి, వారిలో నేరప్రవృత్తిని ప్రోత్సహిస్తున్నాడు. ఈ విధంగానే తయారైనవాడు చింతపల్లి యాడెం గ్రామానికి చెందిన చిన్నబ్బాయి. ఈ విషయం తెలియని మిలీషియా సభ్యులు ఆయుధాన్ని చిన్నబ్బాయి దగ్గర దాచారు. పోలీసులతో ముందే సంబంధాలున్న చిన్నబ్బాయి హోంగార్డు ఉద్యోగం సంపాదించేందుకు మరో హోంగార్డు ప్రసాద్ ద్వారా ఆయుధాన్ని పోలీసులకు అప్పగించాడు. ఈ తుపాకి దాచిన వ్యక్తిని తమకు పట్టివ్వమని లేదా చంపమని అన్నవరం ఎస్.ఐ రూపొందించిన పథకం ప్రకారం ఆయుధం కోసం వచ్చిన కామ్రేడ్ విక్రంను వేరే చోట ఉందని చెప్పి చిన్నబ్బాయి మోసం చేసి హోంగార్డు ప్రసాద్ స్వగ్రామమైన అన్నవరం సమీపంలోని కోట గున్నల గ్రామానికి తీసుకువెళ్లాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం అక్కడ హోంగార్డు ప్రసాద్, వాడి తమ్ముళ్ళు బంగార్రాజు, శ్రీకాంత్‌లు కలిసి విక్రంను వెనకనుండి తలపై కర్రతో బలంగా కొట్టి, కింద పడిన వెంటనే తాళ్ళతో బంధించారు. నిస్సహాయ స్థితిలో వున్న కామ్రేడ్ విక్రంను పట్టపగలు అందరూ చూస్తుండగానే దళం కదలికలు చెప్పమని తీవ్ర చిత్రహింసలకు గురి చేశారు. అడ్డుపడిన మహిళలను కూడ తీవ్రంగా కొట్టారు. అనంతరం పోలీసులకు అప్పగిస్తామని జనం ముందు చెప్పి, దారిలో చంపేసి, దుప్పటిలో చుట్టి రాయికట్టి, లోతుగెడ్డ నదిలో పడేసి అత్యంత దుర్మార్గంగా కామ్రేడ్ విక్రం ప్రాణాలను బలిగొన్నారు.

కామ్రేడ్ విక్రం విశాఖ జిల్లా పాడేరు మండలం దిగువ సంపాల గ్రామంలోని కువ్వి ఆదివాసి కుటుంబానికి చెందినవాడు. ఆదివాసుల మౌలిక సమస్యలపై గిరిజన హక్కుల పరిరక్షణ సంఘ నాయకత్వంలో జరిగిన పోరాటాలతో, మావోయిస్టు పార్టీ రాజకీయాలతో చిన్న తనంలోనే ప్రభావితుడయ్యాడు. పార్టీ నాయకత్వంలో చేపట్టిన గిట్టుబాటు ధరల పోరాటం, కరువు పోరాటాల్లో కామ్రేడ్ విక్రం పాల్గొన్నాడు.

చింతపల్లిలో విద్యనభ్యసిస్తూ అమరుడు కామ్రేడ్ రణదేవ్ (బిసాయ్ కామరాజు) నాయకత్వంలో జరిగిన విద్యార్థుల పోరాటాలతో ప్రభావితుడై రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి చురుకుగా పని చేశాడు. కరాటే నేర్చుకొని, విద్యార్థులకు శిక్షణ

---

⇨

ప్రాంతాలు ఇంకా అందుకోవాలి. మనం తప్పనిసరిగా చాంగ్‌కాంగ్ లాంటి పట్నాలను వేలల్లోనూ, షింగ్‌కువోలాంటి కౌంటీలను డజన్లకొద్దీనూ సృష్టించాలి. అవే మన దృఢ స్థావరాలు. ఈ స్థావరాలనుండే మనం శత్రువుయొక్క "చుట్టుముట్టి మట్టుపెట్టే" దాడులను భగ్నం చేయడానికీ, దేశవ్యాప్తంగా సామ్రాజ్యవాదమూ కొమింగ్‌టాంగ్‌ల పాలనను కూలద్రోయడానికి పురోగమిద్దాం.

వివరణలు.

1. చాంగ్‌కాంగ్ పట్నం కియాంగ్సీ రాష్ట్రంలో షింగ్‌కువో కౌంటీలో వుంది.

2. షాయ్‌సి పట్నం ఫ్యూకెయిన్ రాష్ట్రంలో షాంగ్‌కాంగ్ కౌంటీలో వుంది.

3. కుంగ్‌లు కౌంటీ అప్పుడు కియాంగ్సీ ఎర్రప్రాంతాలలో వుండేది. కియాన్‌కౌంటీకి ఈశాన్యంగావున్న టుంగ్‌కు దాని కేంద్రం. 1931 అక్టోబర్‌లో అచ్చట అసువులర్పించిన, మూడవ సైనికదళం కమాండర్ హువాంగ్‌కుంగ్‌లు పేరుదానికి పెట్టారు.

4. 1933 జూలైలో, కియాంగ్సీ రాష్ట్రంలోని లుషాన్‌వద్ద జరిగిన తన సైనిక సమావేశంలో ఎర్రప్రాంతాల చుట్టూ బ్లాక్‌హౌసెస్ నిర్మించాలని ఛాంగ్‌కైషెక్ నిశ్చయించాడు. అయిదవ "చుట్టుముట్టి మట్టుపెట్టే" దాడికి యిదొక కొత్త సైనిక ఎత్తుగడ. 1934 జనవరి చివరికల్లా కియాంగ్సీ రాష్ట్రంలో మొత్తం 2,900 బ్లాక్‌హౌసెస్ నిర్మించినట్టు అంచనా. ఆ తరువాత, ఎయిత్‌రూట్ ఆర్మీకీ, న్యూఫోర్తు ఆర్మీకీ వ్యతిరేకంగా జపాను యీ ఎత్తుగడే ఉపయోగించింది. ప్రతీఘాత విప్లవం యొక్క యీ బ్లాక్‌హౌస్ ఎత్తుగడను కామ్రేడ్ మావో - సే - టుంగ్ ప్రజాయుద్ధ వ్యూహాన్ని అనుసరించి పూర్తిగా చిత్తుచేసి ఓడించవచ్చునని అనుభవంలో రుజువయింది.

(బ్లాక్‌హౌస్ ఒక సైనిక స్థావరం - సైనికుడు దానిలోపల సురక్షితంగా వుండి కంతల ద్వారా బయటికి కాల్పులు సాగించడానికనువైన కట్టడం - అను.)

నిస్తూ అనేక పాఠశాలలు, కళాశాలల్లో పరిచయాలు పెంచుకొని, విద్యార్థులను సంఘాలలో కూడగట్టేందుకు కృషి చేశాడు. పి.ఎల్.జి.ఎ నిర్వహించిన మిలిటరీ చర్యల్లో పాల్గొన్నాడు. ఉద్యమం పట్ల, ప్రజల పట్ల అంకిత భావంతో, తన బాధ్యతల పట్ల నిబద్ధతతో పని చేశాడు.

పార్టీ సభ్యత్వం పొంది, గ్రామంలో తెగ ఆధిపత్యానికి, మునసబుదారి విధానానికి వ్యతిరేకంగా ప్రజలను నిలబెట్టాడు. పెత్తందారుల కుట్రలను సంఘం, ప్రజాబలంతో తిప్పి కొట్టాడు. వివాహమై ఇద్దరు పిల్లలున్న విక్రం తన జీవిత సహచరితో అన్యోన్యంగా వుంటూ, తన పార్టీ పనికి సహకరించే విధంగా చైతన్య పరిచాడు. చింతపల్లి మండల కేంద్రంలోని దూరదర్శన్ కేంద్రంలో ఆపరేటర్‌గా, గ్రామంలో విద్యావాలంటీరుగా అనేక పనుల్లో సంపాదించిన అనుభవంతో కామ్రేడ్ విక్రం విద్యార్థుల్లోకి చొరవగా వెళ్ళి సంఘాలలో కూడ గడుతున్న తరుణంలో శతృవు విసిరిన వలలో చిక్కి అసువులు బాశాడు. నమ్మిన ఆశయం కోసం ఆత్మీయులకు దూరమవుతున్నా ఎలాంటి శషభిషలకు గురికాకుండా ప్రజల కోసం ప్రాణాలర్పించిన కామ్రేడ్ విక్రం తెగువ, త్యాగం విప్లవకారులకు ఎల్లప్పుడు ఆదర్శం.

కామ్రేడ్ విక్రం అమర్ రహే!

కా॥విక్రం ప్రాణాలు బలిగొన్న హంతకులలో ప్రసాద్, శ్రీకాంత్‌లను 2010 సెప్టెంబర్ 24న పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది.

## ప్రజల కోసం ప్రాణాలిచ్చిన కామ్రేడ్ సాబనకు జోహార్లు!

గాలికొండ ఏరియా కమిటి పరిధిలోని గూడెం మండలం దీనారపల్లి పంచాయితీ సాగులు గ్రామంలోని కువ్వి తెగకు చెందిన నిరుపేద కుటుంబంలో పుట్టాడు. బతుకు దెరువు కోసం ఒరిస్సా రాష్ట్రం నుండి విశాఖ మన్యంకు వచ్చి స్థిరపడ్డాడు. గ్రామంలో పెత్తందార్లు సాబన కుటుంబాన్ని తీవ్ర వేధింపులకు గురి చేస్తే దళం ఆ పెత్తందార్లకు బుద్ధి చెప్పి వారి భూమిని వారికి చెందేటట్లు చేయడంతో పార్టీ పట్ల ఆకర్షితుడై మిలిషియాలో సభ్యుడిగా చేరాడు.

అడవిపై సర్వాధికారం ఆదివాసులకేననే నినాదాంతో మన్యంలో ఎ.పి.ఎఫ్.డి.సి పెత్తనానికి వ్యతిరేకంగా కాఫీ తోటల స్వాధీనం కొరకు పోరాటంలో తన వంతు పాత్రను నిర్వహించాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ పార్టీ ఇచ్చిన నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నాడు.

తాను జనమిలీషియాలో పని చేస్తున్న క్రమంలోనే కుటుంబ ఒత్తిడిని రాజకీయంగా అర్థం చేసుకోలేక ఇంటికి వెళ్ళి, గ్రామ మిలిషియాలో ఉంటూ కార్యకలాపాలు కొనసాగించాడు. స్థానిక పార్టీ అనుమతితో 2009లో మిలీషియా సభ్యురాలిని వివాహం చేసుకున్నాడు. లొంగిపోవాలని శతృవు అనేక సార్లు నోటీసులు, పేపర్ ప్రకటనలు పంపినప్పటికీ తను దృఢంగా ఉండి, గ్రామ ప్రజలను సైతం నిలబెట్టాడు. రెండు, మూడు సార్లు గ్రామంపై దాడి చేసినప్పటికీ పోలీసుల కన్నుగప్పి తప్పించుకున్నాడు.

2010 మే నెలలో భార్యతో కలిసి ఏరియా లోపలి గ్రామంలో జాతరకు (తీర్థం) వెళ్లినపుడు పోలీసులు చుట్టిముట్టి సాబనను అరెస్ట్ చేశారు. అదుపులోకి తీసుకొని అరెస్ట్‌గా ప్రకటించకుండా హోంగార్డుగా మార్చుకోవాలని ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా లొంగలేదు. తీవ్రమైన చిత్రహింసలను అనుభవించి కూడ పార్టీ రహస్యాలను కాపాడాడు. ప్రజల ఒత్తిడి మేరకు శతృవు అరెస్టుగా ప్రకటించాడు.

కా॥సాబన పై అక్రమ కేసులు నమోదు చేసి రిమాండ్ పేర పదే పదే చిత్రహింసలకు గురి చేయడం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. 4నెలలు జైలులో ఉండి బెయిల్‌పై విడుదల అయ్యే క్రమంలో సెప్టెంబర్ 7న విశాఖ జైలులోనే అమరుడయ్యాడు.

పేద ప్రజలకు పోరాటం తప్ప మరో మార్గం లేదని, జీవించినంత కాలం ప్రజల కోసం పోరాడాలని, ఎటువంటి పరిస్థితుల్లోను ఉద్యమానికి ద్రోహం చేయవద్దని తన ఆచరణ ద్వారా చెప్పిన కా॥సాబనను స్మరించుకుందాం.

కా॥సాబన అమర్ రహే !

## చెరువూరు కౌంటర్ ఆంబుష్‌లో వీరోచితంగా పోరాడి అమరులయిన సాహసయోధులకు విప్లవ జోహార్లు!

2010లో ఎస్.జెడ్.సి నిర్ణయించిన టి.సి.ఓ.సి క్యాంపెయిన్‌లో భాగంగా ఈస్ట్ డివిజన్‌లోని కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలో చింతపల్లి మండలం బలపం పంచాయితీ ప్రాంతంలో శతృవుని దెబ్బతీసేందుకు పి.ఎల్.జి.ఎ కేంద్రీకరించింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో వుండగా, మన కదలికలను గుర్తించిన శతృవు దాడి చేశాడు. దాడిని తీవ్రంగా ప్రతిఘటిస్తూ కామ్రేడ్స్ లత, జ్యోతి, సంఘ నాయకుడు లక్ష్మణరావులతో పాటు కామ్రేడ్ పాంగి బంగారి (శాంతి) వీరమరణం పొందారు.

## ఈ జనమే తన ప్రాణంగా పోరాడిన కామ్రేడ్ బంగారి (శాంతి)కి జోహార్లు!

కామ్రేడ్ శాంతి విశాఖ జిల్లాలోని పెదబయలు మండలం, లండూలు...గ్రామంలో వెనుకబడిన కువ్వి తెగ కుటుంబంలో 20 సం॥ల క్రితం జన్మించింది. పెదబయలు మండలం గిన్నెలకోట, లండూలు, గుంజివాడ ప్రాంతంలో గతంలో గిరిజన హక్కుల పరిరక్షణ సంఘం నేతృత్వంలో ఫారెస్టుశాఖ దోపిడి పీడనలకు

వ్యతిరేకంగా జరిగిన పోరాట ప్రభావం వల్ల కా॥శాంతి మావోయిస్టు పార్టీ రాజకీయాల పట్ల ఆకర్షితురాలయింది. పెత్తందార్ల భూముల పంపిణీ, ప్రజలపై గూండాగిరి చేస్తున్న సంజీవరావుకు దేహశుద్ధి వంటి సంఘటనలో శాంతి ప్రత్యక్షంగా పాల్గొంది. కుటుంబం, సంఘనాయకుడైన తన అన్న సహకారంతో సంఘ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నది. తల్లిదండ్రులు కా॥శాంతికి ఇష్టం లేని పెళ్ళి చేయడానికి సిద్ధపడగా, వారి నిర్ణయాన్ని చాలా దృఢంగా వ్యతిరేకించింది. ఆదివాసి సాంప్రదాయంలో భాగమైన బలవంతంగా ఎత్తుకెళ్ళే ప్రయత్నాలను కూడా సంఘం, అన్న సహకారంతో త్రిప్పి కొట్టింది. ఈ పరిణామాలు శాంతిలో మరింత పట్టుదల పెంచాయి. పూర్తి కాలం కార్యకర్తగా పని చేయటానికి సంసిద్ధమైంది. 2008 సెప్టెంబర్‌లో పి.ఎల్.జి.ఎలో రిక్రూట్ అయింది. 2009 మార్చి వరకు అదే ఏరియాలో ఒక ఆర్.పి.సి క్రింద నిబద్ధతతో పని చేసింది. ఈ క్రమంలో బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని దెబ్బతీయాలనే శత్రు ఎత్తుగడలో భాగంగా బూటకపు ఎన్‌కౌంటర్‌తో భయానక పరిస్థితులు సృష్టించినా ఎలాంటి గందరగోళానికి గురికాలేదు. తనతోటి వాళ్ళు ఉద్యమం నుండి ఇంటికి పోతున్నప్పటికీ, తను ధైర్యంగా నిలబడింది. అమరుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రజల్లోకి వెళ్ళి విరాళాలు సేకరించింది. వారికి ధైర్యాన్ని నూరిపోసింది.

గెరిల్లా జీవితంలోని కష్టాలను అధిగమించి, శ్రమకోర్చి చేసే పనుల్లో చొరవతో పాల్గొని తోటి కామ్రేడ్స్ అభిమానాన్ని చూరగొన్నది. కామ్రేడ్ శాంతి అందరితో స్నేహ పూర్వకంగా కలిసి పోయి సమిష్టి పనులకు ప్రాధాన్యతనిస్తూ, సమిష్టి విషయాల పట్ల, ప్రజల పట్ల చాలా బాధ్యతాయుతంగా మెలిగింది. 2010 మేలో డివిజన్ నుండి సి.ఆర్.సి. 1కంపెనీకి బదిలీ అయి పార్టీ సభ్యురాలిగా కొనసాగింది. చెరువూరు కౌంటర్ ఆంబుష్‌లో సెంట్రీ డ్యూటీ నిర్వహిస్తున్న కామ్రేడ్ శాంతి గొప్ప సాహసంతో శత్రువును నిలువరించే ప్రయత్నంలో నేలకొరిగింది. అనేక రకాలుగా ఆధారపడదగ్గ కామ్రేడ్‌గా ఎదుగుతున్న శాంతిని కోల్పోవడం పి.ఎల్.జి.ఎకు ఎంతో నష్టం.

నా ఆకాశం ఈ నేల మీదనే
ఈ జనమే నా ప్రాణ పంచకం
వీరి ఉన్నతి ఒక్కటే నా ధ్యేయం
అందుకోసమే నా శక్తి నా తీరిక
నా కాలం, నా సమస్తం.

అంటూ ప్రజలకోసం ప్రాణాలర్పించిన కామ్రేడ్ శాంతి ఆశయాలను తుది వరకు కొనసాగిస్తామని ప్రతిన బూనుదాం.

## పార్టీని కంటికి రెప్పలా కాపాడిన కామ్రేడ్ లక్ష్మణరావు (70సం॥)కు జోహార్లు!

కా॥లక్ష్మణరావు స్వగ్రామం విశాఖ జిల్లా కొయ్యూరు మండలం మర్రివాడ పంచాయితీ గొల్లవలస. బ్రతుకు దెరువు కోసం ఒడిస్సా నుండి 30 సం॥ల క్రితం వలస వచ్చి స్థిరపడ్డాడు. 1985లో ఎన్.టి.ఆర్ ప్రభుత్వ క్రూర నిర్బంధంలో గ్రామాన్ని తగలబెట్టగా, అందరూ ఊరు విడిచి వెళ్ళినా తాను మాత్రం అదే గ్రామంలో స్థిరపడ్డాడు. పార్టీని కంటికి రెప్పలా కాపాడుకునే లక్ష్మణ్‌రావు దళం వెంట వుండగా ద్రోహి ఇచ్చిన సమాచారంతో శత్రువు జరిపిన కౌంటర్ ఆంబుష్‌లో పట్టుకొని 19.11.2010న హత్య చేశాడు. 70 సం॥ల పెద్ద వయసులో కూడ పార్టీ పట్ల అచంచల విశ్వాసంతో సంఘంలో పని చేస్తూ సహయ సహకారాలందించిన కా॥లక్ష్మణ్‌రావుకు వినమ్రంగా విప్లవ జోహార్లర్పిద్దాం!

## చురుకైన విప్లవ కార్యకర్త కామ్రేడ్ బంగార్రాజుకు జోహార్లు!

కా॥బంగార్రాజు స్వగ్రామం చింతపల్లి మండలం బొర్రమామిడి. బతుకు దెరువుకు ఒరిస్సా రాష్ట్రం నుండి వచ్చి బొర్రమామిడిలో స్థిరపడ్డారు. గతంలో గ్రామంలో కొనసాగిన భూపోరాటాలు, సంఘ రాజకీయాలతో కా॥బంగార్రాజు ప్రభావితుడయ్యాడు. పార్టీ ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసిన తర్వాత వివాహం చేసుకొని గ్రామంలో వున్నాడు. ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత కుటుంబ కలహాల వల్ల భార్యభర్తలు విడిపోయారు. ఆ తర్వాత గ్రామ పెత్తందారుల దౌర్జన్యాలను భరించలేక గాలికొండ ఏరియాలోని మండపల్లికి వచ్చి స్థిరపడ్డాడు.

సంఘంలో చేరి చురుకైన కార్యకర్తగా పని చేస్తూ జన మిలీషియాలో చేరాడు. తీవ్రనిర్బంధంలో కూడ మిలీషియాకు, ప్రజలకు ధైర్యం చెబుతూ శత్రువును ఎదుర్కొవడానికి పార్టీ ఎప్పుడు పిలుపు నిచ్చినా సిద్ధంగా వుండేవాడు. గాలికొండ ఏరియాలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వంతల మాలతీ అనే హోంగార్డును గూడెం పోలీసుస్టేషన్ సమీపంలోనే మట్టి కరిపించటంలో ముఖ్యపాత్ర వహించాడు. తర్వాత ప్లాటూన్‌లోకి రిక్రూట్ అయి ఎంతో నిజాయితీగా, కష్టపడి పనిచేశాడు. ప్రజల పట్ల ఎంతో ప్రేమాభిమానాలు కలిగి, వర్గ శత్రువులపట్ల కసిని ప్రదర్శించేవాడు. శత్రు సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు పార్టీకి అందించేవాడు. పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సావాల నిర్వహణకు దళంతో కలిసి ఏరియాలో వున్న క్రమంలో ద్రోహి సమాచారంతో

**ప్రజల కోసం ప్రాణమివ్వడం హిమాలయాలకంటే ఉన్నతమైనది, దోపిడి వర్గాల సేవ చేయడం కోడి ఈకకంటే హీనమైనది.**

గొల్లవలస దగ్గర శత్రువు చేసిన మాటు దాడిలో కా॥బంగారాజు అమరుడయ్యాడు.

రక్త సంబంధం కన్న వర్గ సంబంధం మిన్న అని ప్రజల కోసం ప్రాణాలర్పించిన కా॥బంగార్రాజుకు జోహార్లర్పిస్తూ, ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతిన బూనుదాం !

## నారాయణపట్నం భూముల్లో నెత్తురు ధారబోసిన యువ కిషోరం కా॥ సందీప్‌కు అరుణారుణ జోహార్లు!

ఒడిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా, కలిమెల ఏరియా మరిగట్ట గ్రామంలో 19 సంవత్సరాల క్రితం పేద కోయ ఆదివాసీ కుటుంబంలో కా॥ సందీప్ జన్మించాడు. సందీప్‌కు తల్లిదండ్రులు పెట్టిన పేరు పోడియం సుక్డా. చిన్న తనంలోనే తమ గ్రామంలో కొనసాగుతున్న విప్లవ రాజకీయాలు అదే గ్రామానికి చెందిన కా॥రజిత అమరత్వం సందీప్‌పై ఎంతో ప్రభావాన్ని వేశాయి. చురుకైన సందీప్ సహజంగానే గ్రామంలో జరిగే ప్రతి కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొంటూ బాలల సంఘం నాయకుడయ్యాడు. గ్రామంలో బాలలను వెంటేసుకుని తమ ఏరియాలో చుట్టుపక్కల గ్రామాలకు కూడా వెళ్ళి బాలలను కూడగట్టాడు. పార్టీ చెప్పిన పనులన్నీ చేస్తూ క్రమంగా రాజకీయ చైతన్యాన్ని పెంచుకుంటు 2008లో పూర్తికాలం కార్యకర్తగా దళంలోకి వచ్చాడు.

మల్కన్‌గిరి డివిజన్ కలిమెల ఏరియాలో కొంతకాలం పి.ఎ.డిలో పని చేశాడు. 2008లో ఏర్పడిన కంపెనీలో ప్లాటూన్‌కు బదిలీ అయి కమాండర్‌కు గార్డుగా ఎంతో క్రమశిక్షణతో బాధ్యతలను నిర్వర్తించాడు. కంపెనీ నిర్వహించిన అన్ని మిలిటరీ చర్యల్లోనూ ఎంతో చురుగ్గా పాల్గొన్నాడు. 2010 జూలైలో సి.ఆర్.బి 3వ కంపెనీలోకి పార్టీ సభ్యుడిగా బదిలీ అయ్యి, ఎంతో ఉత్సాహంగా కోరాపుట్ ప్రాంతానికి వచ్చాడు. ఆ నాటి నుండి నారాయణపట్నంలో జరిగిన అన్ని పోరాటాల్లోనూ, కార్యక్రమాల్లోనూ కంపెనీ బలగాలతో కలసి చురుగ్గా తన బాధ్యతలను నెరవేర్చాడు. ఆ క్రమంలోనే 2010 డిసెంబర్ 24వ తేదీ ఉదయం ప్లాటూన్‌తో కలిసి కాంటాక్టుకు వస్తున్న క్రమంలో అమిలియాంబ అనే గ్రామం వద్ద శత్రువు మాటుగాసి జరిపిన ఆంబుష్‌లో వీరోచితంగా శత్రువును ప్రతిఘటిస్తూ నేల కొరిగాడు.

నారాయణపట్నం ప్రాంతంలో ప్రతి గ్రామంలోనూ ప్రజలకు సందీప్ చిర పరిచితుడు. పార్టీలోకి వచ్చిన అనతి కాలంలోనే ఎంతో పట్టుదలతో శ్రద్ధతో చదువు నేర్చుకున్నాడు. ఏ డివిజన్‌కు వెళ్లినా అక్కడి భాష నేర్చుకుంటూ కొత్త పాత అనే తేడా లేకుండా అక్కడి ప్రజలతో, తోటి కామ్రేడ్స్‌తో ప్రేమగా కలసి మెలసి వుంటూ అందరి అభిమానాన్ని చూరగొన్నాడు. సమిష్టి పనులలో తనెప్పుడు ముందుండేవాడు. ఎంతటి కష్టాల్లోనైనా, ఎంతటి అలసటలోనైనా చెదరని చిరునవ్వుతో నిబ్బరంగా తన బాధ్యతలు నిర్వర్తించేవాడు. సి.ఆర్.బి 3వ కంపెనీలో తనో ఆధారపడదగ్గ కామ్రేడ్‌గా ఎదుగుతున్న కా॥సందీప్ అమరత్వం పి.ఎల్.జి.ఎకు ఎంతో లోటు. ఎ.ఓ.బి పీడిత ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసిన కా॥సందీప్ అమరత్వాన్ని ఎత్తిపడదాం. తన విప్లవ ఆదర్శాలను, ఆశయాన్ని తుదకంటా కొనసాగిస్తామని శపథం చేద్దాం !

## అమరుల సంస్మరణ సభలు :

అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా 2010 జూలై 28నుండి ఆగస్టు 3 వరకు కోరుకొండ ఏసి పరిధిలోని వివిధ గ్రామాల్లో సంస్మరణ సభలు ఘనంగా జరిగాయి. ప్రజలు స్వచ్ఛందంగా చందాలు వేసుకొని స్థూపాలకు రంగులు వేశారు. జూలై 28న విశాఖ జిల్లా పెదబయలు మండలం ఇంజేరి, జాంగూడ పంచాయితీ కేంద్రాల్లో ఆగస్టు 1న భూసిపుట్ పంచాయితీ చర్యపల్లి గ్రామంలో సంస్మరణ సభలు జరిగాయి. వందలాదిగా ప్రజలు హాజరై సభలను విజయవంతం చేశారు.

---

*(....10వ పేజీ తరువాయి)*

తిప్పి కొట్టారు. మొత్తం తెలంగాణలో ప్రభుత్వ రచ్చబండ ఓటమికి, ప్రజల ప్రతిఘటన విజయానికి రాయినిగూడెం అద్దం పడుతుంది. వారం రోజులు రాయినిగూడెంలో కాశ్మీర్ తరహా సైనిక (పోలీసు రాజ్యం) పాలన అమలు చేసినా ఫలితం లేకపోయింది. రాయినిగూడెం ఇప్పుడు ప్రతిఘటనా పోరాటానికి ఒక నమూనాగా మారిపోయింది.

రాళ్ళు, చెప్పులు, కుళ్ళిన గుడ్లు, టమాటాలు, చిపుర్లు ఎన్నో ప్రజల చేతుల్లో నాట్యమాడాయి. దిష్టి బొమ్మల దగ్ధాలు, బాహాబాహి కొట్లాటలు, తిట్లు శాపనార్థాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, బంద్‌లు అన్నీ ప్రజల పక్షాన విజయవంతం అయ్యాయి. పాలకుల ఆంక్షలు, నిషేదాలు, లాఠీచార్జీ, హెచ్చరికలు ఏవీ ప్రజల ప్రతిఘటనను ఆపలేదు. ప్రజలు ప్రతిఘటించి “రచ్చబండ”ను సమిష్టిగా తిప్పికొట్టారు. ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని హెచ్చరించారు. భవిష్యత్ ఉద్యమాలకు సమాయత్తమవుతున్నారు. “రచ్చబండ”ను ఓడించిన విప్లవ ప్రజలకు జేజేలు.

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## కోరాపుట్ డివిజన్

### ఛసి మూలియా సంఘం, మహిళా సంఘాల నాయకత్వంలో జరిగిన కార్యకలాపాలు

### నిర్బంధ బాధిత కుటుంబాలకు, అమరుల కుటుంబాలకు ఆర్థిక సహాయంకై విరాళాల సేకరణ

2009 నవంబర్ 20న ప్రజలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో అమరులైన కా॥సింగన్న, ఆంధ్రు, జైల్లో అమరులైన కా॥గంగులు, రత్నొ, పాలూరు గ్రామంలో పోలీసులు అత్యంత కిరాతకంగా హత్య చేసిన సంఘ నాయకుడు కా॥సాయెబు, నాల్కో మైన్స్‌పై పి.ఎల్.జి.ఎ దాడి అనంతరం మెట్టంగ గ్రామంలో పోలీసులు కాల్చి చంపిన కా॥కాత్యులతో పాటు పోలీసుల అరెస్టులతో జైల్లో మగ్గిపోతున్న 200 మంది సంఘ కార్యకర్తలు అంతా నిరుపేద కువ్వి ఆదివాసీ ప్రజలే. కుటుంబానికి ఆసరగా, పెద్ద దిక్కుగా వున్న వీరు లేని లోటుతో ఆ కుటుంబాలు అత్యంత దుర్భరమైన జీవితాలను గడుపుతున్నాయి. ప్రజల కోసం పోరాటంలో ముందు నిలిచి తమ జీవితాలను త్యాగం చేసిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని మనోస్థైర్యాన్ని అందించాలని విరాళాల సేకరణకై పార్టీ ప్రజలకు పిలుపునిచ్చింది. ఇందుకోసం సి.ఎమ్.ఎ.ఎస్, బి.ఎ.ఎమ్.ఎస్‌లు కార్యక్రమాన్ని రూపొందించుకొని, సంఘ కార్యకర్తలు గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేశారు. 2010 జూలైలో నారాయణపట్నం బ్లాక్‌లో సంఘం ప్రజల నుండి 52,170 రూ॥ విరాళాన్ని సేకరించింది. అలాగే బందుగాం బ్లాక్‌లో కేశు బద్ర గ్రామంపై భూస్వాములు దాడి చేసి, ఇళ్ళకు నిప్పంటించి 50కు పైగా కుటుంబాలను నిరాశ్రయులను చేసినందుకు అక్కడి భూస్వాముల నుండి 2లక్షల రూపాయల నష్టపరిహారాన్ని వసూలు చేసింది.

ఈ విరాళాన్ని, నష్టపరిహారాన్ని జూలై 28 అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా అమరులైన కుటుంబాలకు, జైల్లో వున్న వారి అవసరాలకు, కేశబద్ర బాధిత కుటుంబాలకు సంఘం పంపిణీ చేసింది.

### ఛసి మూలియా సంఘంపై నిర్బంధానికి వ్యతిరేకంగా మంకిడి గ్రామంలో సభ :

నారాయణపట్నాం భూపోరాటానికి నాయకత్వం వహిస్తూన్న ఛసి మూలియా సంఘానికి మావోయిస్టు పార్టీతో సంబంధాలున్నాయనే నెపంతో ఈ సంఘంపై దాడులు చేయటానికి, సంఘాన్ని నిషేధించటానికి ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. దీన్ని వ్యతిరేకిస్తూ ఛసి మూలియా సంఘం సెప్టెంబర్ 9వ తేదీన మంకిడి గ్రామంలో పత్రికా విలేఖర్లను పిలిచి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ మీటింగ్‌కు నారాయణపట్నం బ్లాక్ వ్యాప్తంగా వివిద పంచాయితీల నుండి 5వేల మంది ప్రజలు హాజరయ్యారు.

సభకు ముందు ప్రజలంతా ఎర్రజెండాలు, బ్యానర్లు చేత పట్టి ఊరేగింపు తీశారు. అనంతరం సంఘం 'సభాపతి' (అధ్యక్షుడు) ఉపన్యాసించారు. ప్రధానంగా సంఘానికి వ్యతిరేకంగా పోలీస్ ఉద్యోగాల్లో, శాంతి కమిటీల్లో వున్న వాళ్ళంతా వాటిని విడిచిపెట్టి సంఘంతో ఐక్యం కావాలని కోరారు. నారాయణపట్నం ప్రాంతం నుండి గత సంవత్సరం ఇళ్ళను విడిచి వెళ్ళిన వారంతా శాంతి కమిటీని విడిచి పెట్టి తిరిగి తమ గ్రామాలకు రావల్సిందిగా ఆహ్వానించారు. బందుగాం ఛసి మూలియా సంఘంతో ఎటువంటి ఘర్షణలు లేవని, పీడిత ప్రజల సంఘటితశక్తి ద్వారానే భూపోరాటాన్ని విజయవంతం చేయగలమని, ప్రభుత్వదాడి, నిర్బంధాన్ని తిప్పికొట్టగలమనీ, అందుకోసం ప్రజలంతా ప్రభుత్వ కుట్రను, విభజించి పాలించే విధానాన్ని తిప్పికొట్టి ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

సంఘంపై ప్రభుత్వ, పోలీసు, శాంతి కమిటీల దాడులను వెంటనే ఆపి వేయాలని, అందుకు ప్రజాస్వామికవాదులు, మేధావులు అందరూ సంఘం చేస్తున్న పోరాటానికి మద్దతు నివ్వాలని, నిర్బంధాన్ని వ్యతిరేకించాలనీ, బుద్ధి జీవులు నారాయణపట్నం వచ్చి పరిస్థితులను పరిశీలించి నిజనిర్ధారణ చేయాలని కోరారు. జోరున కురిసే వర్షంలో సైతం ప్రజలు శ్రద్ధగా పాల్గొని సభను విజయవంతం చేశారు.

### జితిన్‌దాస్ వర్ధంతి సందర్భంగా ఖైదీల విడుదల కోసం ధర్నా - అడ్డుకున్న పోలీసులు :

జైల్లో ఖైదీల హక్కుల కోసం 55 రోజుల పాటు అమరణ నిరాహారదీక్ష చేసి అమరుడైన జితిన్‌దాస్ వర్ధంతి దినమైన సెప్టెంబర్ 13న కోరాపుట్ జైల్లో అక్రమంగా నిర్బంధించబడి వున్న ఖైదీల విడుదల కోసం నారాయణపట్నం, బందుగాం బ్లాక్‌ల నుండి విప్లవ ఆదివాసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో 200మంది మహిళలు (జైల్లో వున్న వాళ్ళ కుటుంబీకులు) కోరాపుట్ కలెక్టర్ వద్దకు వెళ్ళి మెమోరాండం ఇవ్వాలనే కార్యక్రమం తీసుకున్నారు. ప్రధానంగా జైల్లో వున్న వాళ్ళపై కేసులను వెంటనే విచారణ జరిపి వాళ్ళను బేషరతుగా విడుదల చేయాలని, చనిపోయిన వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రభుత్వ, పోలీసుల అక్రమ అరెస్టులను, దాడులను నిలిపివేయాలనే డిమాండ్లతో ప్రజాస్వామికంగా ర్యాలీ

నిర్వహించ తలపెట్టారు. దీనికి కలెక్టర్ వద్దనుండి పర్మిషన్ కూడా పొందారు.

మహిళలు చంటి బిడ్డలను ఎత్తుకొని సుదూర ప్రాంతాల నుండి ఎన్నో ఇబ్బందులకు ఓర్చుకొని జైల్లో వున్న తమ వాళ్ళను చూడాలనీ, విడిపించుకోవాలనీ ఆశతో ప్రయాణమయ్యారు. వీరిని సాగనంపటానికి కంఠి గ్రామం వరకు వందలమంది ప్రజలు తరలివచ్చారు. కంఠి గ్రామం నుండి 16 వాహనాలతో బయలు దేరిన వీరిని సిమిలిగూడ వద్ద పోలీసులు, శాంతి కమిటీ గూండాలు నిలిపివేసి మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తూ వాహనాలను, డ్రైవర్లను స్టేషన్‌కు తీసుకపోయారు. నడిరోడ్డుపై మహిళలను చంటిపిల్లలను ఆకలితో నిస్సహాయంగా నిలబెట్టారు. ఈ మహిళలకు సహాయంగా వెళుతున్న అయిదుగురు యువకులను బలవంతంగా తీసుకపోయి స్టేషన్లో పెట్టి మహిళలందర్నీ తిరిగి వెనక్కి వెళ్ళిపోవాలని బెదిరించారు. కలెక్టర్ పర్మిషన్ వుందని చెప్పినా వినకుండా పోలీసులు, శాంతి కమిటీ గూండాలు దౌర్జన్యంగా నిర్బంధించారు. అయినప్పటికీ మహిళలు ఏ మాత్రం భయపడకుండా, వెనుతిరగకుండా స్టేషన్ ముందే బైఠాయించి, చివరికు తమ యువకులను, వాహనాలను విడిపించుకున్నారు.

## సెప్టెంబర్ 16న నారాయణపట్నం బ్రహ్మాండమైన ర్యాలీ :

సెప్టెంబర్ 13న 'కోరాపుట్ 'ధర్నా' ను సిమిలిగూడ పోలీసులు ఆటంకపర్చటాన్ని నిరసిస్తూ, సెప్టెంబర్ 16వ తేదీన సి.ఎమ్.ఎ.ఎస్, బి.ఎ.ఎమ్.ఎస్‌లు కలసి నారాయణపట్నంలో భారీ ర్యాలీ చేయాలని నిర్ణయించాయి. 13వ తేదీ సంఘటనపై కోపోద్రిక్తులయి వున్న ప్రజలు సంఘం పిలుపును అందుకున్న వెంటనే వేలాదిగా కదిలారు. అతి తక్కువ సమయంలో ప్రజల సహకారంతో ర్యాలీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎర్రజెండాలు, బ్యానర్లు, ప్లకార్డులతో 16వ తేదీ ఉదయానికి నారాయణపట్నం, బందుగాం, లకింపూర్, కోరాపుట్, సిమిలిగూడ, పొట్టంగి, నందపూర్ బ్లాక్‌ల నుండి వేలాది మంది స్త్రీ పురుషులు ర్యాలీలో భాగమయ్యారు.

ఏ మాత్రం ఊహించని విధంగా 16వ తేదీ తెల్లారే సరికి వేలాది జన ప్రవాహం నారాయణపట్నంలో ప్రత్యక్షమయి పోలీసులకు, ప్రభుత్వ అధికారులకు, భూస్వాములకు, షావుకార్లకు కలవరం పుట్టించింది. ఏం జరుగుతుందో అర్థం కాక నారాయణపట్నం దుకాణాలన్నీ మూతపడ్డాయి. భూస్వాములు, షావుకార్లు ఇళ్ళల్లో నుండి బయటకు అడుగు పెట్టలేదు. ర్యాలీని ఆటంక పర్చటానికి పోలీసులు ప్రయత్నించి వేలాది మంది ప్రజలను చూసి మిన్నకుండిపోయారు. 15వేల మంది ప్రజలు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్ళి నారాయణపట్నం బి.డి.ఒకు, తహసీల్‌దార్‌కు, స్టేషన్ అధికారికి, పత్రికా విలేఖర్లకు డిమాండ్ల పత్రాన్ని సమర్పించారు. ప్రధానంగా నారాయణపట్నంలో ప్రజలపై జరుగుతున్న హింసా కాండపై న్యాయ విచారణ జరిపించాలని, జైల్లో అక్రమంగా నిర్బంధించిన ఆదివాసులను బేషరతుగా విడుదల చేయాలనీ, చనిపోయిన వారి కుటుంబానికి 5లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, పోలీసుల దాడులను, నిర్బంధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులు, దాడులు, నిర్బంధం మధ్యనే వేలాది మంది ప్రజలు కదిలి ప్రజాశక్తిని ప్రదర్శించారు. పీడిత ప్రజల ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన ఈ ర్యాలీ విజయవంతం కావటంతో వారిలో పోరాటకాంక్ష మరింత ఇనుమడించింది.

## విద్యావ్యవస్థ మెరుగుదలకై విద్యార్థుల సంఘటితం :

నారాయణపట్నం బ్లాక్‌లో ఒక్కో పంచాయితీలో 15నుండి 20వరకు గ్రామాలున్నాయి. ఒక్కో పంచాయితిలో 2,3 గ్రామాల్లో మాత్రమే పాఠశాలలు వున్నాయి. కొన్ని హైస్కూళ్ళలో విద్యార్థులు ఎక్కువ, ఉపాధ్యాయులు తక్కువ వున్నారు. ఉదాహరణకు బలిపట్ల (పంచాయితి) హై స్కూల్‌లో 800 మంది విద్యార్థులకు కేవలం 9మంది మాత్రమే టీచర్లున్నారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఈ టీచర్లే విద్యార్థులకు బోధనతో పాటు భోజన సదుపాయం కూడా కల్పించాల్సిన పరిస్థితివుంది. ఎన్నో సార్లు విద్యార్థులు తమ సమస్యలను పై అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు.

ఈ ప్రాంతంలో నక్సలైట్లు వున్నారనే సాకుతో టీచర్లు స్కూళ్ళకు రావటం లేదనే తప్పుడు ప్రచారాన్ని ఉపయోగించుకొని ఉపాధ్యాయులు విధులకు రాకుండా ఎగ్గొడుతున్నారు. ఆ సమస్య పరిష్కారానికి విద్యావ్యవస్థ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ విద్యార్థులను చైతన్యవంతం చేసి, విద్యావ్యవస్థ మెరుగుదలకు ఆందోళన చేపట్టాలని ఛసి మూలియా సంఘం నిర్ణయించింది. 2010 సెప్టెంబర్ 19న తెంతులిపాదర్‌లో, 26వ తేదీన బిజోగాటి లోను వందల మంది విద్యార్థులతో సమావేశాలను నిర్వహించి, విద్యార్థుల సమస్యలను చర్చించింది. భవిష్యత్ కార్యక్రమాన్ని వారి ముందు పెట్టి ఆందోళనకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. ఈ సభలతో ఉత్తేజితులైన విద్యార్థులు ఆందోళనకు సిద్ధమయ్యారు.

## 2010 అక్టోబర్ 8న సి.ఎమ్.ఎ.ఎస్ మనోబల మీటింగ్

నారాయణపట్నం ప్రాంతంలో భూపోరాటంలో కదులుతున్న ప్రజలపై, సంఘంపై ప్రభుత్వం, పోలీసులు వివిధ పద్ధతుల్లో నిర్బంధాన్ని, దాడిని కొనసాగిస్తూ ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ ప్రజలు శతృదాడిని ప్రతిఘటిస్తూ ఉద్యమాన్ని రక్షించుకుంటూ ధైర్యంగా ముందుకు సాగుతున్నారు.

సి.ఎమ్.ఎ.ఎస్ నాయకత్వంలో నిర్బంధానికి వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు కదిలి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. మనోబల మీటింగ్‌లలో హాజరయ్యి మరింత మనోధైర్యం, ఉత్సాహంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగానే దుక్కులు దున్నేందుకు సమయం ఆసన్నమవటంతో ప్రజలను అందుకు సన్నద్ధం చేయటం కోసం 2010 అక్టోబర్ 8వ తేదీన నారాయణపట్నానికి అత్యంత సమీప గ్రామమైన పొడపాదర్ గ్రామంలో సి.ఎమ్.ఎ.ఎస్ మనోబల మీటింగ్‌ను నిర్వహించింది. మీటింగ్ జరిగేంత వరకు ఎక్కడా ఎక్స్‌పోజ్ కాకుండా రహస్య పద్ధతులలో ప్రజలను సమీకరించారు.

అనుకున్న ప్రకారంగా 7వ తేదీ రాత్రినుంచే పెనువాబాహిని మిలిటెంట్లు 300 మంది అన్ని దార్లల్లో పకడ్బందీ రక్షణ ఏర్పాట్లను చేశారు. దూరపు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భోజన ఏర్పాట్లు చేశారు. 8వ తేదీ ఉదయం 10గం॥లకు నారాయణపట్నం, బందుగాం, సిమిలిగూడ బ్లాక్‌లనుండి పదివేల మందికి పైగా ప్రజలు మీటింగ్‌కు హాజరయ్యారు. 11గంటలకు సభ ప్రారంభమయ్యి సాయంత్రం 4గం॥ వరకు జరిగింది.

సి.ఎమ్.ఎ.ఎస్ అధ్యక్షుడు, మహిళా సంఘం అధ్యక్షురాలితో పాటు నారాయణపట్నం, బందుగాం ప్రాంత సంఘ నాయకులు వక్తలుగా ఉపన్యాసించారు. ప్రధానంగా సంఘాన్ని నిషేధించటానికి, అణచివేయటానికి ప్రజలను చీల్చేందుకు శతృవు చేస్తున్న కుట్రలను, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, భూమి కోసం అధికారం కోసం ఆదివాసీ, ఆదివాసేతర పీడిత ప్రజలంతా ఐక్యమై సాయుధం కావాలనీ, భూముల్లో దుక్కులు దున్నటానకి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిర్బంధం మధ్య వందలాది పోలీసు బలగాలు చూస్తుండగా వేలాదిమంది ప్రజలతో జరిగిన ఈ మీటింగ్ ప్రజల్లో గొప్ప ఉత్సాహాన్ని మరింత మనోబలాన్ని పెంచింది.

## నారాయణపట్నం భూముల్లో దుక్కులు దున్నిన ప్రజలు :

2010 అక్టోబర్ 8వ తేదీన మనోబల మీటింగ్‌తో ఉత్తేజితులైన ప్రజలు తాము పోరాడి, నెత్తురు ధారపోసి సాధించుకున్న భూముల్లో దుక్కులు దున్నాలనే పిలుపును అందుకొని ఉత్సాహంగా సన్నద్ధమయ్యారు. 15వ తేదీన తెలతెలవారుతుండగా 6గంటలకు నారాయణపట్నానికి అన్ని వైపుల నుండి వేలాదిమంది ప్రజలు నాగళ్ళు, పారలు, గొడ్డళ్ళు, ఎర్రజెండాలతో ఒక్కసారిగా భూముల్లోకి దిగారు. జోరున కురుస్తున్న వర్షాన్ని, గజగజ వణికిస్తున్న చలిని సైతం లెక్కచేయకుండా కొమ్ము ఊది (దుక్కులు ప్రారంభించాలనే సంకేతం) ఉత్సాహంగా దుక్కులు దున్నటం ప్రారంభించారు.

15వ తేదీన నారాయణపట్నం బ్లాక్‌లోని 9పంచాయితీలతో పాటు సిమిలిగూడ బ్లాక్‌లోని కంఠి పంచాయితీ, బందుగాం బ్లాక్‌లోని కౌరుబడి, వల్లాడ, అలమండ పంచాయితీల నుండి 15వేల మంది ప్రజలు 500 ఏర్లతో (అరకలతో) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి రోజు విపరీతమైన వర్షం కారణంగా మధ్యాహ్నం భూముల్లో ఎర్రజెండాలు పాతి, 16, 17 తేదీలలో నారాయణపట్నం బ్లాక్‌లోని పంచాయితీలలో గ్రామాల వారిగా కేటాయించబడిన భూముల్లో ఆయా గ్రామాల ప్రజలు వచ్చి దుక్కులు దున్నారు. వందలాది మంది అరెస్టులు, ఇళ్ళపై దాడులు, సంఘ నాయకుల హత్యలు, మహిళలపై అత్యాచారాలు, ప్రజలను భయాందోళనలకు గురి చేయడం, ఇలా క్రూరమైన నిర్బంధాన్ని అమలు జరిపి భూపోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వం, పోలీసులు, శాంతి కమిటీ గూండాలు ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ నిర్బంధం కొలిమిలో రాటు దేలుతున్న నారాయణపట్నం పీడిత ప్రజలు రెట్టింపు ఉత్సాహంతో కదిలి భూపోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నారు.

## కుంబరి భూముల్లో పంట స్వాధీనం :

నారాయణపట్నం బ్లాక్‌లోని కుంబరి పంచాయితీలో 2009లో ఛసి మూలియా సంఘం భూస్వాముల భూములను స్వాధీనం చేసుకుంది. అయితే నవంబర్ 20 కాల్పుల్లో సింగన్న అమరత్వం తరువాత 'సగం వాటా' అని అన్న షావుకార్లు అక్కడి ప్రజలను భయపెట్టి పోలీసుల అండతో మొత్తం పంటను కోసుకున్నారు. తిరిగి ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి మా కష్టార్జితంపై హక్కు మాదేనంటూ 2010 నవంబర్ 19వ తేదీన 5 ఎకరాల భూముల్లో పంటను కోసి పంచాయితీలోని అన్ని గ్రామాల ప్రజలు పంచుకున్నారు. తిరిగి వాటినే నారాయణపట్నం భూముల్లో తమకు వచ్చిన వాటాల్లో విత్తనాలుగా వేశారు.

## బందుగాం ప్రాంతంలో ఊపందుకున్న భూపోరాటం

బందుగాం బ్లాక్‌లో 2009లో నారాయణపట్నం ఛసి మూలియా సంఘం మద్ధతుతో కౌరుబడి, వల్లాడ, అలమండ పంచాయితీల ప్రజలు కత్తులపేటలోని భూస్వాముల భూముల్లో (సెంటుగడ్డి) జెండాలు పాతారు. దీని తరువాత విప్లవ ద్రోహి అర్జున్ నాయకత్వంలోని సంఘం ఘర్షణలు సృష్టించటం, సంఘ నాయకులు భాషా, పైడమ్మల బెదిరింపులు, ఆటంకాలతో భూములు పంపకాలు జరగలేదు. ఛసి మూలియా సంఘం ఏరియా కమిటీ ఏర్పడ్డాక 2010 ఏప్రిల్‌లో ఈ భూమి సమస్యను చర్చించి నిర్దిష్టంగా ఆ భూస్వాముల, భూముల వివరాలను సేకరించింది. మొత్తం 352ఎకరాల భూముల్లో ఈ భూమి పైనే ఆధారపడి జీవిస్తున్న ఆదివాసేతరలకు 65ఎకరాలను, ఆదివాసులు సాగు చేసుకుంటున్న

మరో 82 ఎకరాలను మొత్తం 147ఎకరాలను మినహాయించి మిగిలిన 205ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచాలని నిర్ణయించింది. 9-8-2010న అర్జున్‌ను పి.ఎల్.జి.ఎ హతమార్చిన తరువాత అడ్డుతొలగడంతో నవంబర్ 15వ తేదీన 5వేల మంది ప్రజలు కదిలి భూముల్లో సెంటుగడ్డిని కోయటం ప్రారంభించారు. నారాయణపట్నం బ్లాక్‌లోని వివిధ పంచాయితీల ప్రజలు మద్దతు రాగా కౌరుబడి, వల్లాడ అలమండ పంచాయితీల ప్రజలు కదిలి గ్రామాల వారిగా తమకు కేటాయించిన భూముల్లో గడ్డిని కోసుకున్నారు. విపరీతమైన వర్షాలు, మిగతా ఆహారపంట కోతలు వున్నప్పటికీ పోరాడి సాధించుకున్న భూములను విడిచిపెట్టకూడదనే పట్టుదలతో ప్రజలు పంటను కోసుకున్నారు.

## కింతలపాయి భూముల పంపకాలు :

బందుగాం బ్లాక్ పెద వల్లాడ పంచాయితీ కింతలపాయ్ గ్రామంలో చాలా ఏళ్ళుగా 5గురు సుండీలు 74 ఎకరాల భూమిలో సెంటుగడ్డిని వేసి సంపదను అనుభవిస్తున్నారు. ఈ భూముల్లో 2009 జూలైలో ఛసి మూలియా సంఘం నాయకత్వంలో జెండాలు పాతి స్వాధీనం చేసుకొని 15ఎకరాల వరకు ప్రజలు సెంటు గడ్డిని తీసివేసి ఆహారపు పంట కోసం భూమి సాగుచేశారు. ఆ తరువాత అర్జున్ నాయకత్వంలోని సంఘంతో ఘర్షణల వల్ల అక్కడ కూడా పంపకాలు జరగలేదు. తరువాత ఛసి మూలియా సంఘం నారాయణపట్నం ఏరియా కమిటీ ఏర్పడిన తరువాత తిరిగి ఈ సమస్యను చర్చించి పంపకాలు చేయాలని నిర్ణయించింది. ఆ నిర్ణయం మేరకు 3గ్రామాలకు సంబంధించిన ఈ భూమిని ఆ గ్రామాల ప్రజలతో భూపోరాట కమిటీ పెట్టి, 74ఎకరాలలో 9ఎకరాలను అక్కడే నివాసం వుంటున్న రెండు ఆదివాసేతర కుటుంబాలకు విడిచిపెట్టి, మిగతా 65ఎకరాలను ఏరియా కమిటీ 3 గ్రామాలకు పంపకాలు చేసింది.

## రాజకీయ ఖైదీల విడుదలకై నారాయణపట్నంలో విజయవంతమైన రాస్తారోకో, బంద్ :

జైళ్లలో నిర్బంధించబడి వున్న రాజకీయ ఖైదీలను విడుదల చేయాలనే ప్రధాన డిమాండ్‌తో 2010 నవంబర్ 23వ తేదీన నారాయణపట్నం బ్లాక్ సెంటర్‌లో రాస్తారోకో జరిగింది. నారాయణపట్నం, బందుగాం, సిమిలిగూడ బ్లాక్‌ల నుండి 10వేలకు పైగా ప్రజలు కదిలి బ్లాక్ సెంటర్‌ను దిగ్బంధించారు. బ్లాక్‌కు వచ్చే అన్ని రకాల రహదార్లలోనూ బైఠాయించి రోడ్లను మూసేశారు. వాహనాలన్నింటినీ ఎక్కడి కక్కడ నిలిపివేశారు. ఉదయం 9గంటల నుండి సా॥ 5గంటల వరకు రాస్తారోకో చేసి బి.డి.ఒకు డిమాండ్ల పత్రాన్ని ఇచ్చారు. ఇదే డిమాండ్స్‌తో నవంబర్ 30న తలపెట్టిన బంద్ కార్యక్రమంలో మిలీషియా బలగాలు, ప్రజలు కదిలి పోలీసు క్యాంపుల నడుమనే, లకింపూర్ నుండి నారాయణపట్నం వచ్చే రోడ్డుపైన బిజోగాతి - నారాయణపట్నం, బందుగాం - నారాయణపట్నం, బందుగాం - పార్వతిపురం రోడ్లను తవ్వి, చెట్లను నరికి అడ్డంవేసి, రవాణా వ్యవస్థను స్థంబింపచేశారు. ముందురోజు రాత్రికే ప్రధాన కేంద్రాలన్నింటా విస్తృతంగా పోస్టర్ల ద్వారా ప్రచారం జరగటంతో ఆ ప్రాంతమంతా బంద్ సంపూర్ణంగా విజయవంతమయ్యింది.

## పోలీసు ఇన్‌ఫార్మర్ ఉయిక సొంబ్రు ప్రజల చేతిలో హతం :

2009 నవంబర్ 20న జరిగిన ఎదురుకాల్పుల తరువాత నారాయణపట్నానికి ఆనుకొని వున్న ఒడియాపేట గ్రామానికి ప్రతి రోజు పోలీసులు వస్తూ ఈ గ్రామ ప్రజలను బెదిరించి, వేధించి బలవంతంగా సరెండర్లు చేయంచారు. సరెండర్స్ చేయంచటంలో ఉయిక సొంబ్రు ముఖ్య పాత్ర వహించాడు. పోలీసుల అండతో ప్రజా వ్యతిరేకిగా మారాడు. గ్రామం విడిచి పారిపోయిన చుట్టుపక్కల పెత్తందార్లు, ప్రజావ్యతిరేకులకు ఆశ్రయం కల్పించటానికి సొంబ్రు ప్రజలను బెదిరించేవాడు. నిత్యం పోలీసులతో సంబంధంలో వుంటూ సంఘ నాయకులను అరెస్టులు చేయించాడు. మన సమాచారాన్ని సేకరించి పోలీసులకు చేరవేసేవాడు. ప్రతి రోజూ రాత్రి స్టేషన్ పోలీసులు ఈ గ్రామానికి వచ్చి ఇతడిని కలసి సమాచారాన్ని తీసుకొని వెళుతుంటారు. ఆ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భూపోరాటంలో కదలటానికి, భూములు దున్నటానికి, ఆటంకంగా మారాడు. ఈ విధంగా చుట్టుపక్కల సంఘ కార్యక్రమాలు నడవకుండా అడ్డుకున్నాడు. అలాగే ఆ ప్రాంతంలో మన పార్టీ పోస్టర్లు వేస్తే తెల్లవారకముందే వాటిని చింపివేయటం, తిరిగి మన పేరుతోనే తప్పుగా పోస్టర్లు వేసి డబ్బులు వసూలు చేయటం వంటివి కూడా చేశాడు. దీనితో ఈ ప్రజావ్యతిరేకిని 2010 డిసెంబర్ 9వ తేదీ రాత్రి మన పి.ఎల్.జి.ఎ పట్టుకొని విచారించి హతమార్చింది.

## పొడపాదర్ పోలీస్ క్యాంప్‌ను ఎత్తివేయాలంటూ నిరసన ప్రదర్శనలు, కల్వర్ట్ పేల్చివేత :

నారాయణపట్నంలో తీవ్రమవుతున్న భూపోరాటాన్ని, రాజ్యవ్యతిరేక ప్రజల మిలిటెంట్ పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతుంది. వేలాది పోలీసు బలగాలను దింపి ప్రజలను భూముల్లోకి రాకుండా అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నది. దాంట్లో భాగంగానే 2009 నవంబర్ 20న కాల్పుల తరువాత నారాయణపట్నం ప్రాంతాన్ని పోలీసు బలగాలతో నింపేశారు. అనంతరం 2010 జూన్ నాటికి పాలూరు వద్ద 500 మంది పోలీసులతో రాత్రికి రాత్రే క్యాంప్ వేశారు. ఈ పోలీసు

బలగాలు, శాంతి కమిటీ గూండాలు గ్రామాలపై చేస్తున్న దాడులకు, హత్యలకు, అత్యాచారాలకు, అరాచకాలకు అంతే లేదు. అయినప్పటికీ ఇక్కడి ఆదివాసీ ప్రజలు ఈ నిర్బంధాన్ని, దమనకాండను సంఘటితంగా ఎదుర్కొంటూనే భూపోరాటాన్ని ముందుకు తీసుకపోతున్నారు. ఈ భూపోరాటాన్ని అణచివేయడానికి, భూపోరాట కేంద్రం అమరుడు సింగన్న స్వగ్రామమైన పోడపాదరలో క్యాంపు వేశారు. 2010 డిసెంబర్ 15వ తేదీన ఇంకా తెల్లవారక ముందే గ్రామంలోకి 400 మంది పోలీసులు దిగారు. విద్యార్థులను బయటకు తరిమేసి స్కూల్, హాస్టల్, పంచాయితీ ఆఫీస్‌ని, బియ్యం నిల్వచేసే గోడౌన్‌ని అన్నింటినీ ఆక్రమించుకున్నారు. గ్రామంలో వున్న ఆడ, మగ, పిల్లలు, ముసలి ముతకను సైతం విడిచిపెట్టకుండా బలవంతంగా క్యాంపుకు తీసుకవచ్చి, కొట్టి పనులను చేయించుకోవటం మొదలుపెట్టారు. ఈ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన బలియపుట్, బసనపుట్, రేంగ, జోగిపాని తదితర గ్రామాలలో ప్రజలతో పాటు దారిన పోయే వాళ్ళను కూడా అడ్డుకొని బెదిరించి క్యాంపు పనులు చేయించుకుంటున్నారు. ఈ సంవత్సరం అతివృష్టి కారణంగా ప్రజలు పంటను కోల్పోయి ఎంతో కొంత కొండపోడులో మిగిలివున్న సామలు, చోళ్ళు వంటి ఆహార దినుసులను కోసుకోనివ్వకుండా బలవంతంగా పోలీసులు క్యాంపు పనులు చేయించుకోవటం కోసం నిర్బంధిస్తున్నారు.

ఈ విషయం తెలిసిన వెంటనే ఛసి మూలియా సంఘం ఇచ్చిన పిలుపు అందుకొని సుమారు 5వేల మంది ప్రజలు కదిలి ఈ క్యాంప్‌ను ఎత్తివేయాలని, పోలీసుల నిర్బంధాన్ని, అరాచకాలను ఆపాలని డిమాండ్ చేస్తూ, నారాయణపట్నంలో డిసెంబర్ 15,16,17వ తేదీలలో 3రోజుల పాటు బ్లాక్ ఆఫీస్ ముందు బైఠాయించారు. తీవ్రమైన చలిని సైతం లెక్కచేయకుండా రోడ్డుపైనే అగ్గిమంటలు వేసుకొని, వంటలు చేసుకొని పగలంతా రోడ్లను బ్లాక్ చేసి నిరసన ప్రదర్శనలు జరిపారు. అయినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వుండటంతో 17వ తేదీ రాత్రి పి.ఎల్.జి.ఎ బలగాలు, మిలీషియా కలసి నారాయణపట్నం నుండి పోడపాదర్ క్యాంప్ పోలీసులకు సప్లయ్‌లు తీసుకవస్తున్న రోడ్డులో ఒక కల్వర్ట్‌ను పేల్చివేశారు.

## సి.పి.ఐ. (మావోయిస్టు) 6వ వార్షికోత్సవ సభ :

2010 సెప్టెంబర్ 21న సి.పి.ఐ (మావోయిస్టు) 6వ వార్షికోత్సవం సందర్భంగా కోరాపుట్ డివిజన్‌లో నారాయణపట్నం, సిమిలిగూడ, లకింపూర్, బందుగాం బ్లాక్‌లలో వారం రోజుల ముందు నుండే రైతుకూలిసంఘం, మహిళాసంఘం, మిలీషియా బృందాలుగా ఏర్పడి గ్రామీణ ప్రాంతంలో విస్తృతంగా ప్రచారం చేశారు. బ్లాక్ కేంద్రాల్లో విస్తృతంగా పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రచారం చేశారు. ఆర్గనైజర్లు గ్రామ గ్రామాన మీటింగ్‌లు పెట్టారు. పీడిత ప్రజల రాజ్యాధికార సాధన కోసం వందలు వేలుగా సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు.

అలాగే నారాయణపట్నం ఏరియా కమిటి ఒక ఆర్.పి.సి పాకెట్‌లో సెప్టెంబర్ 21వ తేదీన సభను నిర్వహించింది. ఈ సభకు పాకెట్‌లోని 12 గ్రామాల నుండి 900మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సభకు ఏరియా కమిటీ కార్యదర్శి, అధ్యక్షత వహించారు.

అనంతరం రైతుకూలీసంఘం, విప్లవ మహిళా సంఘం అధ్యక్షులు ఒడియా, కువ్వి భాషల్లో ప్రసంగించారు. అడవిపై ఆదివాసీల హక్కును సాధించాలన్నా, భూపోరాటాన్ని విజయవంతం చేయలన్నా పార్టీ నాయకత్వంలోనే సాధ్యమని అందుకోసం విస్తృతంగా పార్టీలో చేరి పార్టీని బలోపేతం చేసుకోవాలని, చివరగా కోరాపుట్ డివిజనల్ కమిటీ కార్యదర్శి మాట్లాడుతూ పార్టీ చరిత్ర గురించి సంక్షిప్తంగా చెప్పారు. సుదీర్ఘ ప్రయాణంలో పార్టీకి వచ్చిన గుణపాఠాలను, అనుభవాలను తీసుకొని అన్యవర్గ ధోరణులను వదిలించుకొని పార్టీని బోల్షివీకరించాలనీ, బలోపేతం చేయాలని సందేశాన్ని ఇచ్చారు. ప్రజలు ఎంతో ఉత్సాహంతో పాల్గొని సభను విజయవంతం చేశారు.

## ప్రజా శత్రువులకు శిక్షలు

2010 మే 8వ తేదీన కోరాపుట్ జిల్లా నారాయణపట్నం బ్లాక్ సామనవద్ద జరిగిన ఫైరింగ్ అనంతరం ఏరియాలో ప్రతికూల వాతావరణం ఏర్పడింది. పోలీసులు, శాంతి కమిటీ గూండాలు కలసి గ్రామాలపై దాడుల చేశారు. సంఘ నాయకులను అరెస్టులు చేశారు. మహిళా సంఘ కార్యకర్తలపై అత్యాచారాలు చేశారు. గ్రామాల్లో పెత్తందారులు, తెగపెద్దలు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రజల్ని మరింత భయాందోళనలకు గురి చేయటం, పుకార్లను సృష్టించటం, ప్రజలను లొంగుబాట్లకు ప్రోత్సహించటం, కొన్ని గ్రామాల్లో సరెండర్స్ చేయించటంతో పాటు పార్టీ పైన దుష్ప్రచార దాడిని తీవ్రం చేశారు. ఈ క్రమంలో జూన్ 12వ తీదీన సంఘం తీసుకున్న భూపోరాట (దున్నటం) కార్యక్రమం కూడా సఫలం కాలేదు. ఉద్యమానికి తీవ్ర ఆటంకంగా వుంటున్న ప్రజా వ్యతిరేకులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించి అందులో భాగంగానే పి.ఎల్.జి.ఎ ఈ క్రింది చర్యలను చేపట్టింది.

## ప్రజాపీడకుడు, విప్లవోద్యమ శత్రువు అరవింద్ సింగ్ చావ్లా హతం :

ఒరిస్సా రాష్ట్రంలోనే ఎ1 కాంట్రాక్టర్‌గా, దోపిడిదారుడిగా తయారయిన అరవింద్ సింగ్ చావ్లా ప్రభుత్వ, పోలీసుల పథకం ప్రకారం కోరాపుట్ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం చేస్తూ ప్రజల

శ్రమను దోచుకోవటంతో పాటు ఉద్యమ అణచివేతకు అండదండలందిస్తున్నాడు. పోలీసులకు సమాచారం చేరవేయటంతో పాటు ఆ ప్రాంతంలో ఉద్యమ అణచివేత కోసం ప్రభుత్వం ప్రజావ్యతిరేకులతో చేస్తున్న శాంతి కమిటీల ఏర్పాటుకు లక్షలాది రూపాయల డబ్బు విరాళంగా ఇచ్చి సహకరిస్తున్నాడు. దీనితో అరవింద్ చావ్లాను 8.7.2010న పి.ఎల్.జి.ఎ నిర్మూలించింది. రోడ్డు పనులకు ఉపయోగించే ప్రోక్లెయినర్‌లను, వాహనాలను తగులబెట్టి, రోడ్ల నిర్మాణం బంద్ చేయాలని మిగతా కాంట్రాక్టర్లకు హెచ్చరిక చేసింది.

## శాంతి కమిటి గూండా, పోలీస్ ఇన్‌ఫార్మర్ కేంద్రుక గాసీకి ప్రజల శిక్ష :

నారాయణపట్నం బ్లాక్ బలిపట్ట పంచాయితీ దుంశిలి గ్రామంలో గతంలో కువ్వి తెగ పెత్తందారుడైన లాతి ప్రజావ్యతిరేకిగా తయారై సంఘం చేసిన పోరాటాలతో 2008లోనే గ్రామాన్ని విడిచి పారిపోయాడు. ప్రభుత్వం ఇటువంటి పెత్తందార్లు, గూండాలు, భూస్వాములు, లంపెన్లు, ప్రజా వ్యతిరేకులతో ఏర్పాటు చేసిన శాంతి కమిటీలో చేరి పోలీసులతో కలసి అనేక గ్రామాలపై దాడులలో పాల్గొని, అనేక మంది సంఘ నాయకులను అరెస్టులు చేయంచాడు. గ్రామం విడిచి పారిపోయినప్పటికీ దుంశిలి, గొత్తిగూడ గ్రామాలలో కొద్ది మందిని తనకు అనుకూలంగా మార్చుకొని ఇన్‌ఫార్మర్లుగా తయారుచేసి, తుపాకులు (బర్మార్లు) కూడా ఇచ్చి పార్టీ పైన, సంఘనాయకుల పైన దాడులు చేయాలని పురమాయించాడు. అలా గొత్తిగూడ గ్రామంలో పిల్కొ, దుంశిలి గ్రామంలో గాసి (పారా టీచర్) అనే వారి నాయకత్వంలో మరి కొంత మంది తయారయ్యి రెండు గ్రామల మధ్యన మామిడి తోటలో స్థావరం ఏర్పాటు చేసుకొని సెంట్రీలు పెట్టుకొని వుంటున్నారు. వీళ్ళు పోలీసులతో కలసి గ్రామలపై దాడులలో పాల్గొనటం, సంఘ నాయకులను అరెస్టులు చేయించటంతో పాటు, 2010 జూన్‌లో దుంశిలి గ్రామంలో రుక్మిణి అనే మహిళా సంఘం కార్యకర్త కాలువకు స్నానానికి వెళితే పట్టుకొని అత్యాచారం చేసి తరువాత పోలీసులకు అప్పగించారు. ఈ ప్రజా ద్రోహులను నిర్మూలించాలనే ప్రజల నిర్ణయం మేరకు 14.8.2010 రాత్రి పి.ఎల్.జి.ఎ, మిలీషియా కలసి రెండు బ్యాచ్‌లుగా వెళ్ళి వీళ్ళ స్థావరాన్ని చుట్టుముట్టాయి. గాసి అనేవాడు పాకలోనే దొరికి పి.ఎల్.జి.ఎ చేతిలో హతమవ్వగా, పిల్కొ అనేవాడు వెనుక వైపు నుండి తప్పించుకొని పారిపోయాడు.

## కోరాపుట్ జిల్లా ప్రజావ్యతిరేక శాంతి కమిటీ నేత ఆనంద్ కిర్షానీ హతం :

కోరాపుట్ జిల్లాలో లాయర్‌గా పని చేసే ఆనంద్ కిర్షానీ 2008లో జిల్లాలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీకి అధ్యక్షుడయ్యాడు. జిల్లాలోని అన్ని బ్లాక్‌లలో శాంతి కమిటీలను ఏర్పాటు చేయటానికి తీవ్ర కృషి చేశాడు. అనేక శాంతి కమిటీ మీటింగ్‌లు నిర్వహించి ప్రజలను రెచ్చగొట్టడం, ఘర్షణలు సృష్టించి ప్రజలల్లో చీలికలు తెచ్చి, ఛసి మూలియా సంఘానికి వ్యతిరేకంగా అనేక ర్యాలీలు నిర్వహించాడు. ఛసి మూలియా సంఘ నాయకుడు నాచిక లింగను అరెస్టు చేయాలని, ఉరి తీయాలని, సంఘాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ 2009 అక్టోబర్ 20న కోరాపుట్ బంద్‌కు పిలుపునిచ్చాడు. శాంతి కమిటీలో ముఖ్యమైన నేతగా వుంటూ సంఘాన్ని, మన ఉద్యమాన్ని అణచివేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసిన ఆనంద్ కిర్షానీని, 29–8–2010న పి.ఎల్.జి.ఎ యాక్షన్ టీం సిమిలిగూడలో హతమార్చింది. ఆనంద్ కిర్షానీ హతమవ్వడంతో అప్పటి వరకు శాంతి కమిటీలో వుంటూ ప్రజలకు వ్యతిరేకంగా అరాచకాలు సాగిస్తూ, పోలీసుల మద్దతుతో తమకు ఎదురులేదని విర్రవీగిన వాళ్ళందరికీ గుండెల్లో వణుకు పట్టింది. ఈ చర్య తరువాత కోరాపుట్ జిల్లాలో వివిధ బ్లాక్‌లలో శాంతి కమిటీ నాయకులుగా, కార్యకర్తలుగా పనిచేస్తున్న వాళ్ళంతా పత్రికా ముఖంగానూ, మీడియా ముందు తాము శాంతి కమిటీకి రాజీనామా చేస్తున్నామనీ, పార్టీకి, సంఘానికి తాము వ్యతిరేకం కాదనీ ప్రకటనలు ఇచ్చారు. ఈ చర్య ప్రజల్లో మంచి ప్రభావాన్ని, గొప్ప ఉత్సాహాన్నీ, ధైర్యాన్ని కలిగించింది.

వీరే కాక ప్రజా ఉద్యమానికి, భూపోరాటాలకు ఆడ్డంకిగా నిలిచి, ప్రజలపై ప్రభుత్వ అణచివేతకు సహకరిస్తున్న ప్రజాద్రోహులు, శాంతి కమిటీ నాయకులు పురి సీరిక, రొబి కొర్రాలను, పోలీసులకు సమాచారం చేరవేస్తూన్న ఇన్‌ఫార్మర్లు, సారా వ్యాపారులు కొర్ర కపురొ, కొర్ర డిసెంబరో, మెల్లక సికునులను కూడ పి.ఎల్.జి.ఎ నేతృత్వంతో ప్రజలు అడ్డుతొలగించుకున్నారు.

**"నాయకత్వానికి సరైన భావాలు ఏర్పడడానికి ప్రజల నుండి భావాలను తీసుకుని వాటిని సమీక్షించాలి. తర్వాత ప్రజల వద్దకు తీసుకెళ్ళి వాటిని వారు తమవిగా భావించి స్వీకరించే వరకు పట్టుదలతో వివరిస్తూ ప్రచారం చేయాలి. వాటిని ఆచరించాలి. ఇదే నాయకత్వానికి ప్రాథమిక పద్ధతి." - కా॥ మావో**

**(ఇది మావో ప్రజాపంథా యొక్క క్లుప్త సారాంశం)**

## ఈస్ట్ డివిజన్

### రాజ్యహింసకు వ్యతిరేకంగా రోడ్డును తవ్వేసిన ప్రజలు

దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పార్టీపై, ప్రజలపై పెద్ద ఎత్తున జరుపుతున్న దాడికి నిరసనగా 2010 సెప్టెంబర్ 25న జరిగిన బంద్ సందర్భంగా స్థానిక పి.ఎల్.జి.ఎ బలగాలు, మిలీషియా కలిసి పెదబయలు, రూడకోటల మధ్యన రోడ్డును 3మీటర్ల లోతువరకు తవ్వేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

### జి.సి.సిలో, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతిపై సేల్స్‌మెన్, వి.ఆర్.పిలను నిలదీసిన ప్రజలు :

ఈస్ట్ డివిజన్‌లోని ఏజెన్సీ వ్యాప్తంగా జి.సి.సి డిపోల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నది. ప్రజలకు అందాల్సిన బియ్యం, కిరోసిన్, పంచాదార మొదలైన నిత్యావసర సరుకులను సేల్స్‌మెన్‌లు నల్ల బజారుకు తరలిస్తుండటంతో ప్రజలకు అందడంలేదు. ఈ అవినీతిని బహిర్గతం చేస్తూ ప్రజలు పోస్టర్లు, పత్రికా ప్రకటనలు, గోడ పత్రికల ద్వారా ఏజెన్సీ వ్యాప్తంగా ప్రచారం చేశారు.

పెద బయలు మండలం గిన్నెలకోట పంచాయితీ పరిధిలోని తమ్లుం గ్రామానికి చెందిన వి.ఆర్.పి గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా ప్రజలతో పనులు చేయించి జాబ్‌కార్డు ఆధారంగా కాకుండా ఎంతో కొంత డబ్బు ముట్ట జెప్పి, వారి శ్రమను తీవ్రంగా దోపిడి చేస్తూ సుమారు 7లక్షల రూపాయలు లబ్ధిదారుల నుండి కాజేశాడు. ఈ సమస్యపై 2010 సెప్టెంబర్‌లో దళం నేతృత్వంలో ప్రజలు సభ జరిపి, వి.ఆర్.పిని విచారించారు. మొదట ఎలాంటి అవినీతికి పాల్పడలేదనీ బుకాయించే ప్రయత్నం చేసి, ప్రజల ఆగ్రహానికి జడిసి చేసిన తప్పులను ఒప్పుకున్నాడు. ఒక నెల రోజల గడువులోగా లబ్ధిదారులకు చెల్లించవలసిన 7లక్షల రూపాయలు చెల్లిస్తాననీ హామీ పత్రం రాసిచ్చాడు.

ఇదే మండలం ఇంజెరి పంచాయితీకి చెందిన డిపోలలో జరుగుతున్న అవినీతిపైన, గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జరుగుతున్న అవినీతిపైన అక్టోబర్ 12న ఏ.ఆర్.సి.ఎస్ ఆధ్వర్యంలో 700మంది ప్రజలు సభ జరిపి, సేల్స్‌మెన్, వి.ఆర్.పి ల అవకతవకలపై విచారణ జరిపారు. నిజాలు చెప్పకపోతే ఎవరు వచ్చిన వదిలేదిలేదని ప్రజలు తెగేసి చెప్పారు. దిక్కు తోచని స్థితిలో చేసేది లేక ప్రజలముందు తప్పు ఒప్పుకున్నారు. ఇకముందు ఇలాంటి అవకతవకలకు పాల్పడబోమని ప్రజల ముందు ప్రమాణం చేశారు.

### సారాయిని ధ్వంసం చేసిన మిలీషియా :

ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఏరియా కమిటీ పరిధిలోని గూడెం కొత్తవీధి మండలం పెదవలస, లకవరపుపేట పంచాయితీ కేంద్రాల్లో నాటుసారా అమ్ముతున్న ఇండ్లపై 20.10.2010న ప్రజలు, మిలీషియా దాడులు చేసి సారాయిని ధ్వంసం చేశారు. ఈ మధ్య కాలంలో నిర్మాణాలు ఏర్పడి పని చేయడంతో ప్రజలు సారాయి వలన కలుగుతున్న అనర్థాల గురించి చర్చించి ధ్వంసం చేయాలని నిర్ణయించారు.

ముందుగా పోస్టర్లు వేసి కొన్ని గ్రామాల్లో మీటింగ్‌లు నిర్వహించి హెచ్చరికలు చేశారు. అయినా కొద్ది మంది తమ పద్ధతులు మార్చుకోకపోవడంతో 20.10.2010న సారాయి తయారుచేసే 10ఇండ్లపైన బెల్లం దిమ్మలను అమ్మే 5దుకాణాలపై దాడులు చేసి సారాయిని, బెల్లం దిమ్మలను ధ్వంసం చేశారు. ఈ చర్య అనేక గ్రామాలలో మంచి ప్రభావం వేసింది ఈ సంఘటన విస్తృతంగా ప్రచారం కావడంతో శతృవు కూడా సారాయిని ధ్వంసం చేస్తున్నామని కొన్ని చర్యలు చేశాడు. కానీ ప్రజలు మాత్రం పార్టీ చర్యలు చేపట్టిన తరువాతనే సిగ్గుపోతుందని పోలీసులు దిగారని బహిరంగంగానే చర్చ చేశారు.

పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సావాలను విజయవంతం చేయాలని, దీనిలో భాగంగానే భూస్వామ్య, సి.బి.బి, సామ్రాజ్యవాదుల ఆస్తులను వారికి ఉపయోగపడే అన్ని రకాల నిర్మాణాలను, ధ్వంసం చేయాలని ఎ.ఓ.బి ఎస్.జెడ్.సి ఇచ్చిన పిలుపు నందుకొని ఈస్ట్ డివిజన్ పరిధిలోని గాలికొండ ఏసి పరిధిలో మిలీషియా కొన్ని చర్యలు నిర్వహించింది. శతృవు పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సావాలను భగ్నం చేయాలని తీవ్ర నిర్బంధం అమలు చేసినప్పటికీ ప్రజలు, మిలీషియా, పిఎల్.జి.ఎ సభలను ఉత్సహంతో జరుపుకొన్నారు.

### అక్రమ అరెస్టులకు నిరసనగా ప్రజల ర్యాలీ :

ఈస్ట్ డివిజన్ పరిధిలోని ఏజెన్సీ వ్యాప్తంగా ప్రజలు తమ మౌలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగుతున్నారు. మరోపక్క అడవిపై ఆదివాసులకే హక్కు అనే నినాదం చుట్టూతా ప్రజలు సంఘటితమై ఎ.పి.ఎఫ్.డి.సి ఆధ్వర్యంలోని కాఫీ తోటలు స్వాధీన పరుచుకుంటున్నారు. ఆదివాసీ ప్రజలను ఆర్థికంగా కుంగదీస్తున్న సారా సమస్యకు వ్యతిరేకంగా ఏజెన్సీ వ్యాప్తంగా ప్రజలు పోరాట క్యాంపెయిన్ చేపట్టి చాలా చోట్ల సారా వ్యతిరేక పోరాటంలో సారా బంద్ చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సంఘటితశక్తిని విచ్ఛిన్నం చేయడానికి పోలీసు యంత్రాంగం సంస్కరణలు, గాంధీయన్ పోలీసింగ్, అమ్మపిలుపు, చెల్లెళ్ళ కోసం వంటి పరివర్తన పథకాలను మన్యం అంతటా అమలు చేయటానికి పూనుకున్నది. కాని, ప్రజల సంఘటితశక్తి ముందు సంస్కరణల మంత్రం పని చేయటం లేదని గ్రహించిన పోలీసు యంత్రాంగం మన్యం అంతటా గ్రామాలపై దాడులు చేసి సుమారు 60మందిని అరెస్టు చేసి, అక్రమ కేసులు బనాయించి జైళ్ళల్లో నిర్బంధించారు. దీనికి వ్యతిరేకంగా 2010 నవంబర్‌లో చింతపల్లి

మండల కేంద్రం, అన్నవరం పోలీసు స్టేషన్ల వద్ద, డిసెంబర్‌లో పాడేరు డివిజన్ కేంద్రంలోను వందలాది ప్రజలు రాజ్యహింసకు వ్యతిరేకంగా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు.

## నిత్యావసరాల సరుకుల డిపో కోసం జిసిసి కార్యాలయాన్ని ముట్టడించిన ప్రజలు :

ఈస్ట్ డివిజన్ లోని విశాఖ జిల్లా చింతపల్లి మండలం, బలపం పంచాయితీ పరిధిలోని 33 గ్రామాలకు రోడ్డు సరిగా లేనందున సరుకుల రవాణా వీలుకావడం లేదని కుంటి సాకులు చెబుతూ గత కొంతకాలంగా ప్రభుత్వం నిత్యావసర సరుకుల పంపిణీ నిలిపివేసింది. దీంతో ప్రజలు సమైక్యమై సమిష్టి శ్రమ ద్వారా సరుకుల రవాణాకు వీలుగా రోడ్డును చదును చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం వైపునుండి ఎలాంటి స్పందన లేకపోడంతో ప్రజలు ఆందోళనకు సిద్ధమయ్యారు. ఆందోళన కమిటీని ఏర్పరచుకొని, 2010 నవంబర్ 10న చింతపల్లి మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ (జిసిసి) డివిజనల్ మేనేజరు కార్యాలయాన్ని 200మంది ప్రజలు ముట్టడించి, కార్యాలయం ముందు బైఠాయించారు. చౌకధరల డిపోల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, నిరంతరం చౌకధరల డిపోలను తెరచి ఉంచాలని ప్రజలు డిమాండ్ చేశారు. ప్రజల సంఘటిత శక్తికి తలొగ్గిన అధికారులు బలపం పంచాయితీ చౌకధరల డిపోను తిరిగి ప్రారంభించారు.

## అవినీతి, సారాకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు

విశాఖ జిల్లా చింతపల్లి మండలం కొడిమిసార గ్రామ పంచాయితీ సర్పంచ్ చిన్నారావు, ఎం.పి.టి.సి సభ్యుడు భాస్కర్‌రావు, వార్డు మెంబర్ చిన్నయ్యలు ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, వృద్ధాప్య పింఛన్లు ఇప్పిస్తామని, పనులు చేయిస్తామని నమ్మబలుకుతూ పెద్ద మొత్తంలో మాముళ్ళు వసూలు చేస్తున్నారు. మరోవంక పోలీసులతో కుమ్మక్కై గ్రామాల్లో నాటుసారా తయారీని ప్రోత్సాహిస్తూ, నెలనెలా మాముళ్ళు వసూలు చేసి పంచుకుంటున్నారు. ఇంతటితో ఆగక ప్రజలకు

మంజూరయిన రేకులు, సిమెంట్, వృద్ధాప్య పింఛన్లు, కాజేయటం, అడిగితే పోలీసులతో అరెస్ట్ చేయిస్తామని బెదిరించేవారు. ఈ ముగ్గురిలో గ్రామ వార్డు మెంబర్ చిన్నయ్య అన్నవరం పోలీసుస్టేషన్ పరిధిలో ప్రజల మధ్య ఏర్పడే తగవుల పరిష్కారం పేరుతో పోలీసులతో బలమైన సంబంధాలేర్పరుచుకొని దళారిగా వ్యవహరిస్తూ యువకులను హోంగార్డులుగా పని చేయమని ప్రోత్సహిస్తున్నాడు. 2009మే నెలలో బాక్సైట్ తవ్వకాల కోసం వేస్తున్న రోడ్డును అడ్డుకునే క్రమంలో ప్రొక్లెయిన్‌లను ధ్వంసం చేసి, రోడ్డు పనులు నిలిపివేయమని పి.ఎల్.జి.ఎ హెచ్చరించింది. హెచ్చరికలను బేఖాతరు చేసి తిరిగి వార్డు మెంబర్ చిన్నయ్య ప్రోద్భలంతో రోడ్డు వేయించే పనికి పూనుకున్నారు. ఈ మొత్తం నేపథ్యంలో పార్టీ నిర్ణయం మేరకు 2010 నవంబర్ 14న పి.ఎల్.జి.ఎ కొడిమిసార గ్రామంలో ప్రజాకోర్టు నిర్వహించింది. ఈ సందర్భంగా సారాను నిషేధించి అమ్మకాలు, తయారీ నిలిపి వేయాలని ప్రజలు నిర్ణయించారు. అనంతరం సర్పంచ్, ఎం.పి.టి.సి, చిన్నయ్యల అవినీతిపై విచారించి, కొంతకాలంగా సర్పంచ్ గ్రామంలో లేకపోవడంతో ఎం.పి.టి.సిని దేహశుద్ధి చేసి ప్రజల నిర్ణయం మేరకు చిన్నయ్యకు ప్రజలే మరణశిక్ష వేశారు. ఈ ఘటన అవినీతి పరుల గుండెల్లో గుబులు రేపగా, విప్లవ ప్రజానీకంలో మంచి రాజకీయ ప్రభావాన్ని వేసింది.ఌ

## లోతుగెడ్డ షావుకారు దుర్గ ఇంటిపై దాడి :

ఈస్ట్ డివిజన్ పరిధిలోని విశాఖ జిల్లా చింతపల్లి మండలం లోతుగెడ్డ పూర్తిగా ఆదివాసీ గ్రామం. మైదాన ప్రాంతమైన నర్సీపట్నం నుండి వ్యాపారం నిమిత్తం వచ్చి గ్రామంలో స్థిరపడిన ఆదివాసేతరుల్లో షావుకారు దుర్గ ఒకడు. క్రమంగా ఆదివాసీల పంటలు కొనుగోలు చేస్తూ, వడ్డీకి రుణాలు ఇస్తూ బడా వ్యాపారిగా, రాజకీయ పలుకుబడి పెంచుకొని కాంట్రాక్టరుగా కూడ మారాడు. తక్కువ కూలీరేట్లు యిచ్చి ఆదివాసీలను తీవ్రమైన శ్రమ దోపిడికి గురిచేస్తూ, అప్పులకు బదులుగా పంటల సీజన్‌లో చేతికొచ్చిన పంటను కాజేస్తూ ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నాడు.

శత్రు సాయుధ బలగాలు ఉద్యమ ప్రాంతానికి చేరుకోవడానికి ఇతడు తన వాహనాలను సమకూర్చుతు, ప్రజా ఉద్యమాన్ని దెబ్బతీయాలనే శత్రువుకు సహాయ, సహకారాలందిస్తూ ప్రజావ్యతిరేకిగా కూడా మారాడు. ఈ నేపథ్యంలో పార్టీ నిర్ణయం మేరకు 2010 నవంబర్ 18న కంపెనీ బలగాలు, స్థానిక బలగాలు, మిలీషియా, ప్రజలు సంయుక్తంగా వ్యాపారి దుర్గ ఇంటిపై దాడి చేశారు. ఆ సమయంలో ఇంట్లో లేని కారణంగా దుర్గ దొరకలేదు. ఇంటిలోని బట్టలు, టివి. మోటారుసైకిలు, ఐషర్ వ్యానుకు నిప్పంటించి దగ్ధం చేశారు. 10 క్వింటాళ్ళ బియ్యం, 2 జనరేటర్లు ప్రజలు స్వాధీనం చేసుకొన్నారు. అనంతరం గ్రామంలో రహస్యంగా సారా తయారు చేసి చుట్టుపక్కల గ్రామాలకు సప్లయి చేస్తూ, ఈ ప్రాంత ఆదివాసీ ప్రజలను ఆర్థికంగా కుంగదీస్తున్న సారా, బ్రాందీ షాపులను పి.ఎల్.జి.ఎ ధ్వంసం చేసింది. సారా తయారీకి వుపయోగించే అమ్మోనియం, బెల్లం దిమ్మలను కూడా ప్రజలు పెద్ద మొత్తంలో ధ్వంసం చేశారు. అదే విధంగా వ్యవసాయం కోసం పోడు నరికితే ఆదివాసులపై తప్పుడు కేసులు బనాయిస్తున్న ఫారెస్టు డిపార్టుమెంటు ఆస్తులను కూడ దగ్ధం చేశారు. అనంతరం పి.ఎల్.జి.ఎ గ్రామంలో సభ నిర్వహించి, జరిగిన సంఘటనల నేపథ్యాన్ని ప్రజలకు వివరించింది.

# కాఫీ ప్లాంటేషన్ భూముల్ని, కాఫీ పంటను స్వాధీనం చేసుకున్న ఆదివాసీ రైతాంగం

ఈస్ట్ డివిజన్‌లోని విశాఖ జిల్లా ఏజన్సీ ప్రాంతంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఎ.పి.ఎఫ్.డి.సి) సుమారు 4వేల హెక్టర్ల అటవీ భూములు ఆక్రమించి ఆ భూముల్లో కాఫీ ప్లాంటేషన్లు ఏర్పాటు చేసింది. భూములు కోల్పోయిన ఆదివాసులు కాఫీ ప్లాంటేషన్లలో రోజువారి కూలీలుగా బతుకులీడుస్తుండగా, వారి శ్రమతో వెలసిన కాఫీ తోటల నుండి ఎ.పి.ఎఫ్.డి.సి కోట్ల రూపాయాల ఆదాయాన్ని ఆర్జిస్తున్నది. ఆదివాసులను తీవ్రమైన శ్రమదోపిడికి గురిచేస్తూ, కూలి రేట్లు పెంచడానికి కూడ సిద్ధంగా లేకపోవడంతో అనేక సార్లు పార్టీ నాయకత్వంలో ప్రజలు సంఘటితమై పోరాడి కూలీరేట్లు పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో అడవిపై హక్కు ఆదివాసులదేననే నినాదంతో కాఫీ తోటల స్వాదీనంకై ప్రజలను సిద్ధం చేయాలనీ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు గాలికొండ ఏరియా కమిటీ పరిధిలోని గూడెంకొత్తవీధి మండలం మర్రిపాకలు కాఫీ ఎస్టేట్‌ను ప్రజలు స్వాధీన పరుచుకొని రెండు సంవత్సరాలుగా ఆ ప్లాంటేషన్‌ను సమిష్టిగా వారే నిర్వహిస్తున్నారు. దీని కొనసాగింపుగా కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలోని చింతపల్లి మండలం బలపం పంచాయితీలో వున్న 110 హెక్టర్ల కాఫీ ఎస్టేటును స్వాధీనపరుచుకోవడానికి పంచాయితీకి చెందిన 33 గ్రామాల ప్రజలు సంఘటితమయ్యారు. గ్రామస్థాయిలో కాఫీ తోటల స్వాధీన పోరాట కమిటీలను ఏర్పరుచుకున్నారు. వాటి సమన్వయం కోసం పంచాయితీకి 8పాకెట్లుగా విభజించి పాకెట్ స్థాయిలో కూడా పోరాట కమిటీలను నిర్మాణం చేసారు. ఆ పై స్థాయిలో పంచాయితీ పోరాట కమిటీని కూడా నిర్మించారు. తోటల స్వాధీనంకై కదిలే ప్రజలకు అండగా సాయుధ మన్యం పితూరీ సేన నిర్మాణాలు ఏర్పడ్డాయి. పి.ఎల్.జి.ఎ దశాబ్ది మాసోత్సవాల సందర్భంగా పంచాయితీ స్థాయిలో డిసెంబర్ 6 2010న కోరుకొండ – బూరుగుబయలు గ్రామాల మధ్య సుమారు 1000 మంది ప్రజలతో సభ ఊరేగింపు నిర్వహించారు. సభలో పలువురు వక్తలు ప్రసంగించారు.

ప్రజలు పి.ఎల్.జి.ఎలోకి భర్తీ కావల్సిన ఆవశ్యకతను వివరించి, చివరిగా కాఫీ తోటల స్వాధీనంకై ప్రజలు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. పి.ఎల్.జి.ఎ దశాబ్ది మాసోత్సవాలను భగ్నం చేయాలనీ శత్రువు పెద్ద ఎత్తున బలగాలను మోహరించి, భయానక వాతావరణం సృష్టించినప్పటికీ ప్రజలు విజయవంతంగా సభ జరుపుకున్నారు. మన్యం పితూరీసేన సభ్యులు రక్షణ కల్పించారు.

మరుసటి రోజు (డిసెంబర్ 9వ తేదిన) బలపం పంచాయితీ కోరుకొండ గ్రామంలో ఎపిఎఫ్‌డిసి భవనాలను పితూరీసేన సభ్యులు ప్రజలు నేలమట్టం చేశారు. పక్వానికొచ్చిన కాఫీ పంటను డిసెంబర్ 10న ప్రజలే స్వాధీనపరుచుకున్నారు. పోరాటాన్ని మరింత పట్టుదలతో ముందుకు తీసుకెళ్ళడానికి పంచాయితీ పోరాట కమిటీ సమావేశమై కాఫీ తోటలను పాకెట్ల వారీగా పంపిణీ చేయాలనీ, వచ్చే ఆదాయం నుండి వాటి నిర్వహణ బాధ్యతను పాకెట్‌లే నిర్వహించాలని, నిర్వహణ కయ్యే ఖర్చులకు 50శాతం కేటాయించాలని, ఆదాయాన్ని కూడా కుటుంబాల వారిగా పంపిణీ చేయటం, మార్కెట్ సౌకర్యం విషయమై చర్చించటం, పంచాయితీ ప్రజల ఉమ్మడి అవసరాల నిమిత్తం 19హెక్టార్ల తోటలను విడిగా ఉంచాలని, వీటి నిర్వహణ పంచాయితీ కమిటీయే చూడాలని కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు చేసింది. పై నిర్ణయాలకు అనుగుణంగా డిసెంబర్ 16న 90హెక్టర్ల కాఫీ తోటలను 8పాకెట్ల ప్రజలకు పంపిణీ చేశారు. వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకొని మొదటి నుండి శ్రమలో పాల్గొంటున్న పాకెట్స్‌కు మొదటి ప్రాధాన్యత నిచ్చి 1 1/2 హెక్టర్లు అదనంగా, మిగతా పాకెట్ల వారికి 1 1/2 హెక్టర్లు తక్కువ కేటాయించారు. ఈ పోరాటం మొత్తం ఏజెన్సీ వ్యాప్తంగా మంచి ప్రభావం వేసింది. ఈ ప్రభావంతో ప్రజలు కదిలి ఎక్కడికక్కడ కాఫీ పండ్లు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఎపిఎఫ్‌డిసి అధికారులు ఈ పరిణామల పట్ల ఆందోళనకు గురయ్యారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఎ.పి.ఎఫ్.డి.సి ఉనికికే ప్రమాదమని పోలీసులను ఆశ్రయించారు. కాఫీ తోటల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని, కేసులు నమోదుచేసి అరెస్టు చేస్తామని పోలీసులు బెదిరిస్తున్నారు. అంతే గాక, డిసెంబర్ 14న బలపం పంచాయితీ ఆటవీ ప్రాంతంలో తోకపాడు గ్రామస్థులు వేటకోసం అడవిలో తిరుగుతుండగా ప్రత్యేక పోలీసు బలగాలు వారిపై సుమారు 50 రౌండ్ల కాల్పులు జరిపారు. పథకం ప్రకారం కాఫీ తోటల స్వాధీన పోరాటాన్ని అణచివేయాలనే కుటిల ఎత్తుగడలలో భాగంగానే కాల్పులు జరిపారు. ఈ నేపథ్యంలో ప్రజల్ని సాయుధం చేసే మన్యం పితూరీసేన ఏర్పరచి ప్రతిఘటనకు సిద్ధం అవుతున్నారు. ప్రజారాజ్యాధికార సమస్యను పరిష్కరించుకునే దిశగా సమాయత్తం అయ్యారు.

## చాపగడ్డ కాఫీ పల్పర్ పేల్చివేత :

అడవిపై సర్వాధికారం ఆదివాసులదేననే నినాదం కింద ప్రజలు సంఘటితపడి వందల ఏళ్ళుగా దోపిడి పాలకవర్గాలు తమ అడవిని ఆక్రమించడానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఏసి పరిధిలో గల ఎ.పి.ఎఫ్.డి.సి కింద వున్న కాఫీ తోటలను స్వాదీనపరుచుకోవడానికి గత 4సం॥లుగా తీవ్రంగా ఉద్యమిస్తున్నారు. ప్రజల ఉద్యమ ఫలితంగా 3సం॥ల క్రితం 105 హెక్టర్ల కాఫీ తోటలను ఎ.పి.ఎఫ్.డి.సి నుండి స్వాధీనపరుచుకొని ఫలసాయం అనుభవిస్తున్నారు. దీనిలో కొన్ని సాధక బాధకాలు వున్నప్పటికీ 3సం॥ల నుండి ఈ తోటలు ప్రజల నాయకత్వం కిందే ఉన్నాయి.

మర్రిపాకల ఎస్టేట్‌ను స్వాధీన పరుచుకున్న ఉత్తేజంతోనే దానికానుకొని ఉన్న కుంకుంపూడి ఎస్టేట్ స్వాధీన పోరాటం ఉధృతమైంది. 2009 నుండి ప్రభుత్వం, ఫారెస్టుశాఖ ఎన్ని భయాలు కల్పించినప్పటికీ మిలీషియా అండతో ప్రజల కాఫీ పండ్ల స్వాధీనం కొనసాగుతునే ఉంది. ఆ పోరాటాన్ని తీవ్రం చేయడం కోసం ఎపిఎఫ్‌డిసి కి చెందిన ఆస్థులను ధ్వంసం చేస్తూ దాన్ని మన్యం నుండి పారద్రోలాలని పార్టీ నాయకత్వంలో ప్రజలు నిర్ణయించారు. దానిలో భాగంగా డిసెంబర్ 2న గూడెం మండలం ఏబులం పంచాయితీ పరిధిలో చాపగడ్డ గ్రామంలోని కాఫీ పల్పర్‌ను 30మంది మిలీషియా సభ్యులు మందుపాతరతో పేల్చివేశారు. ఈ చర్య ఏరియాలో మంచి అనుకూల వాతావరణం కల్పించింది. కుంకుం పూడి ఎస్టేట్ పరిధిలోనే కాకుండా గూనలంక ఆర్‌వి నగర్ ఎస్టేట్ పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కాఫీ పండ్ల స్వాధీన పోరాటాన్ని ఉధృతం చేశారు.

## హైటెన్షన్ విద్యుత్ టవర్ పేల్చివేత :

ప్రజా విముక్తి సైన్యం దశాబ్ధి ఉత్సావాలను విజయవంతం చేయాలనే ఎ.ఓ.బి ఎస్.జెడ్.సి ఇచ్చిన పిలుపులో భాగంగా సి.బి.బిలకు ఉపయోగపడే హైటెన్షన్ విద్యుత్ టవర్‌ను లంకపాకలు వద్ద డిసెంబర్ 2న ప్రజా మిలీషియా పేల్చివేసింది.

## బాక్సైట్ రహదారికి నిరసనగా :

జిందాల్, ఆన్‌రాక్ కంపెనీలు విశాఖ మన్యంలో బాక్సైట్ ఖనిజాన్ని వెలికితీయడం కోసం ప్రభుత్వ, పోలీసు అండతో చురుగ్గా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ శాఖల నుండి అన్ని రకాల అనుమతులు తీసుకున్నా ప్రజా ప్రతిఘటన బలంగా ఉండడంతో ప్రభుత్వం ప్రజలపై తీవ్ర నిర్బంధం అమలు చేస్తున్నది. ప్రజా ఉద్యమాన్ని అణచడం కోసం, బాక్సైట్ ఖనిజాన్ని వెలికి తీయడం కోసం మారుమూల ప్రాంతంలో విస్తృతంగా తారురోడ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపధికన చేపడుతున్నారు. మెజారిటీ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటకీ ప్రభుత్వ సంస్కరణల ద్వారా లబ్ధిపొందుతున్న ఒక సెక్షన్, కింది స్థాయిలో బూర్జువా పార్టీల నాయకులు తమ లబ్ధి కోసం బాక్సైట్ రహదారులను వేయిస్తున్నారు. ఇందులో భాగంగా గూడెం మండల కేంద్రం నుండి బొనంగి పల్లి, గొందిపల్లి, మురగపల్లి, సిరిబాల గ్రామాలను కలుపుతూ రూ॥25 కోట్ల రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఏరియా కమిటీ గతంలో ఒకసారి హెచ్చరించినప్పటికీ పెడచెవిన పెట్టారు. ఈ విషయాన్ని ప్రజలు పార్టీ దృష్టికి తీసుకొచ్చి, బాక్సైట్ కంపెనీల వాహనాలను తగులబెట్టి హెచ్చరించాలని కోరగా, డిసెంబర్ 4వ తేదీన గూడెం మండలం సిరిబాల గ్రామంలో నిర్మిస్తున్న రోడ్డురోలర్‌ను పి.ఎల్.జి.ఎ ధ్వంసం చేసింది. ఈ సందర్భంగా పి.ఎల్.జి.ఎలో విస్తృతంగా చేరాలని పిలుపునిస్తూ కరపత్రాల ద్వారా ప్రచారం చేయడం జరిగింది.

## సెల్‌టవర్‌ను దహనం చేసిన మిలీషియా :

ఈస్ట్ డివిజన్ పరిధిలోని చింతపల్లి మండలం లంబసింగిలో 16.12.2010న ప్రజా మిలీషియా సెల్‌టవర్‌ను దహనం చేసింది. విప్లవోద్యమాన్ని అణచడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శతృవు నిరంతరం తన సన్నాహాలను తీవ్రం చేయటంలో భాగంగానే మన్యంలో సెల్‌టవర్ల నిర్మాణం వేగవంతం చేశాడు. ప్రధాన కేంద్రాల్లో పోలీసుస్టేషన్ల లోనే ఏర్పాటు చేస్తూ, వాటి సామార్థ్యాన్ని తక్కువగా వున్నచోట పెంచుతున్నారు. ఏజెన్సీకి మైదాన ప్రాంతానికి ప్రధాన మార్గంగా వుండే లంబసింగ్‌లో ఈ మధ్యనే కొత్తగా సెల్‌టవర్‌ను ఏర్పాటు చేశారు. బాక్సైట్ వ్యతిరేక పోరాటాన్ని, విప్లవోద్యమాన్ని అణచడం కోసం శతృవు ఏర్పాటు చేస్తున్న ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలో ఇది కూడా కీలకంగా ఉన్నందున స్థానిక పార్టీ నిర్ణయం మేరకు మిలీషియా దీన్ని ధ్వంసం చేసింది.

## ప్రజావ్యతిరేకుల భూముల పంపిణీ :

ఈస్ట్ డివిజన్‌లోని విశాఖ జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయతీ కోరుకొండ గ్రామం గతంలో ప్రజావ్యతిరేకులకు నిలయంగా ఉండేది. 1985లో బూరుగుపాకల ఎన్‌కౌంటర్‌లో అమరుడైన కామ్రేడ్ బుక్కా వెంకటేశ్వర్లు స్వగ్రామం ఇది. కా॥వెంకటేశ్వర్లు అన్నదమ్ముల్లో పెద్దవాడైన పాపారావు పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అమరవీరుని కుటుంబానికి చెందినవాడనే ఇంగిత జ్ఞానం లేకుండా ప్రజలపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఎఎస్‌పి పోతారెడ్డి హయంలో జరిగిన దారుణ మారణకాండలో ఇతడు కీలక పాత్రధారి. ఈ నేపధ్యంలో వీరి కుటుంబాన్ని గ్రామం నుండి పార్టీ, ప్రజలు బహిష్కరించారు. మరో ప్రజావ్యతిరేకి, ఎ.పి.ఎస్.పి కానిస్టేబుల్ శర్మాండ కోటేశ్వరరావు కుటుంబాన్ని కూడ అప్పట్లో పార్టీ, ప్రజలు గ్రామం నుండి వెళ్ళగొట్టారు. లోతుగెడ్డ, చింతపల్లి,

అన్నవరం వంటి పట్టణ కేంద్రాల్లో సెటిల్ అయిన వీరు గ్రామంలోని తమ భూములను, పైసా పెట్టుబడి పెట్టకుండా భూమిలేని వారికి పాలుకు(వాటాకు) ఇచ్చి సాగుచేయిస్తున్నారు. పెట్టుబడి, శ్రమ మొత్తం సాగుచేస్తున్న కుటుంబాలే భరిస్తుండగా పంట చేతికి రాగానే కష్టపడి శ్రమ చేసిన కుటుంబాలకు ఒక వాటా యిచ్చి, మిగిలిన పంటనంత కాజేస్తున్నారు. అడిగితే పోలీసు బూచి చూపి బెదిరిస్తున్నారు. ఈ విషయం గ్రామస్తులు పార్టీ ముందు చర్చించి, భూములు పంపిణీ చేయాలని కోరారు. మొత్తం పంచాయితీ ప్రజలందరి అభీష్టం మేరకు వీళ్ళ భూములను పంపిణీ చేయాలని పార్టీ నిర్ణయించి తొమ్మిది మందితో పంపిణీ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నిర్ణయాల్లో భాగంగా పంటల కోత ముగిసిన అనంతరం భూములను భూమిలేని 22 కుటుంబాలకు పంపిణీ చేశారు.

ఈ కమిటీ పరిశీలన చేసి, రెండు దశాబ్దాల క్రితం గ్రామం విడిచి వెళ్ళిపోయిన వ్యాపారి సేవ మోహన్‌రావు, చల్లంగి చిట్టి బాబులకు చెందిన 60 ఎకరాల భూములను (అటవీ) కూడ ప్రజలకు పంచాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు పంటల కోతలు ముగిసిన తర్వాత ఈ భూములన్నింటిని భూమిలేని 22 నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేశారు.

## పి.ఎల్.జి.ఎ దశాబ్ది మాసోత్సవాలు :

పి.ఎల్.జి.ఎ దశాబ్ది మాసోత్సవాల సందర్భంగా ఈస్ట్ డివిజన్ వ్యాప్తంగా పోస్టర్లు, స్టిక్కర్లు, బ్యానర్ల ద్వారా ప్రచారం జరిగింది. మల్కన్‌గిరి జిల్లా కుడుముల గుమ్మ బ్లాక్ పరిధిలో రోళ్ళగెడ్డ పంచాయితీలోని బానందూళి – పలగరేవు, ఇసుకబంద – తాటి పర్రు; పెదబయలు ఎల్.ఓ.ఎస్ ఏరియాలో జక్కం – నానాబరి, కోండ్రు – ఇంజేరి గ్రామాలమధ్య సుమారు 200 నుంచి 700 మందితో పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సవాల సభలు జరిగాయి. ఈ సందర్భంగా అడవిపై హక్కు, అధికారం కోసం సమైక్యం కావాలనీ, మన్య ప్రాంతాన్ని బహుళజాతి కంపెనీల అడ్డగా మార్చడానికి చేపడుతున్న బాక్సైట్ గనుల తవ్వకానికి వ్యతిరేకంగా ఉద్యమించడానికి పి.ఎల్.జి.ఎలో భర్తీ కావాలనీ పిలుపునిచ్చారు. ప్రజా మిలీషియా గట్టి రక్షణలో సభలు విజయవంతమయ్యాయి.

## ప్రజా ఉద్యమానికి శత్రువులుగా తయారైన హోంగార్డుల నిర్మూలన :

మన్యంలోగల ఖనిజ సంపదను సామ్రాజ్యవాద, దేశీయ బహుళజాతి కంపెనీలకు విచ్చలవిడిగా దోచి పెట్టడానికి అడ్డుకొంటున్న ప్రజా ఉద్యమాన్ని, మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ సైనిక దాడిని తలపెట్టాయి. ఇందులో భాగంగానే ఉద్యమ ప్రాంతం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో శత్రువు ఇంటెలిజెన్సి నెట్‌వర్క్‌ను పెంచడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. ఆదివాసి, యువతీ, యువకులను ఉపాధి, ఉద్యోగాల ఎరచూపి, చేరదీసి ఇన్‌ఫార్మర్లుగా, హోంగార్డులుగా తయారుచేసి, ప్రజలకు వ్యతిరేకంగా నిలబెడుతున్నాడు. మన ఉద్యమ ప్రాంతమంతటా రకరకాల పేర్లతో శత్రువు ఈ కుటిల ఎత్తుగడలను అమలు చేస్తున్నాడు. ఈ శత్రు నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయటంలో భాగంగా ఈస్ట్ డివిజన్‌లో కొంత మంది కరుడు గట్టిన హోంగార్డులను పి.ఎల్.జి.ఎ హతమార్చింది.

విశాఖజిల్లా చింతపల్లి మండలం కోటగున్నల గ్రామంలో హోంగార్డు ప్రసాద్ మునసబుదారీ వ్యవస్థ అండతో గ్రామంపై పెత్తనం చలాయిస్తూ ప్రజా వ్యతిరేకిగా తయారయ్యాడు. నిరంతరం పోలీసులతో సంబంధాలు కొనసాగిస్తూనే, మరోపక్క తన తమ్ముళ్ళు వినోద్, బంగార్రాజు, శ్రీకాంత్‌లలో కలిసి దళం సమాచారం సేకరించటం, పార్టీ పేరుతో డబ్బు వసూలు, ప్రజలపై దౌర్జన్యాలకు దిగటం చేస్తున్నాడు. ప్రసాద్ వాడి తమ్ముళ్ళు యాడెం గ్రామానికి చెందిన చిన్నబ్బాయితో కలిసి అత్యంత క్రూరంగా మన ఆర్.ఎస్.యు ఆర్గనైజర్ కామ్రేడ్ విక్రం ప్రాణాలు బలిగొన్న హంతకులు. ఈ హత్యకు కుట్ర పన్నిన పోలీసులు వ్యక్తిగత కక్షలతో చంపుకున్నారని లోకాన్ని నమ్మింపజూశారు. ఈ విషయాన్ని పార్టీ, ప్రజల్లోకి వెళ్లి విచారించి ప్రసాద్, బంగార్రాజులను శ్రీకాంత్ హత్యకు కారకులుగా తేల్చింది. వీరిలో ముఖ్యులను నిర్మూలించి, మిగతా వారిని దేహశుద్ధి చేసి గ్రామం నుండి బహిష్కరించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు 2010 సెప్టెంబర్ 24న పి.ఎల్.జి.ఎ కంపెనీ, స్థానిక బలగాలు, సాయుధ మిలీషియా సంయుక్తంగా కోటగున్నల గ్రామాన్ని చుట్టుముట్టాయి. గ్రామంనుండి బంగార్రాజు పారుగూరుకు వెళ్ళిపోగా, దొరికిన ప్రసాద్, శ్రీకాంత్‌లను విచారించి, ప్రజల నిర్ణయం మేరకు పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది.

అదే విధంగా చింతపల్లి మండలం వేలంజువ్వి గ్రామానికి చెందిన హోంగార్డు పాపారావు మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్ దాగుడుపల్లికి చెందిన హోంగార్డు భాస్కర్, విశాఖజిల్లా ముంచంగిపుట్ మండలం బాబాశాల పంచాయితీ భల్లుగూడలో ఆదివాసి మహిళలపై అత్యాచారానికి పాల్పడిన గ్రేహౌండ్స్ పోలీసులకు సహకరించిన హోంగార్డు మాణిక్యం, గూడెం కొత్తవీధి మండలం లకవరపుపేటకు చెందిన హోంగార్డు కాకిపాటి కేశభద్రంలు ప్రజాశత్రువులుగా మారటంతో పి.ఎల్.జి.ఎ హతమార్చింది.

వీరేగాక, బూసిపుట్, సుర్తానాపుట్ గ్రామాలకు చెందిన శివయ్య, మోహనరావులు సంఘం, మిలీషియాలో పనిచేస్తూ అరెస్టయినట్లు నాటకమాడి శత్రువుకు లొంగిపోయారు. ఆ తర్వాత శత్రువుతో ఒప్పందం చేసుకొని నయాన, భయాన చుట్టుపక్కల గ్రామాల్లోని సంఘ, మిలీషియా సభ్యులను లొంగుబాట్లకు ఒత్తిడి చేస్తుండటంతో మోహన్‌రావును పి.ఎల్.జి.ఎ హతమార్చి అతడికి సహాయకారిగా వున్న శివయ్యను దేహశుద్ధి చేసింది.

ఇంకా డివిజన్‌లోని బలపం పంచాయితీ తడపల్లి గ్రామస్తుడు విశ్వనాద్, దిగవలసపల్లికి చెందిన సునీతలు కొంతకాలం దళంలో పనిచేసి శత్రువుకు లొంగిపోయి, ఆ తర్వాత హోంగార్డులుగా చేరారు. పార్టీ హెచ్చరికలను ఖాతరు చేయక, కుటుంబాల సహకారంతో ఆదే విధంగా కొనసాగుతున్నారు. ప్రజా వ్యతిరేకులుగా తయారయిన ఈ కుటుంబాలను ప్రజల నిర్ణయం మేరకు గ్రామం నుండి బహిష్కరించి, వారి ఆస్తులను పార్టీ భూమిలేని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేసింది.

చింతపల్లి మండలం రాళ్ళగడ్డ గ్రామానికి చెందిన హోంగార్డు బోడ్రావు కూడ ఇదే విధంగా తయారైతే గతంలో దేహశుద్ధి చేసినప్పటికీ పద్ధతి మార్చుకొనక ఏకంగా చింతపల్లి పోలీసుస్టేషన్‌కు మకాం మార్చాడు. ప్రజావ్యతిరేకిగా తయారైన బోడ్రావు ఇల్లు, భూమిని ప్రజలు స్వాధీనం చేసుకొని ఇల్లు, భూమిలేని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేశారు.

## గ్రామ పెత్తందారు బంగారయ్యకు దేహశుద్ధి:

ఈస్ట్ డివిజన్‌లోని మల్కన్‌గిరి జిల్లా గుమ్మబ్లాక్ పరిధిలోని చీకుపనస గ్రామానికి చెందిన బంగారయ్య గ్రామంలో పెత్తందారు. దళ సభ్యులకు ఇంటికి పోయి బతకమని నీరుగార్చే బోధనలు చేయటంపై గతంలో పార్టీ హెచ్చరించింది. ఈ మధ్య కాలంలో వైద్యం పేరిట గ్రామాలు తిరగటం, పాత నాణేల కోసం వెతికించే ముసుగులో యువకులకు డబ్బులిచ్చి దళం సమాచారం కోసం తిప్పుతుండటంతో సెప్టెంబర్‌లో దళం చీకుపనసలో గ్రామసభ నిర్వహించి దేహశుద్ధి చేసి తీవ్రంగా హెచ్చరించి విడిచిపెట్టింది. పాత నాణేల పేరుతో దళం సమాచారం కోసం తిరుగుతున్న యువకులను ప్రజలు పట్టుకొని చితకబాదారు.

ఇదే డివిజన్‌లో చిత్రకొండ తహశీలు పరిసరాల్లోని రెక్కపాడు గ్రామ మునసబు గ్రామంలో ప్రజలపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ గత కొంత కాలంగా పెత్తనం చెలాయిస్తున్నాడు. ఇతడి అణచివేత చర్యలను తట్టుకోలేక చాలామంది గ్రామం విడిచి వెళ్ళిపోయారు. అలా వెళ్ళిపోయిన కుటుంబాల భూములను స్వాధీనం చేసుకున్నాడు. ఇతని ప్రజావ్యతిరేక చర్యలను 2008లో ఒకసారి 2009లో మరొకసారి దళం విచారణ జరిపింది. ప్రజాకోర్టులో తప్పులు ఒప్పుకున్నప్పటికీ, పద్ధతి మార్చుకోకుండా ప్రజలను పోలీసులకు చెప్పి అరెస్ట్ చేయిస్తానని బెదిరించేవాడు. దానితో 2010 ఆగస్టు 22న స్థానిక దళం ప్రజాకోర్టు నిర్వహించి విచారణ జరిపి, దేహశుద్ధి చేసింది.

# ఉత్తర తెలంగాణ

## ఖమ్మం జిల్లా

## పోలవరం ప్రాజెక్ట్ వ్యతిరేక ప్రచారం :

ఖమ్మం జిల్లా శబరి ఏరియాలో తెలంగాణ, పోలవరం సమస్యలపై చింతూరు, భద్రాచలం మండలాల్లోని 10 గ్రామాల్లో పోస్టర్లు, బ్యానర్ల ద్వారా సంఘాలు ప్రచారం చేశాయి.

ప్రత్యేక తెలంగాణ కొరకు ఉద్యమిద్దాం ! పోరాటం ద్వారానే తెలంగాణను సాధిద్దాం ! పోలవరాన్ని వ్యతిరేకిద్దాం ! పోలవరం ప్రాజెక్ట్‌తో 7మండలాల ప్రజలు నిర్వాసితులు అనే నినాదాలతో ప్రచారం జరిగింది.

## పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ :

సెప్టెంబర్ 21న సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ 6వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శబరి ఏరియాలోని కూనవరం, చింతూరు, భద్రాచలం మండలాల్లో పోస్టర్లు, బ్యానర్ల ద్వారా సంఘాలు ప్రచారం నిర్వహించాయి.

సెప్టెంబర్ 21న కూనవరం మండలం రామచంద్రునిపేటలో జరిగిన సభకు 100 మంది ప్రజలు హాజరై, తీవ్ర నిర్బంధ పరిస్థితిలో కూడ సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జన మిలీషియా తగిన రక్షణ ఏర్పాట్లు చేసింది.

## పి.ఎల్.జి.ఎ మాసోత్సవాలు :

పి.ఎల్.జి.ఎ దశాబ్ది మాసోత్సవాల సందర్భంగా శబరి ఏరియాలోని భద్రాచలం, చింతూరు, కూనవరం మండలాల్లో సంఘాలు ప్రచారం నిర్వహించాయి.

డిసెంబర్ 2న చింతూరు మండలంలో రెండు చోట్ల సభలు జరిగాయి. నిత్య నిర్బంధంలో కూడ సభలకు 400 మంది ప్రజలు హాజరైనారు.

పి.ఎల్.జి.ఎ మాసోత్సవాల సందర్భంగా ప్రతిఘటనలో భాగంగా చింతూర్ మండలం చట్టి గ్రామం వద్ద రోడ్డు పనుల కోసం క్రషర్‌మిల్లు వద్ద పని చేస్తున్న ప్రొక్లెయిన్‌ను డిసెంబర్ 25న రాత్రి మిలీషియా ధ్వంసం చేసింది.

**"ప్రతి రాజకీయ ఉద్యమమూ, కార్మిక వర్గాల ఆర్థిక విముక్తి అనే గొప్ప లక్ష్యానికి లోబడి వుండాలి. దానికి ఒక సాధనంగా వుండాలి."**

శత్రు కమ్యూనికేషన్‌లో భాగంగా లోతుట్టు ప్రాంతాల్లో ఉపయోగిస్తున్న ఫోన్ బాక్స్‌లను కూడ మిలీషియా ధ్వంసం చేసింది.

## వెంకటాపురం ఏరియాలో :

పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వెంకటాపురం ఏరియాలోని 12 గ్రామాల్లో రెండు దఫాలుగా పోస్టర్లు, బ్యానర్లతో ప్రచారం జరిగింది. రాంపురంలో జరిగిన సభకు 1000మంది ప్రజలు హాజరైనారు. నిప్పులు చెరిగే నిర్బంధంలో సైతం మిలీషియా రక్షణలో ప్రజలు ఉత్సహంగా పాల్గొని సభను విజయవంతం చేశారు.

## కె.కె.డబ్ల్యూ డివిజన్

## ఏటూర్‌నాగారం - మహాదేవ్‌పూర్ ఏరియాలో

శత్రువు మన ఉద్యమాన్ని నిర్మూలించే పథకంలో భాగంగా ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ పెంచుతున్నాడు. ఏటూరు నాగారం – మహదేవ్‌పూర్ ఏరియా చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర ఉద్యమ ప్రాంతాల సరిహద్దు కావడం వల్ల ప్రత్యేక కేంద్రీకరణ కూడా వుంది. యి.ఎన్ – ఎమ్.డి.పి ఏరియా ఉద్యమం గతంలో బలమైన ప్రాంతం కాబట్టి అప్పటి నుండే శత్రు ఇన్‌ఫార్మర్ల కోసం ప్రయత్నిస్తూ సఫలం అయ్యాడు. ప్రస్తుతం లోతట్టు గ్రామాల్లోనే ప్రతి గ్రామంలో ఒకరు లేదా ఇద్దరి వరకు ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోగల్గాడు. గతంలో ఆర్.పి.సిలు బలంగా పనిచేసిన గ్రామాలలో ఇప్పుడు 10 మంది వరకు కూడా ఇన్‌ఫార్మర్లు వున్నారు. మాజీలు, ప్రభుత్వ పథకాలు అమలు చేసే దళారీ సెక్షన్ రాజకీయ పార్టీల నాయకులు శత్రు నెట్‌వర్క్‌లో పని చేస్తున్నారు. కాబట్టి నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయకుండా మన నిర్మాణాలను, స్వీయాత్మక శక్తులను కాపాడుకొనే పరిస్థితి లేదు. అందుకోసం కొంత మందిని తటస్థం చేయాలని, కొంతమందిని తప్పనిసరిగా నిర్మూలించాలనే నిర్ణయంతో 2010 నవంబర్, డిసెంబర్ టి.సి.ఓ.సిలో భాగంగా యి.ఎన్ – ఎమ్.డి.పి ఏరియా పరిధిలో మజీద్, కుమ్మరి సత్యం, బౌత్ లక్ష్మణ్ అనే ముగ్గురు ప్రజాశత్రువులను ఈ సమయంలో చంపడం జరిగింది. కొంతమందిని తటస్థం చేయడానికి ప్రజల్లో చర్చించి వదిలేయడం జరిగింది.

## మజీద్ :

మజీద్ (ముస్లిం) వరంగల్ జిల్లా ఏటూర్‌నాగారం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందినవాడు. ప్రస్తుతం టి.డి.పి పార్టీలో మండల ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నాడు. గతంలో మన విప్లవ ప్రజాసంఘం (వి.ఆర్.సి.ఎస్) లో 5సంవత్సరాలు పని చేశాడు. 2003లో శత్రుకు లొంగిపోయి ఏటూర్‌నాగారం మండల కేంద్రంలో మారుతున్న ప్రతి ఎస్.ఐతో సంబంధాలు ఏర్పరుచుకుంటున్నాడు.

ప్రధానంగా ఎస్.పి కంట్రోల్‌లో పని చేస్తూ, టిడిపి పార్టీని అడ్డం పెట్టుకొని చుట్టూ గ్రామాల్లో ఇన్‌ఫార్మర్లను ఆర్గనైజ్ చేస్తూ, సమాచారం తెలిస్తే పోలీసులకు చేరవేస్తున్నాడు. 2003 నుండే తన పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించినా మార్చుకోకుండా మన ప్రభావం బలహీన పడుతున్నదనే ధైర్యంతో మరింత ఎక్కువగా ఇన్‌ఫార్మర్లను తయారు చేస్తున్నాడు. అందువల్ల ఇతన్ని పి.ఎల్.జి.ఎ 2010 డిసెంబర్‌లో హతమార్చింది.

## కుమ్మరి సత్యం :

కరీంనగర్ జిల్లా, మహదేవ్‌పూర్ మండలం పలిమల గ్రామానికి చెందిన కుమ్మరి సత్యం ప్రతిఘటన పార్టీలో పని చేస్తూనే పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఒకవైపు పోలీసులు, మరోవైపు ప్రతిఘటన పార్టీ అండతో చుట్టూ రెండు, మూడు గ్రామాలపై పెత్తనం, అరాచకాలు, తాగి జల్సా చేయడం, రివాల్వర్‌తో ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేయడం అడ్డూ ఆదుపు లేకుండా కొనసాగిస్తున్నాడు. ఇతడి పద్ధతులకు విసిగిపోయిన ప్రజలు చంపాలనే నిర్ణయాన్ని పార్టీ ముందు పెట్టారు. కుమ్మరి సత్యం బావ ప్రతిఘటన పార్టీలో కమాండర్. ఇతను ఇన్‌ఫార్మర్, మనపార్టీ వీళ్ళను ప్రజల్లో పెట్టి బహిర్గతం చేయాలనే ఉద్దేశంతో అనేక సార్లు ప్రయత్నించింది. కుమ్మరి సత్యంను పద్ధతులు మార్చుకొమ్మని ప్రజల ముందు హెచ్చరించినప్పటికీ, మారకపోవడంతో 2010 డిసెంబర్‌లో చంపడం జరిగింది. దీనితో ఇతని పీడ విరగడయినందుకు ప్రజలు సంతోషించారు.

## బౌత్ లక్ష్మణ్ :

సర్వాయిపేట గ్రామానికి చెందిన మాజీ దళ సభ్యుడు బౌత్ లక్ష్మణ్ శత్రువు ముందు లొంగిపోయి మహాదేవ్‌పూర్ మండలం పోలీసుస్టేషన్‌తో సంబంధాల్లో వుంటున్నాడు. ఇతని ప్రవర్తన గురించి ప్రజలు అనేక సార్లు దళానికి చెప్పినప్పటికీ సరైన ఆధారం లేనందున వదిలివేయటం జరిగింది. ఇతని బావ ప్రతిఘటన పార్టీలో పని చేస్తూ తుపాకులతో శత్రువు ముందు లొంగిపోయి ప్రస్తుతం మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ నుండి కలప స్మగ్లింగ్ చేస్తూ, పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా సమాచారం ఇస్తున్నాడు. ఇతన్ని చంపడానికి దళం వెళ్ళినప్పుడు లక్ష్మణ్ కూడ పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్న విషయం ప్రత్యక్షంగా అర్థమైంది. దీనితో లక్ష్మణ్‌ను అక్కడికక్కడే దళం ఖతం చేసింది.

*(....42వ పేజీ తరువాయి)*

**'అమ్మా, వెళ్లి పోతున్నా, నన్ను కోప్పడకమ్మా, నెనెక్కడో దారి తప్పి పోయాను. కాని ఈ దారి నేను ఎంచుకున్నది కాదు. ఎప్పుడన్నా నేను నీ మాట వినక పోతే క్షమించు. నన్ను తప్పుపట్టకు. ఈ కాలాన్ని తప్పు పట్టు. నేనిక తిరిగి రాలేని చోటికి వెళుతున్నా. నేనివాళ చాల ఏడ్చానమ్మా. ఇంకా నా కళ్ళలో నీళ్ళులేవు. ఈ దిక్కులేని దేశంలో, ఈ వంచన నిండిన ప్రపంచంలో ఎవరినీ తప్పు పట్టలేమమ్మా. నేనింక అలసిపోయాను. అన్నిటినీ వదిలేసి వెళ్ళిపోతున్నాను. నా ప్రయాణం మొదలయింది. ఈ ప్రయణంలోనయినా నేను అన్నీ మరచిపోతానో లేదో తెలియదు" ..... ఇదే ఆ మాట ... ఇదే ఆ సందేశం..**

ఆ తర్వాత పట్టపగలు కిరోసిన్ పోసుకొని బౌజిద్‌లోని ఒక ప్రభుత్వ కార్యాలయం ముందు అందరూ చూస్తుండగానే నిప్పంటించుకున్నాడు. అధికారులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. మరిన్నీ సౌకర్యాలున్న మరో రెండు ఆస్పత్రులకు మార్చారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో అతనిని వేధించిన అదికారులను శిక్షించారు. దేశాధ్యక్షుడు వచ్చి చికిత్స పొందుతున్న మహమ్మద్‌ను చూశాడు. ఎంతో ప్రయత్నించీ ఫలితం లేకపోయింది. జనవరి 4న మహమ్మద్ బౌవజిజీ ప్రాణం విడిచాడు. 5వేల మందితో పెద్ద ప్రదర్శనగా శవయాత్ర జరిగింది. మహమ్మద్ నిప్పంటించుకున్న ప్రభుత్వ కార్యాలయం మీదుగా శవయాత్రను నిషేధించారు.

"స్వేచ్ఛ చాల ఖరీదయినది. నా సోదరుడు ఆ స్వేచ్ఛకు మూల్యం చెల్లించాడు. ఇప్పుడు అరబ్ ప్రతిఘటనకు చిహ్నంగా మారిపోయాడు'' అని మహమ్మద్ సోదరుడు సలీమ్ వ్యాఖ్యానించాడు. మహమ్మద్ బౌవజిజీ నిలువెత్తు చిత్రపటాలతో ప్రజా ప్రదర్శనలు, ఊరేగింపులు మొదలయ్యాయి. ఒక అనామక పళ్ళ వ్యాపారి హఠాత్తుగా ఒక నియంతృత్వ వ్యతిరేక పోరాటానికి సంకేతమయ్యాడు.

మహమ్మద్ ఆత్మాహుతి తర్వాత మరో యువకుడు 'నిరుద్యోగం పోవాలి' , 'దారిద్ర్యం పోవాలి' అని నినదిస్తూ విద్యుత్ తీగలు పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వరుసగా 2 ఆత్మహత్యలతో ప్రజాగ్రహం పెల్లుబికింది. రెండున్నర దశాబ్దాలు రాజకీయ స్వేచ్ఛ లేని ప్రజల అసంతృప్తి ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. ఈ ప్రజా ఉద్యమం జనవరి 8,9 తీదీల నాటికి దేశ రాజధాని టునిస్‌కు చేరింది. నిరసన కారులపై పోలీసులు జరిపిన కాల్పులలో 100 మంది చనిపోగా, వేయిమంది గాయపడ్డారు.

ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించి కర్ఫ్యూను పెట్టింది. 23 సం॥ల నిరంకుశ పాలనకు అలవాటు పడిన ప్రజలు నిషేధాలను లెక్క చేయలేదు. జనం వెనక్కి తగ్గలేదు. అన్ని సెక్షన్ల నుండి కార్మికులు, విద్యార్థులు. యువకులు, మహిళలు, ఉపాధ్యాయులు, లాయర్లు, విలేఖర్లు, రచయితలు ప్రతిఘటనలో పాల్గొన్నారు. ప్రజల ఆగ్రహంతో వివిధ నిరసన రూపాలు చేపట్టారు. ప్రభుత్వ భవనాలు, బెన్ అలీ పార్టీ కార్యాలయాలు, కుటుంబ సభ్యుల వ్యాపారాలు, ఆస్థులు, కార్ల వాణిజ్య సముదాయాలు లక్ష్యంగా దాడులు చేయడంతో పాటు బెన్ అలీ మేనల్లుడిని చావగొట్టారు. పోలీసులతో అనేకచోట్ల ఘర్షణకు దిగారు. ప్రజాందోళన సాయుధ బలగాల్లో సంక్షోభం తెచ్చింది. కాల్పులు జరుపడాన్ని సైన్యం వ్యతిరేకించింది. సంయుక్త దళాదిపతి జనరల్ రషీద్ అమర్‌ను పదవినుండి తొలగించాడు నియంత బెన్‌అలీ.

ఉద్యమకారులను 'ముసుగులు ధరించిన గూండాలని', 'అతివాదులని', 'టెర్రరిస్టులని', 'విదేశాలకు అమ్ముడు పోయిన అసాంఘికశక్తులని' పాలకులు నిందించారు. అణచివేత, దుష్ప్రచారం, చీలికలు లాంటి కుట్రలు ఫలించలేదు. తన పీఠం కదిలి పోతుందని గుర్తించిన బెన్‌అలీ అంతరంగిక వ్యవహారాలశాఖ మంత్రిని తొలగించాడు. అవినీతిపై విచారణకు కమిటి నియామకం వంటి చర్యలు తీసుకున్నాడు. 2011జనవరి 13న 'ప్రజలకు ఎక్కువ స్వేచ్ఛ నిస్తానని, సంస్కరణలు తెస్తానని, 2014లో జరిగే ఎన్నికల్లో తను పోటీచేయకుండా దిగిపోతానని' వాగ్దానాలు చేశాడు. ప్రజలు వీటిని పట్టించుకోకుండా "బెన్‌అలీ దిగిపో" అని ముక్తకంఠంతో నినదించారు.

ముందుగా బెన్‌అలీ ఎలా అధికారంలోకి వచ్చాడో, టునీషియా గత చరిత్ర ఏమిటో తెలుసుకుందాం.

టునీషియాకు పెట్రోలియం, సహజ వాయువు, వ్యవసాయోత్పత్తులే ప్రధానవనరులు. 1300 కిలోమీటర్ల సముద్ర తీరం ఉండడంతో అక్కడ పర్యాటక రంగం కూడా ఒక ప్రధాన వనరుగానే వుంది. ఇది ఆఫ్రికా ఖండంలో ఉన్నా ఇక్కడ ముస్లిం జనభా ఉండడం, ప్రాంతీయ సహకారం ఉండడంతో పశ్చిమాసియాలోని అరబ్ దేశాలకు దగ్గరగా ఉంటున్నది. మధ్యదరా సముద్రానికి ఆవల యూరప్ ఉంది. ఎంతో కాలంపాటు ఫ్రాన్స్ సామ్రాజ్యవాదం టునీషియాను ఆర్థికంగా, రాజకీయంగా ప్రభావితం చేస్తుంది. అలా ఫ్రాన్స్ ద్వారా యురోప్‌తో దగ్గర సంబంధం ఉంది. ఫ్రాన్స్, అమెరికాలతో సహా ఎన్నో సామ్రాజ్యవాద దేశాలు బెన్‌అలీకి 2 దశాబ్దాలకు పైగా మద్దతునిస్తూ వస్తున్నాయి. వాస్తవానికి బెన్ అలీని అధ్యక్షుడిగా తెచ్చింది అమెరికన్ సామ్రాజ్యవాదమే.

1980లలో ఐ.ఎమ్.ఎఫ్ టునీషియాపై సంస్థాగత సర్దుబాట్ల కార్యక్రమాన్ని రుద్దింది. సబ్సిడీలు రద్దయ్యాయి. 1984లో రొట్టె ధర 2రెట్లు పెరిగింది. ప్రజలు నిరసన తెలియజేశారు. ప్రజాందోళనలను పోలీసు కాల్పులతో ఆపాలని, 50మందిని కాల్చి చంపారు. ఫలితం లేక పోవడంతో ఆనాటి అధ్యక్షుడు బౌర్‌జిబా అంతరంగిక శాఖమంత్రిని తొలగించి, రొట్టె ధరను తగ్గించాడు. అమెరికా రుద్దుతున్న సంస్థాగత సర్దుబాట్లు ఇక జరగవని ప్రకటించాడు. దానితో ఆందోళన సద్దు మణిగింది.

టునీషియాలో జాతీయవాద ధోరణులను సహించని అమెరికా ఫ్రాన్స్ ప్రభావాన్ని తగ్గించి తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు కుట్రలు పన్నింది. 'టునీషియా ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభంతో పెరిగిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణాలను చూపి, బౌర్‌జిబాపై 'అసమర్థ పాలకుడు' ముద్రవేసి 1987లో సైనిక తిరుగుబాటు చేయించింది. అలా టునీషియా సైన్యాధిపతిగా వున్న బెన్‌అలీ దేశాధ్యక్షుడయ్యాడు. ఫ్రాన్స్‌ను పక్కన బెట్టి బెన్‌అలీ అమెరికా సామ్రాజ్యవాదులకు నమ్మిన బంటుగా మారాడు. నవంబర్‌లో తిరుగుబాటు చేసిన బెన్‌అలీ ఒక నెల రోజులకే ఐ.ఎమ్.ఎఫ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఐ.ఎమ్.ఎఫ్‌ను కాదంటే దేశ

రాజకీయాలను ఎలా తల క్రిందులు చేస్తూందో ఈ ఘటన అందరికీ తెలిసి వచ్చినట్లు చేసింది. జనవరి 1988లో యూరోపియన్ యూనియన్‌తో మరో ఒప్పందం చేసుకున్నాడు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో విదేశీ కంపనీలకు కట్టబెట్టాడు. స్వేచ్ఛవాణిజ్య కేంద్రాలు తెరిచాడు. కార్మిక వేతనాలను 75 సెంట్లుగా తగ్గించి నిర్ణయించాడు. పశ్చిమ యూరప్ దేశాలకు కారు చౌకగా టునీషియా శ్రామికుల శ్రమశక్తిని సమకూర్చి పెట్టాడు. 23 ఏళ్ళ పాలనలో ప్రపంచబ్యాంకు ఆదేశాలను బలంగా అమలుచేశాడు. సబ్సిడీలు తగ్గించి, ఆహార సరుకుల ధరలు పెంచాడు. శ్రామికవలస పెరిగింది. ఆరున్నర లక్షల మంది విదేశాల్లో శ్రమ చేస్తున్నారు. వాళ్లు పంపిన 2 లక్షల కోట్ల డాలర్లు దేశాభివృద్ధికి ఖర్చు పెట్టకుండా విదేశీ అప్పులు, వడ్డీలు తీరుస్తున్నాడు. దేశాన్ని కొల్లగొట్టి దోచిపెట్టడమే కాదు, విదేశాల్లో అమ్ముకున్న శ్రమతో తెచ్చిన డబ్బులు కూడా ఐ.ఎం.ఎఫ్‌కే కట్టబెట్టిన దుష్ట పాలకుడు బెన్ అలీ.

అధికధరలు, నిరుద్యోగం, అవినీతి సమస్యలు ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. దేశ సంపదలో సగం బెన్‌అలీ, భార్య, బంధువులు కొల్లగొట్టారు. దేశంలోని ప్రధాన పారిశ్రామిక, వ్యాపార సంస్థలన్నీ అధ్యక్షుడి బంధువర్గం చేతిలో ఉన్నాయి. అధ్యక్షుడి భార్య ప్రభుత్వ విమానంలో దేశ విదేశాలు తిరిగి కోట్లాది రూపాయాల విలాస వస్తువులు కొనడం పత్రికలకెక్కింది. దేశంలో అలజడి మొదలుకాగానే ఆమె 1500 కిలోల బంగారాన్ని ఎత్తుకొని పోయింది.

దీనికితోడు నిరంకుశత్వం, 1990లో ప్రతిపక్షాల పైన పత్రికలపైన, ప్రజాస్వామిక జాతీయవాదులపైన దాడులు చేసి తీవ్రంగా అణచివేశాడు. అమెరికా ఫ్రాన్సలతో సహా సామ్రాజ్యవాద దేశాలన్నీ బెన్‌అలీకి మద్ధతుగా నిలిచి నిలబెట్టినవే.

టునీషియా పేరుకు గణతంత్ర రాజ్యం. జైన్‌పాల్ అబీదిన్ బెన్‌అలీ కి కాన్‌స్టిట్యూషనల్ డెమక్రటిక్ రాలీ (ఆర్.సి.డి) అనే పార్టీ ఉంది. అది ఎన్నిసార్లు ఎన్నికలు జరిగినా ఘనవిజయం సాధిస్తుంది. 2009లో కూడా 90శాతం ఓట్లు వచ్చాయి. ప్రజల్లో ఎంత అసంతృప్తి, వ్యతిరేకత ఉన్నా ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపొందడం అన్ని దేశాల నియంతలకు సాధ్యమే! బెన్ అలీకి కూడా అది సాధ్యమే.

ప్రపంచంలో ప్రజాస్వామ్యం గురించి 167 ప్రపంచదేశాల అధ్యయన జాబితా తయారుచేసిన ఎకనమిస్ట్ పత్రిక దీనికి 141వ స్థానం ఇస్తే, పత్రికా స్వేచ్ఛ గురించి సర్వే చేసిన 173 దేశాల జాబితాలో దీనికి 143వ స్థానం దక్కింది. అంటే ఇక్కడ ప్రజాస్వామ్యం, ప్రతికా స్వేచ్ఛ రెండూ లెవన్నమాట. ఇంటర్నెట్ శతృవుల జాబితాలో టునీషియాను చేర్చింది మరో సంస్థ. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసం మాట్లాడిన వాళ్ళు 20 సం॥లనుండి జైళ్ళలో మగ్గుతున్నారు. విదేశాల్లో శరణార్దులుగా ఉన్నారు. దేశంలో ఏ ఒక్క పౌరహక్కుల సంఘాన్ని కూడా నియంత బెన్‌అలీ పని చేయనీయలేదు. మధ్య యుగాలనాటి చీకటి రాజ్యం గుర్తుకు వస్తుంది. టునీషియాలో దొంగలస్వామ్యం ఉంది. అవినీతి, కుంభకోణాలు జరపడంలో, విదేశాలకు సంపద తరలింపులో మాత్రం ప్రథమస్థానం సంపాదించింది.


దేశం మొత్తాన్ని ఒక్క సారి జాగృతం చేసిన మహమ్మద్ బొవజీజి విషాదగాథ నియంతృత్వ వ్యతిరేకపోరాట జ్వాలల్ని రగిలించి ప్రజాపోరాటాల విజయగాథగా మారింది. బెన్‌అలీ ప్రభుత్వం కూలిపోయే ముందు టునీషియాలోని దోపిడి పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు ప్రజాపోరాటాలపై బురద జల్లడానికి, అణచివేయడానికి అన్ని పద్ధతులు అమలుచేసి అవి ఫలించకపోవడంతో మాటమార్చి బెన్‌అలీ (తమ నమ్మినబంటునే) నిరంకుశుడని, సంక్షోభానికి అతనే కారకుడని, అతన్ని తొలగించడమే సమస్యకు పరిష్కారమని కొత్త మాటలతో మరోసారి ప్రజల్ని మోసం చేసేందుకు సిద్ధపడుతున్నారు. ప్రజా వెల్లువకు నాయకత్వం వహించిన జనరల్ యూనియన్ ఆఫ్ టునీషియాన్ వర్కర్స్ పార్టీని పక్కన బెట్టి కొత్త సీసాలో పాత సారాలాగ 'జాతీయ ఐక్యతా మధ్యంతర ప్రభుత్వాన్ని' ఏర్పాటుచేసి రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఆర్థికం, అంతరంగిక వ్యవహారాల శాఖలను బెన్‌అలీ అనుయాయులతో నింపివేశారు. ఈ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదు. ప్రజలు ఆర్.సి.డి నాయకులను తొలగించాలని ఆందోళనలు చేపట్టారు. కొత్త ప్రభుత్వం ఐ.ఎం.ఎఫ్‌తో తెగతెంపులు చేసుకుంటానని నమ్మ బలుకుతూనే అణచివేత చర్యలను చేపట్టింది. సామ్రాజ్యవాద సంస్థలైన ద్రవ్యసంస్థలు రుద్దిన నయా ఉదారవాద సంస్కరణల నుండి తెగతెంపులు చేసుకోకుండా అక్కడ సామ్రాజ్యవాదం పీడ విరగడ కాదు. వాటికి అనుకూలమైన అవినీతి నిరంకుశ పాలన కూడా అంతం కాదు. సామ్రాజ్యవాదాన్ని, దేశంలో దోపిడిని, నిరంకుశ పాలనను అంతం చేసే వరకు ఈ పోరాటం నిరంతరం కొనసాగవలసే ఉంది.

టునీషియా జాతీయ పుష్పం మల్లె. ఆ పేరు మీదనే ఈ విప్లవ వెల్లువకు 'జాస్మిన్ రివల్యూషన్' (మల్లె విప్లవం) అని పేరు పెట్టుకున్నారు. టునీషియా లాగానే అన్ని చోట్లా ప్రజల్లో అసంతృప్తి ఉంది. అది రగులు కోవడానికి సిద్ధంగా వుంది. ఉత్తర ఆఫ్రికాతోపాటు పశ్చిమాసియాలోని అరబ్ ప్రపంచంలో గొప్ప కదలిక ప్రారంభమయ్యింది. టునీషియా విప్లవం ప్రారంభం మాత్రమే. అది మార్గదర్శకంగా ఉండి మిగిలిన విప్లవాలను మేల్కొలుపుతుంది. ఇక్కడి తరువాత పరిణామాలు కూడా ఉద్యమ శక్తులకు అనుసరించాల్సిన విధానాలను చెబుతున్నాయి. పొంచిఉన్న సామ్రాజ్యవాద కుట్రలకు, బూటకపు నినాదాలకు ఉద్యమాలు బలికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూడా హెచ్చరిస్తున్నాయి. ట్యునీషియా మల్లెలు ఎర్ర మల్లెలుగా ప్రపంచంలో ముఖ్యంగా అరబ్ ప్రపంచంలో భవిష్యత్ తరాలకు సదా గుర్తుంటాయి.

'ఒక నిప్పు రవ్వ దావానలం అవుతుందని' 'ప్రజల అసంతృప్తి విస్పోటన స్థాయిలో ఉందని' టునీషియా 'మల్లె విప్లవం' చెబుతుంది. ఈ దోపిడీ వ్యవస్థను కూల్చి కొత్త ఆర్థిక రాజకీయ వ్యవస్థను నిర్మించాల్సి ఉంది. నేటి విప్లవ వెల్లువ ప్రజల సంఘటిత శక్తిని నిరూపించింది. అది నూతన వ్యవస్థ నిర్మాణానికి అనుగుణంగా రాజకీయ కార్యక్రమాన్ని రూపొందించుకొని రాజీలేని పోరాటంతో సామ్రాజ్యవాదాన్ని, నిరంకుశ దోపిడీ పాలనను తుదముట్టించాల్సి ఉంది. టునీషియా విప్లవం అరబ్ ప్రపంచాన్ని రగిలించిన నిప్పురవ్వగా నిలిచి ఉంటుంది.

## అరబ్బు ప్రపంచంలో రాజకీయ సంక్షోభం - 1

# టునీషియా 'మల్లె'ల విప్లవం అరబ్ పప్రంచానికి స్ఫూర్తి దాయకం




2010 డిసెంబర్ నుండి ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా ప్రాంతాలలోని అరబ్ ప్రపంచం నిప్పుల కుంపటిగా మారింది. అరబ్ ప్రజలు సామ్రాజ్యవాద రాజకీయ ఆర్థిక విధానాలను దిక్కరిస్తూ, ప్రపంచీకరణ విధానాలకు కాలం చెల్లిందని ప్రకటిస్తున్నారు. ఇది ఒక నూతన పరిణామమే. ఇక్కడ దశాబ్దాలుగా పరిపాలించిన నియంతలను 'చీ' కొడుతున్నారు. టునీషియాలో మొదలై ఈజిప్ట్‌ను కదిలించిన ప్రజాస్వామిక ఉద్యమాలు నియంతృత్వాలను కదిపి కుదిపేస్తున్నాయి. అల్జీరియానుండి ఒమన్, వరకు సూడాన్‌నుండి మొరాకో వరకు డజనుకుపైగా దేశాలపై బలమైన ప్రభావాన్ని వేస్తున్నాయి. ప్రపంచంలో ముడిచమురు సహజవాయువు నిలువలు మూడింట రెండింతలు ఉన్న అరబ్ ప్రపంచంలో విప్లవ సంక్షోభం అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల ప్రపంచ ఆర్థిక రాజకీయ మిలిటరీ వ్యూహాలకు అవరోధంగా మారింది.

రెండు దశాబ్దాల ప్రపంచీకరణ వ్యతిరేకత, నిరసన సియాటిల్ ప్రదర్శనలకి పరిమితంకాదు. అరబ్ ప్రపంచంలో నియంతృత్వ వ్యతిరేక ప్రజాస్వామిక ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. నిర్వేదాన్ని విదిలించికొట్టి స్తబ్దతను దూరంగా నెట్టేసిన టునీషియా ప్రజల ప్రతిఘటన యధాస్థితి ఇంకెంత మాత్రం కొనసాగదని చాటి చెబుతుంది. అట్టడుగు పొరలనుండి పెల్లుబికిన ఆగ్రహజ్వాలలు మాటలకే పరిమితం కాకుండా అవి చేతల్లోకి మారి అధికారాన్ని చేతుల్లోకి తీసుకు తీరుతాయి. నిరంకుశ పాలకుల అవినీతి పాలనకు, సామ్రాజ్యవాద దుష్టపన్నాగాలకు వ్యతిరేకంగా అరబ్ ప్రపంచం ఇప్పుడు ముందుకు సాగుతుంది.

ఉత్తర ఆఫ్రికాలో మధ్యధరా సముద్రం పశ్చిమ తీరంలో లిబియా, అల్జీరియా సరిహద్దులుగా 1 కోటి జనాభా గల చిన్న దేశం టునీషియా. 2011 జనవరి 14న అర్థరాత్రి సమయంలో 23 సం॥లు ఆ దేశాన్ని పాలించిన నియంత అబిదిన్ బెన్ అలీ విమానంలో పారిపోయాడు. టునీషియాలో ప్రజ్వరిల్లిన ప్రజాందోళన చూసిన ఇటువంటి నిరంకుశ పాలకులకు ఫ్రాన్స్ ఆశ్రయం ఇవ్వడానికి భయపడింది. సౌదీ అరేబియా మాత్రం ఆశ్రయం ఇచ్చింది. 2 దశాబ్దాలు పైగా పాలించిన నియంతృత్వ పాలకుడు ప్రాణభయంతో ఎందుకు పరుగులు తీసాడు? అది ఎలా జరిగింది? ఆ ఘటనల క్రమంలోకి వెళ్ళి 28 రోజులు పరిణామాలను శ్రద్ధగా పరిశీలించాల్సి వుంది.

2010 డిసెంబర్ 17న 28సం॥ల యువకుడు మహమ్మద్ బొవజిజీ రోడ్డు పక్కన పండ్లు, కూరగాయాలు అమ్ముకుంటున్నాడు. లంచం ఇవ్వలేదన్న కారణంతో అనుమతి లేకుండా అమ్ముతున్నాడని ఆరోపించి, అదే నేరంగా బండిని పడదోసి కూరగాయాలు, పళ్ళు మట్టిపాలు చేశారు. తోపుడు బండికి అనుమతి అవసరం లేదని స్థానిక చట్టాలు చెబుతున్నాయి. అప్పుడే పురపాలక సంఘం మహిళా అధికారి కూడా చెయ్యి చేసుకుంది. నడివీధిలో తిట్లూ, తన్నులు తిన్న మహమ్మద్ అవమానపడి ఏడ్చాడు. నగర అధికారుల దగ్గరకు వేళ్ళేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడా న్యాయం దొరకదని, ఇది దొంగల రాజ్యమని అర్థం చేసుకొని ఇంటర్నేట్ ద్వారా ఫేస్ బుక్ మీద తల్లికి ఒక సందేశం పంపాడు. అదే తన చివరి మాట.... అదే టునీషియా 'మల్లె విప్లవానికి' బాటవేసిన ఆత్మార్పణ యుద్ధభేరి.

*(మిగతాది 42వ పేజీలో...)*